అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 11-8-2017 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 224 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

కట్టి తీరుతాం..

ప్రాజెక్టులపై కేసులేసినా భయపడను

కాళేశ్వరం నుంచి ఎస్సారెస్పీని నింపుతాం

- ఇప్పటికే ఆ ప్రాజెక్టుపై 96 కేసులు
- దీనిపై కాంగ్రెస్సోళ్లను ప్రజలు ప్రశ్నించాలి
- ఏడాదిలో 'పునరుజ్జీవం'ను పూర్తిచేస్తాం...
- శ్రీరాంసాగర్ వద్ద పైలాన్ ఆవిష్కరించిన సీఎం కేసీఆర్

వివరాలు 2లో



సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు

వెల్లువెత్తిన నిరసనలు

డీఎస్సీ అభ్యర్థులను ఈడ్చుకెళ్లిన పోలీసులు

9లో





11 మంది మాజీ ఎంపీలపై అభియోగాలు

లంచానికి ప్రశ్నల స్కాం కేసులో.. 2005 స్టింగ్ ఆపరేషన్‌లో బుక్

- 28న వ్యక్తిగతంగా హాజరు పరచాలని ప్రత్యేక కోర్టు ఆదేశం
- నిందితుల్లో ఆరుగురు బీజేపీ మాజీ ఎంపీలు

న్యూఢిల్లీ: లంచం తీసుకొని పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగేందుకు ఒప్పుకున్న కేసులో 11మంది మాజీ ఎంపీలపై అవినీతి, నేరపూరిత కుట్ర కింద అభియోగాలు నమోదు చేయాల్సిందిగా ఢిల్లీ పోలీసులను ప్రత్యేక కోర్టు ఆదేశించింది. ఈ కేసులోని నిందితులందరినీ ఈ నెల 28న తమ ముందు హాజరుపరచాలని ప్రత్యేకకోర్టు న్యాయమూర్తి పూనమ్ చౌదరీ ఆదేశించారు. గురువారం విచారణ సందర్భంగా ఇద్దరు ఎంపీలు హాజరు కాగా, మిగతా ఎంపీలు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు పొందారు. 2005లో ఆపరేషన్ దుర్యోధన పేరుతో నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్‌లో 11మంది ఎంపీలు డబ్బులు తీసుకొని పార్లమెంట్‌లో ప్రశ్నలు ...9లో

ఆ పత్రం లేకుండా బీమా కల్పించొద్దు

ఇన్సూరెన్స్ కంపెనీలను ఆదేశించిన సుప్రీంకోర్టు వివరాలు 2లో

నీట్‌కు కామన్ ప్రశ్నాపత్రం ఉండాల్సిందే

అఫిడవిట్ దాఖలు చేయాలని సీబీఎస్‌ఈకి 'సుప్రీం' ఆదేశాలు 2లో

గోరక్షణ దళాల దాడులు హేయమైన చర్య

ముస్లింలలో అభద్రతా భావం పెరుగుతుంది ఉప రాష్ట్రపతి హమీద్ అన్సారీ 2లో

సీపీఐ(ఎం) కార్యాలయానికి నిప్పు

త్రిపురలో దుండగుల ఘాతుకం.. ఏడుగురికి తీవ్ర గాయాలు వివరాలు 2లో

ప్రజా సమస్యల గొంతుక

దేశ ప్రజలకు ఆయన ఆదర్శం

- ఆయన సేవను మరువలేము
- ప్రతిపక్షాలను ఐక్యం చేయడంలో కీలక పాత్ర పోషించారు
- సమస్యల పరిష్కారానికి మార్గం చూపడంలో ఆయన కృషి అమోఘం
- సీతారాం ఏచూరి వీడ్కోలు సభలో అధికార, ప్రతిపక్ష సభ్యులు

న్యూఢిల్లీ : సీతారాం ఏచూరికి రాజ్యసభ ఘన వీడ్కోలు పలికింది. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి, ఆ పార్టీ రాజ్యసభ పక్షనేత సీతారాం ఏచూరి పదవి కాలం గురువారంతో ముగిసింది. ఆయనకు రాజ్యసభ గురువారం వీడ్కోలు పలికింది. ఆయనతో పాటు గుజరాత్‌కు చెందిన బీజేపీ సభ్యుడు దిలీప్ బాయ్ పాండ్య, పశ్చిమ బెంగాల్‌కు చెందిన తృణముల్ కాంగ్రెస్ సభ్యుడు డి. బందోపాధ్యాయలకు కూడా రాజ్యసభ వీడ్కోలు తెలిపింది. ఈ సందర్భంగా అధికార,



(ఫైల్)

ప్రతిపక్ష నేతలు, వివిధ పార్టీల నేతలు ఏచూరితో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఏచూరి వ్యక్తిత్వం, ఆయన సభలో పాల్గొన్న తీరు, ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాన్ని సభ్యులందరూ కొనియాడారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ సభ్యుడు ప్రొఫెసర్ రామ్ గోపాల్ యాదవ్ కంట తడి పెట్టుకున్నారు. అన్ని వేళల ప్రజా సమస్యల గొంతుకై నిలిచారని, ప్రభుత్వానికి, ప్రతిపక్షానికి నిరంతరం సలహాలిచ్చేవారని మరికొందరు సభ్యులు తెలిపారు. రాజ్యసభ నిర్వహణలో ఆయన సేవలు మరువలేనివని అన్నారు. ప్రతిపక్షాలను ఐక్యం చేయడంలో కీలక పాత్ర పోషించారని పలువురు సభ్యులు అభిప్రాయపడ్డారు. సమస్యల పరిష్కారానికి మార్గం చూపడంలో ఆయన కృషి అమోఘమని, దేశమెదుర్కొంటున్న సవాళ్లపైన, ప్రజలెదుర్కొంటున్న సమస్యలపైన జరిగే ప్రతి చర్చలో పాల్గొనేవారని గుర్తు చేసుకున్నారు. తొలుత రాజ్యసభ డిప్యూటీ ఛైర్మెన్ పిజె కురియన్ మాట్లాడుతూ ఏచూరి పార్లమెంట్ లోపల, వెలుపల ప్రజల గురించే మాట్లాడేవారని, ఆయనకు ఆ పార్టీ అదే నేర్పిందన్నారు. వివిధ ...9లో

భావ ప్రకటన లేకుండా.. బంగారు తెలంగాణ

ఎలా సాధ్యం?



వివరాలు 12లో

ఎస్వీకేలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో అమర్, శ్రీనివాస్ రెడ్డి, రామ్మూర్తి, తెలకపల్లి రవి, వీరయ్య, సోమయ్య,తదితరులు

ఎస్పీని వదిలి.. ఎస్ఐపై వేటు

నవతెలంగాణ-సిరిసిల్ల



దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నేరెళ్ల ఘటనలో పోలీసు ఉన్నతాధికారులు సీసీఎస్ ఎస్ఐ రవీందర్‌ను సస్పెండ్ చేశారు. ఐజీ నాగిరెడ్డి ఆదేశాలతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ గురువారం ఈ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఘటనలో ఎస్పీపై ప్రధానంగా ఆరోపణలు రాగా...అతన్ని వదిలి ఎస్ఐని బలిచేయటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

జులై రెండో తేదీన ఇసుకలారీల దహనం కేసులో ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారిని చిత్రహింసలకు గురిచేశారు. జీవితంలో ఏ పనీ చేయలేని విధంగా కుళ్లబొడిచారు. థర్డ్‌డిగ్రీ ప్రయోగించారు. ఎస్పీనే స్వయంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న విమర్శలూ వెల్లువెత్తాయి. ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావటంతో ...9లో

చీకటితో యుద్ధం



భద్రతా దళాల పెల్లెట్‌గన్స్ కాల్పుల్లో కండ్లు కోల్పోయిన యువకులు

- 1000 మందికి పైగా బాధితులకు శ్రీనగర్‌లోని ఆస్పత్రిలో చికిత్స

వివరాలు 2లో

టాస్క్‌ఫోర్సు కార్యాలయంపై...

మానవబాంబు కేసు కొట్టివేత

12 ఏండ్ల తర్వాత తీర్పు

- నిందితులను నిర్దోషులుగా తేల్చిన నాంపల్లి కోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్

బేగంపేట టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై మానవబాంబు దాడి కేసులో తొమ్మిది మంది నిందితులను నాంపల్లి కోర్టు నిర్దోషులుగా తేల్చింది. ప్రాసిక్యూషన్ ఆధారాలు చూపలేకపోవడంతో నిందితులపై కేసును న్యాయస్థానం కొట్టివేసింది. ఈ కేసుకు సంబంధించి నాంపల్లి న్యాయస్థానం గురువారం తుదితీర్పు వెలువరించింది. టాస్క్‌ఫోర్సు కార్యాలయంపై ...9లో



ఎస్ఎఫ్ఐ ఆందోళన

- విద్యార్థిని ఆత్మహత్యకు నిరసన
- నారాయణ ప్రధాన కార్యాలయం భవనం అద్దాలు, కంప్యూటర్లు ధ్వంసం
- రాష్ట్ర వ్యాప్తంగా కళాశాల దిష్టిబొమ్మల దహనం

వివరాలు 2లో



ఇలాంటి డైలాగ్స్ డెబ్బై ఏండ్ల నుంచి వింటూనే వున్నాంరా... అనేవాళ్లే మారుతున్నారు గానీ.. మన బతుకులు మారడం లేదు..!!

కౌన్సెలింగ్ కష్టాలు

తెలంగాణ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ఎంటెక్, ఎం ఫార్మసీ కౌన్సెలింగ్ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) నిబంధనలతో విద్యార్థులు విలవిలలాడుతున్నారు. ట్రాన్స్‌క్రిప్ట్ తీసుకురావాలంటూ కేయూలోని ప్రవేశాల విభాగం అధికారులు స్పష్టం చేస్తుండటంతో విద్యార్థులు హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూకు పరుగులు తీస్తున్నారు. విద్యార్థులు ఆర్థికంగా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

జేఎన్‌టీయూ నిబంధనలతో విద్యార్థులు విలవిల

- ఎంటెక్ కౌన్సెలింగ్‌లో తప్పని తిప్పలు
- ట్రాన్స్‌క్రిప్ట్ కోసం హైదరాబాద్‌కు పరుగులు
- ఆర్థికంగా నష్టం.. చదువులకు పేద విద్యార్థులు దూరం

నవతెలంగాణ-కేయూ క్యాంపస్

ఈనెల 5 నుంచి ఎం ఫార్మసీ ప్రవేశానికి సర్టిఫికెట్ వెరిఫికేషన్, ఆరో తేదీ నుంచి ఎంటెక్ ప్రవేశ ప్రక్రియలు ప్రారంభమయ్యాయి. కేయూలోని ప్రవేశాల విభాగంలో కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఎంటెక్ కౌన్సెలింగ్‌లోనే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సహజంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో ఏదైనా సర్టిఫికెట్ లేకుంటే సదరు సర్టిఫికెట్ తక్కువగా ఉందని రాసి (పెండింగులో పెట్టి) వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తిచేయడం పరిపాటి. కానీ, ఈసారి అధికారులు ...9లో



(ఫైల్)

నేడు విద్యా సంస్థలు బంద్

- బంద్‌కు సహకరించాలని విద్యాసంస్థల యాజమాన్యాలకు ఎమ్ఎస్ఎఫ్ విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తెలుగు రాష్ట్రాల్లో విద్యా సంస్థలను బంద్ చేయాలని ఎమ్ఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు రుద్రవరం లింగస్వామి మాదిగ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ బంద్‌కు విద్యా సంస్థల యాజమాన్యాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సీపీఐ(ఎం) కార్యాలయానికి నిప్పు

- త్రిపురలో దుండగుల ఘాతుకం
- ఏడుగురికి తీవ్ర గాయాలు

అగర్తల: త్రిపురలో దుండగులు రెచ్చిపోయారు. సీపీఐ(ఎం) కార్యాలయంపై దాడికి తెగబడ్డారు. కుమ్మువాంగ్లో ప్రాంతంలోని పార్టీ కార్యాలయానికి నిప్పుపెట్టగా.. పార్టీ కార్యకర్తలు ఏడుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఇండిజెనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీఎఫ్టీ) కార్యకర్తలు ఈ దాడికి పాల్పడినట్టు అనుమానిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఐపీఎఫ్టీ కార్యకర్తలు బుధవారం సీపీఐ(ఎం) కార్యాలయం వద్ద బైకులు నిప్పుపెట్టారని.. దీంతో మంటలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయని పోలీస్ కంట్రోల్ రూమ్ ఎస్పీ హరికుమార్ దేబ్‌బర్మ చెప్పారు. ఈ ఘటనను సీపీఐ(ఎం) త్రిపుర రాష్ట్ర కార్యదర్శి బిజన్ ధర్ ఖండించారు. ఏడుగురు పార్టీ కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయని చెప్పారు. ఐపీఎఫ్టీ కార్యకర్తలు జరిగిన ఈ దాడిలో 25 నుంచి 27 బైకులు కాలిపోయినట్టు చెప్పారు. దుండగులు దాడికి పాల్పడిన సమయంలో సమీప హాలులో పార్టీ సమావేశం జరుగుతుందని చెప్పారు. ప్రతిపక్ష బీజేపీతో చేతులు కలిపి రాష్ట్రంలో శాంతియుత వాతావరణాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నిస్తోందని ధర్ ఆరోపించారు.

నీట్‌కు కామన్ ప్రశ్నాపత్రం ఉండాల్సిందే

- అఫిడవిట్ దాఖలు చేయాలి: సుప్రీం

న్యూఢిల్లీ : నేషనల్ ఎలిజిబిలిటీ అండ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) ప్రశ్నాపత్రం అన్ని రాష్ట్రాలకు ఒకటే ఉండేలా చూసుకోవాలని సీబీఎస్ఈకి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీ చేసింది. మే7న నిర్వహించిన నీట్ ప్రశ్నాపత్రంలో అనువాద తప్పిదాలు అధికంగా ఉండటంతో పలు రాష్ట్రాల విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ప్రాంతీయ భాషల్లో ప్రశ్నపత్రం అందించినప్పటికీ విద్యార్థులు సమాధానాలు రాయలేకపోతున్నారని సంకల్ప్ చారిటబుల్ అనే ఓ సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ అమితావ రాయ్, జస్టిస్ ఎఎమ్ ఖాన్‌విల్కర్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ఆంగ్లం, హిందీ భాషల్లో ఉన్న నీట్ ప్రశ్నపత్రాన్ని విద్యార్థులు సులువుగా సమాధానం రాయగలుగుతున్నారని, అదే ప్రశ్నపత్రం ప్రాంతీయ భాషల్లో ఉన్నప్పటికీ రాయలేకపోతున్నారని పిటిషనర్ తరుపున సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ వాదనలు వినిపించారు. నీట్ పరీక్ష నిర్వాహకులు ప్రశ్నపత్రాన్ని ప్రాంతీయ భాషల్లో సరిగ్గా అనువాదం చేయలేకపోవడంతోనే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఫలితంగా వేలాది మంది నీట్‌లో అనర్హులుగా మిగిలిపోతున్నారని వాదించారు. ఒక్కోసారి ప్రాంతీయ భాషల్లో పొందుపర్చిన ప్రశ్నలు కూడా తప్పుగా ఉంటున్నాయని అన్నారు. కాగా, నీట్ ప్రశ్నపత్రంలో అడిగే ప్రశ్నలన్నీ అన్ని రాష్ట్రాల విద్యార్థులకు ఒకేలా ఉంటాయని సీబీఎస్ఈ తరుపున అదనపు సొలిసిటర్ జనరల్ మనీందర్ సింగ్ వాదనలు వినిపించారు. ఒక రాష్ట్ర విద్యార్థులకు కష్టమైన ప్రశ్నలు, మరో రాష్ట్ర విద్యార్థులకు సులువైన ప్రశ్నలను నీట్ ప్రశ్నపత్రంలో పొందుపర్చడం ఎట్టిపరిస్థితుల్లోనూ జరదన్నారు. ఇది జాతీయ స్థాయి పరీక్ష అన్నారు. నీట్ ప్రశ్నపత్రాన్ని ఆంగ్లంలో రూపొందించి అనంతరం హిందీలో అనువాదం చేస్తామని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) పేర్కొన్నది. నీట్ ప్రశ్నపత్రాన్ని అన్ని ప్రాంతీయ భాషల్లో రూపొందిస్తున్నామని తెలిపింది. అయితే, పలు భాషలకు సరైన అనువాదకులు అందుబాటులో లేకపోవడంతో అనువాదంలో సమస్యలు తలెత్తుతున్నాయని అంగీకరించింది. 'నీట్ ప్రశ్నాపత్రం ఒకేలా ఉండాలని మేం ఆశిస్తున్నాం. దీనిపై మీరెలాంటి చర్యలు చేపట్టారో తెలియజేయండి' అని జస్టిస్ దీపక్ మిశ్రా పేర్కొన్నారు. నీట్ పరీక్ష నిర్వహణలో భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని కోరారు.

మూతపడ్డ 682 టెక్స్‌టైల్ మిల్లులు

న్యూఢిల్లీ : ఈ యేడాది జూన్ నాటికి దేశవ్యాప్తంగా 682 టెక్స్‌టైల్(నూలు) మిల్లులు మూత పడ్డాయని కేంద్ర జౌళిశాఖ మంత్రి స్మృతి ఇరానీ లోక్‌సభలో గురువారం వెల్లడించారు. వీటిలో తమిళనాడు నుంచి అత్యధికంగా 232 మిల్లులున్నాయని ఆమె తెలిపారు. అలాగే, మహారాష్ట్ర నుంచి 85, యూపీ 60, హర్యానా నుంచి 42 ఉన్నాయని వివరించారు. దేశంలో ప్రస్తుతం 1,399 మిల్లులు పని చేస్తున్నాయన్నారు. వీటిలో 752 తమిళనాడు, 135 మహారాష్ట్ర, 112 ఆంధ్రప్రదేశ్ నుంచి ఉన్నాయన్నారు. అయితే.. కొత్త నూలు మిల్లుల ఏర్పాటు కోసం కేంద్రం ఏమైనా పథకాన్ని ప్రవేశ పెడుతుందా? అన్న ప్రశ్నకు ఆమె సానుకూలంగా సమాధానమిచ్చారు.

కార్తీ 'లుకవుట్ నోటీస్'పై హైకోర్టు స్టే

చెన్నయ్: కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరంపై సీబీఐ జారీ చేసిన 'లుకవుట్ నోటీసు'పై స్టే విధిస్తూ చెన్నయ్ హైకోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసింది. పాస్‌పోర్ట్ చట్టం కింద కార్తీ చిదంబరంతో పాటు మరో నలుగురుపై సీబీఐ అవినీతి కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. కార్తీ చిదంబరం, తదితరులు దాఖలు చేసిన పిటిషన్లను పరిశీలించిన న్యాయమూర్తి ఎం దురైస్వామి వారికి స్టే మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై కౌంటర్ అఫిడవిట్‌ను సెప్టెంబర్ 4 నాటికి దాఖలు చేయాలని ఆయన కేంద్రాన్ని ఆదేశించారు. కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిధిలోని ఫారినర్ రీజనల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం కార్తీ చిదంబరం, మరో నలుగురు నిందితులపై గత ఏడాది జూన్ 16న ఈ లుకవుట్ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే. తనపై జారీ చేసిన లుకవుట్ నోటీసు కేంద్ర ప్రభుత్వ 'రాజకీయ ప్రతీకారం'లో భాగమేనని కార్తీ తన పిటిషన్‌లో కోర్టుకు విన్నవించారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం మద్యం వ్యాపారి విజయ్ మాల్యా దేశం విడిచి వెళ్లిన ఉదంతం అనంతరం కార్తీ చిదంబరంపై లుకవుట్ నోటీసు జారీ చేయడం అనివార్యమైందని కోర్టుకు వివరించింది.

పెండింగ్‌లో 6,400కు పైగా అవినీతి కేసులు

న్యూఢిల్లీ : దేశంలో వివిధ కోర్టుల్లో 6,400కు పైగా అవినీతి కేసులు పెండింగ్‌లో వున్నాయని, సీబీఐ దర్యాప్తు చేస్తున్న ఈ కేసుల్లో 115 కేసులు రాజకీయ నాయకులపై వున్నట్టు కేంద్రం తెలిపింది. ఈ ఏడాదిలో జూన్ వరకూ 339 అవినీతి కేసులను సీబీఐ నమోదు చేసింది. ఇందులో 487 కేసులు ప్రభుత్వ ఉద్యోగులపైన, 660 కేసులు ప్రైవేటు వ్యక్తులపైనా, 14 కేసులు రాజకీయ నాయకులపైనా వున్నట్టు మంత్రి జితేంద్ర సింగ్ రాజ్యసభలో లిఖిత పూర్వక సమాధానంలో తెలిపారు. 2016లో మొత్తం 2,842 మందిపై 673 అవినీతి కేసులు నమోదైనట్టు తెలిపారు. ఇందులో ఆరుగురు రాజకీయ నేతలున్నారు. 2015లో 5,957 మందిపై 617 అవినీతి కేసులు నమోదు చేయగా, ఇందులో 21 మంది రాజకీయ నాయకులు వున్నారని మంత్రి తెలిపారు. ఈ ఏడాది జూన్ 30 నాటికి మొత్తం 6,414 కేసులు పెండింగ్‌లో వున్నాయని, ఈ కేసుల్లో 16,875 మంది ప్రభుత్వ ఉద్యోగులు, 18,780 మంది ప్రైవేటు వ్యక్తులు, 115 మంది రాజకీయ నాయకులు నిందితులుగా వున్నారని మంత్రి తెలిపారు. గత రెండేళ్లలో 1,800 అవినీతి కేసుల్లో ఫలితం వచ్చిందన్నారు. 2015లో 878, 2016లో 1,005 కేసుల్లో విచారణ పూర్తయింది. ఈ ఏడాదిలో జూన్ 30 నాటికి 199 కేసుల్లో విచారణ పూర్తయిందని, ఇందులో మొత్తం 420 మంది దోషులుగా తేలారన్నారు. ఇందులో 228 మంది ప్రభుత్వ ఉద్యోగులు, 192 మంది ప్రైవేటు ఉద్యోగులు వున్నారు.

ఢిల్లీలో అల్‌ఖైదా ఉగ్రవాది అరెస్టు

న్యూఢిల్లీ : అల్‌ఖైదా ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న రజా ఉల్ అహ్మద్ అనే వ్యక్తిని ఢిల్లీ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అతడు ఢిల్లీ నుంచి నేపాల్‌కు పారిపోయేందుకు యత్నిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం అందడంతో వల వేసి పట్టుకున్నట్టు సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. అనంతరం అహ్మద్‌ను బెంగాల్ పోలీసులకు అప్పగించారు. నదిలీ కలిసి రాకెట్‌లో అహ్మద్‌పై బెంగాల్‌లో కేసులు నమోదయ్యాయి.

ఢిల్లీలో స్వైన్‌ఫ్లూతో నలుగురి మృతి

- కేంద్రమంత్రికి సోకిన వ్యాధి

స్వైన్‌ఫ్లూ విజృంభించటంతో..నలుగురు చనిపోయారని ఢిల్లీ ప్రభుత్వం గురువారం ప్రకటించింది.దేశరాజధాని స్వైన్‌ఫ్లూ వ్యాధి కోరల్లో చిక్కుకున్నదనేలా ఆస్పత్రుల్లో రోగుల సంఖ్య పెరుగుతున్నది. ..కాగా కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్‌కు స్వైన్‌ఫ్లూ సోకింది. ఆయన పార్లమెంటు సమావేశాలకు వెళ్లలేకపోయారని బీజేపీ వర్గాలు తెలిపాయి ఇప్పటివరకూ 889 కేసులు నమోదుకాగా,వారిలో నలుగురు మరణించినట్టు అధికార వర్గాలు తెలిపాయి.దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 16565 కేసులు గుర్తించగా,వారిలో 818 మంది చనిపోయారు.

మహాకూటమి కొనసాగుతుంది

జేడీ(యూ) సీనియర్ నేత శరద్ యాదవ్



పాట్నా: బీహార్‌లో మహాకూటమి.. 11 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పడిందని, మున్ముందు కూడా ఇది కొనసాగుతుందని జేడీ(యూ) సీనియర్ నేత, ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు శరద్ యాదవ్ స్పష్టం చేశారు. బీహార్‌లో శరద్‌యాదవ్ మూడు రోజుల పర్యటన గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాకూటమి నుంచి నితీశ్ బయటకు వచ్చి 2015 అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రజాతీర్పును వమ్ము చేశారని విమర్శించారు. ఆనాటి ఎన్నికల్లో రాష్ట్రంలో పాగా వేసేందుకు బీజేపీ విశ్వప్రయత్నాలు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆ పార్టీ నేతలు హెలికాప్టర్లలో వచ్చి ప్రచారాలు నిర్వహించారని తెలిపారు. ప్రధాని మోడీ.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి ప్రచారం చేశారని చెప్పారు. అయితే, కాంగ్రెస్, జేడీ(యూ), ఆర్జేడీ నేతృత్వంలోని మహాకూటమి.. బీజేపీని సమర్థంగా ఎదుర్కొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నారు. మహాకూటమి ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభుత్వాన్ని దేశవ్యాప్తంగా అన్ని పార్టీలు సమర్థించాయని తెలిపారు. పాట్నా, ముజాఫర్‌పూర్, సమస్తిపూర్ సహా 8 జిల్లాల్లో శరద్ పర్యటించనున్నారు.

జేడీ(యూ) నుంచి నితీశ్ వెలివేత తప్పదా?

బీజేపీతో కలిసి నితీశ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచి జేడీ(యూ) భవితవ్యంపై పలు రకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. నితీశ్ నిర్ణయాన్ని తొలి నుంచి వ్యతిరేకిస్తూ వస్తున్న శరద్ యాదవ్..తన అనుచరులతో కలిసి కొత్త పార్టీ పెడతారన్న వార్తలు వెలుగులోకొచ్చాయి. కానీ, తాజా పరిస్థితులను బట్టి చూస్తే నితీశ్‌నే జేడీ(యూ) నుంచి బయటకు సాగనంపడంపై ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలుస్తున్నది. నితీశ్‌ను బయటకు పంపి, కూటమిని కొనసాగించాలని శరద్ నేతృత్వంలోని సీనియర్ నేతల బృందం అభిప్రాయపడుతున్నట్టు సమాచారం. నితీశ్‌ను జేడీ(యూ) అధ్యక్ష పదవి నుంచి తొలగించే విషయంపై న్యాయ నిపుణులతో చర్చిస్తున్నట్టు పార్టీ మాజీ జనరల్ సెక్రెటరీ అరుణ్ శ్రీవాత్సవ వెల్లడించారు. రాజ్యసభ ఎన్నికల సందర్భంగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు జరిపారన్న కారణంతో అరుణ్‌పై నితీశ్ వేటు వేసిన సంగతి తెలిసిందే.


సోషల్ లోచలాకీ



'గో' దాడులు హేయమైన చర్య

ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ

న్యూఢిల్లీ : గోరక్షణ దళాల దాడులు హేయమైన చర్య అని భారత ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ పేర్కొన్నారు. దీంతో, ముస్లింలలో అభద్రతా భావం పెరిగిపోయిందన్నారు. గురువారం హమీద్ అన్సారీ పదవీ విరమణ పొందారు. పదవీ విరమణకు ముందు ఓ మీడియా సంస్థతో ఆయన మాట్లాడారు. గిరిజనులపై, ముస్లింలపై గోరక్షణ దళాల దాడులు పెరిగిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. గోవధ నిషేదం, భారత్‌మాతాకీ జై అని చెప్పకపోయినట్టయితే దేశ బహిష్కరణ చేస్తామని గోరక్షణ దళాల బెదిరింపులు, లవ్ జిహాదీ, ఘర్ వాపసీ వంటి కార్యకలాపాలతో దేశ పౌరుల్లో భయాందోళనలు నెలకొన్నాయని అన్నారు. ఇలాంటి ఘటనలతో మానవీయ విలువలు దెబ్బతినే ప్రమాదముందన్నారు. కాగా, 2015లో జరిగిన యోగా దినోత్సవంలో హమీద్ అన్సారీ పాల్గొనలేదు. అంతేగాకుండా, ఈ కార్యక్రమాన్ని రాజ్యసభ ఛానల్ ప్రసారం చేయలేదు. దీంతో, అప్పటి బీజేపీ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్ ఉపరాష్ట్రపతిని విమర్శించారు. అనంతరం క్షమాపణలు చెప్పారు. అయితే, ఈ విషయాన్ని తానేమీ సీరియస్‌గా



తీసుకోలేదని హమీద్ అన్సారీ తాజాగా పేర్కొనడం గమనార్హం.

ముగిసిన హమీద్ అన్సారీ పదవీ కాలం


హమీద్ అన్సారీ 1937,ఏప్రిల్1న కోల్‌కతాలో జన్మించారు. అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించారు. 1961లో ఇండియన్ ఫారెన్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. భారత హైకమిషనర్‌గా, యూఏఈ, అఫ్ఘనిస్థాన్, ఇరాన్, సౌదీ అరేబియా దేశాలకు భారత రాయబారిగా పనిచేశారు. భారత ప్రభుత్వం 1984లో ఆయనకు పద్మశ్రీ అవార్డు ప్రదానం చేసింది. 2000 నుంచి 2002 వరకు అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీకి వీసీగా సేవలందించారు. 2006లో జాతీయ మైనారిటీ కమిషన్ ఛైర్మెగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం భారత ఉపరాష్ట్రపతిగా ఎన్నికై రెండుసార్లు సేవలందించారు. భారత తదుపరి ఉపరాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు ప్రమాణం చేయనున్న సంగతి తెలిసిందే.

రాజకీయ ఆశ్రయం కోసమే ఉపరాష్ట్రపతి పాకులాట
బీజేపీ కార్యదర్శి కైలాష్ విజయ్‌వర్గీయ విమర్శ

ఉపరాష్ట్రపతి పదవి నుంచి రిటైర్ అయిన తర్వాత రాజకీయ ఆశ్రయం కోసం హమీద్ అన్సారీ పాకులాడుతున్నారని బీజేపీ కార్యదర్శి కైలాష్ విజయ్‌వర్గీయ విమర్శించారు. ముస్లింలలో అభద్రతాభావం పెరిగిపోయిందని హమీద్ అన్సారీ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఉపరాష్ట్రపతి తన హోదాకు తగ్గట్టు వ్యవహరించడం లేదని ఆరోపించారు. పదవీ విరమణ పొందకముందే దేశ రాజకీయాలపై హమీద్ అన్సారీ కామెంట్లు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాగా, గోరక్షణ పేరిట అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని కాషాయిమూకలు చేస్తున్న దాడులను హమీద్ అన్సారీ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులతో ముస్లింలలో అభద్రతాభావం పెరిగిపోయే ప్రమాదముందన్నారు.

యాక్సిడెంట్ బాధితుడికి వైద్యం నిరాకరించిన ఆస్పత్రులు

కేరళ సీఎం క్షమాపణ



తిరువనంతపురం : రోడ్డు ప్రమాద బాధితుడికి చికిత్స అందించేందుకు ఆసుపత్రులు నిరాకరించిన ఘటనపై కేరళ సీఎం పినరయి విజయన్ విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు విజయన్ క్షమాపణ చెప్పారు. ఆ ఘటన దురదష్టకరమని, ఇలాంటివి పునరావతం కాకుండా సరికొత్త చట్టాన్ని తీసుకొస్తామని విజయన్ అన్నారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 6న తమిళనాడుకు చెందిన మురుగన్ (30) కేరళలోని కొల్లాంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మురుగన్‌ను స్థానిక ఆసుపత్రికి తరలించారు. కాగా, అక్కడి వైద్యులు చికిత్స అందించేందుకు నిరాకరించారు. తీవ్ర గాయాలైన మురుగన్‌ను ఐదు ఆస్ప త్రులకు తీసుకెళ్ళగా.. యాక్సిడెంట్ కేసంటూ చికిత్సను నిరాకరించారు. దీంతో చికిత్స అందక మురుగన్ ప్రమాదం జరిగిన మరుసటి రోజు మృతిచెందారు. 'బాధిత కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున నేను క్షమాపణ చెబుతున్నాను. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేస్తున్నాను. కుటుంబసభ్యులను సానుభూతి తెలుపుతున్నాను' అని విజయన్ అన్నారు. ఆరోగ్య రంగంలో మంచి పురోగతి సాధించిన రాష్ట్రంలో జరగకూడని ఘటన జరిగిందని అన్నారు. 'చికిత్స నిరాకరించడానికిగల కారణాలను నిపుణులతో కూడిన వైద్య బృందం సమీక్షిస్తుంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైతే ప్రస్తుతమున్న చట్టాన్ని సవరించి కొత్త చట్టాన్ని తెస్తాం' అని విజయన్ చెప్పారు.

'ఆధారాల్లేకనే చార్జిషీటు వేయలే'



ఇండోర్: తాను దేశ వ్యతిరేక నినాదాలు చేసినట్టు పోలీసుల దగ్గర ఎలాంటి ఆధారాలూ లేవని, అందుకే చార్జిషీటు దాఖలు చేయడం లేదని జేఎన్‌యూ స్టూడెంట్స్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు కన్నయ్యకుమార్ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో సీపీఐ, ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్(ఏఐఎస్ఎఫ్), ఆలిండియా యూత్ ఫెడరేషన్(ఏవైఎఫ్) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి కన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ వ్యతిరేక నినాదాలు చేశానన్న ఆరోపణలు నిజమైతే కోర్టులో పోలీసులు ఎందుకు చార్జిషీటు వేయడం లేదని ప్రశ్నించారు. తన నిజాయితీని నిరూపించుకోవాల్సిన అవసరం లేదని, కానీ, కొందరు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అఫ్జల్‌గురు వర్ధంతి సందర్భంగా దేశానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారన్న ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు. నిజంగా అలాంటి నినాదాలు చేసి ఉంటే దేశద్రోహం కేసులో బెయిల్‌పై విడుదలయ్యే వాడిని కాదని వివరించారు. అంతేకాక.. భారతీయ సంస్కృతి, హిందూయిజంపై చర్చకు సిద్ధమా? అంటూ ఆర్ఎస్ఎస్‌కు సవాల్ విసిరారు.

వికాస్ బరాలా, అశీష్‌లకు రెండు రోజుల పోలీసు కస్టడీ

రాయ్‌పూర్ : రాజకీయ దుమారం రేపుతున్న చండీగఢ్ లైంగిక వేధింపుల కేసులో బీజేపీ నేత తనయుడు వికాస్ బరాలా, అతని స్నేహితుడు అశీష్‌లకు కోర్టు గురువారం రెండు రోజుల పోలీసు కస్టడీ విధించింది. వీరిరువురినీ కొన్ని గంటలపాటు ప్రశ్నించిన పోలీసులు బుధవారం కోర్టులో హాజరు పరిచారు. ఐఏఎస్ అధికారి కుమార్తె కారును వెంబ డించి, వేధింపులకు గురిచేసిన కేసులో వికాస్ నేరాన్ని ఒప్పుకున్నట్లు సమాచారం. దాదాపు మూడు గంటల పాటు పోలీసులు విచారించగా.. బాధితు రాలి కారును వెంబడించినట్లు వికాస్ అంగీకరిం చాడని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కాగా.. ఈ కేసులో వికాస్‌కు



వ్యతిరేకంగా అన్ని సాక్ష్యాలు ఉన్నట్టు తెలుస్తోంది.

బేటీ బచావో ప్రమాణం చేసిన సుభాశ్ బరాలా...కొడుకును కాపాడుకునే యత్నాలు

హర్యానా బీజేపీ అధ్యక్షుడు, తోహానా ఎమ్మెల్యే సుభాశ్ బరాలా రాష్ట్రంలో ప్రచార కార్యక్రమం సందర్భంగా ఇటీవల 'బేటీ బజావో.. బేటీ పడావో' ప్రమాణం చేశారు. ఫతేహాబాద్‌లోని తోహానాలో ఆయన నివాసం ముందు ఉన్న నేమ్ ప్లేట్‌పై బేటీ బచావో బేటీ పడావో నినాదం లోగోతో సహా ప్రత్యేకంగా రాయించి పెట్టుకున్నారు. ఇదిలావుండగా ఎక్కడైనా.. ఎప్పుడైనా మహిళలపై హింసను జరగనివ్వనంటూ మాట్లాడుతున్న వీడియో ఒకటి కొడుకు ఘటన నేపథ్యంలో వెలుగులోకి వచ్చింది. తోహానాలో 2006 ఫిబ్రవరిలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ సుభాశ్ ఈ ప్రసంగం చేశారు. హాస్యాస్పదమేమంటే.. లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన కొడుకును కాపాడుకునేందుకు తన రాజకీయశక్తినంతటినీ ఉపయోగిస్తున్నారు.

చీకటితో యుద్ధం

కాశ్మీర్‌లో పెల్లెట్ బాధితుల దీన గాథ

ఏడాదిక్రితం కాశ్మీర్‌లో నెలకొన్న అశాంతి, ఆందోళనల మధ్య భద్రతా దళాల పెల్లెట్ల దాడిలో కండ్లు కోల్పోయినవారు 1000 మందికిపైగానే ఉన్నారు. వారిలో కొందరు రెండుకళ్లూ కోల్పోగా, మరికొందరు ఓ కన్ను పూర్తిగా కోల్పోయి రెండో కంటితో మసక వెలుతురును మాత్రమే చూడగలుగుతున్నారు. వారంతా చీకటితో యుద్ధం చేస్తున్నారు. హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్ బుర్హాన్‌వనీ ఎన్‌కౌంటర్(8,ఆగస్టు,2016) తర్వాత కాశ్మీర్‌లో ఆందోళనలు ఉధృతమైన విషయం తెలిసిందే.

భద్రతా దళాల షాట్‌గన్స్ కాల్పుల్లో కండ్లు కోల్పోయిన యువకులు

- 1000మందికిపైగా బాధితులకు శ్రీనగర్‌లోని ఆస్పత్రిలో చికిత్స
- మెరుగైన చికిత్స అందక స్వస్థత చేకూరని వైనం

నవతెలంగాణ, జనరల్ డెస్క్

ఆందోళనకారులపై భద్రతా దళాలు షాట్‌గన్స్‌తో పెల్లెట్లను ప్రయోగించగా కళ్లు కోల్పోయినవారు శ్రీనగర్‌లోని శ్రీమహారాజా హరిసింగ్ హాస్పటల్‌లో చేరారు. తమ హాస్పటల్‌కు 1043మంది బాధితులు రాగా, వారిలో 800 నుంచి 900మందికి ఉచిత చికిత్సా సౌకర్యం కల్పించినట్టు కంటివైద్య నిపుణులు డాక్టర్ తారిఖ్‌ఖురేషీ తెలిపారు. బాధితుల్లో 19మంది రెండు కండ్లూ కోల్పోయారు. వారు తమ అనుభవాలను మీడియాతో పంచుకున్నారు..గతేడాది ఆగస్టులో భద్రతా దళాలు షాట్‌గన్స్ ద్వారా ప్రయోగించిన పెల్లెట్ల వల్ల దానీష్ రజాబ్‌జాట్ అనే యువకుడు తన ఎడమ కన్ను పోగొట్టుకొని స్పృహతప్పి పడిపోగా, ఆయన్ని బంధువులు హాస్పటల్‌లో చేర్చారు. కుడి కన్నుతో మసక వెలుగులో ప్రపంచాన్ని చూసేందుకు ఆయన ఎంతో ఇబ్బంది పడుతున్నారు. దాదాపు ఏడాదిపాటు ఆస్పత్రిలోనే గడిపి ఇటీవలే శ్రీనగర్ రైనావారీ ప్రాంతంలోని తన ఇంటికి చేరుకున్నారు. గాయపడ్డ ఆయన కండ్లల్లో విషాదం తొణికిసలాడు తుండగా, గట్టిగా ఊపిరి పీల్చుకుంటూ తన జ్ఞాపకాల్లో కొన్నింటిని నెమరువేశారు. గాయపడటానికి ముందు శ్రీనగర్‌లోని వీధుల్లో ఆయన సేల్స్‌మేన్‌గా పని చేసేవారు. విరామ సమయాల్లో క్రికెట్ ఆడేవారు. విషాద సంఘటన తర్వాత జాట్ తన ఉద్యోగాన్ని కోల్పోయారు. ప్రస్తుతం ఆయన ఎక్కువ సమయం ఇంట్లోని పడకగదిలోనే గడుపుతున్నారు. ఎవరైనా తోడుగా ఉండి సహకరిస్తే సమీపంలోని మసీద్‌కు వెళ్తారు. జరిగిందేదో జరిగిపోయింది అంటూ చిరునవ్వులు చిందిస్తూనే ఆయన తన సంభాషణ కొనసా గించారు. 'పెల్లెట్ బాధితులు కొందరు బాధ పడుతున్నట్టుగా తెలిసింది. కానీ, ఏం జరిగింది మాకు..? నాకు అల్లా మీద విశ్వాసం ఉన్నది' అన్నారు జాట్. ఈయన ఎడమ





కంటికి మూడు సర్జరీలు జరిగినా ఫలితం లేదు. కుడి కంటితోనే మసకగా చూడగలుగుతున్నారు. జూన్ 26న ఈద్ సందర్భంగా జాట్‌కు ఆయన స్నేహితుడు బట్టలు, చెప్పులు కొనిచ్చారు. జాట్ ఇంటికి కొద్ది దూరంలోనే మరో బాధితుడు జుహాయిబ్ హమ్జా(33) నివాసమున్నది. హమ్జా ఫోటో జర్నలిస్ట్. ఆందోళనలు జరుగుతున్న సమయంలో భుజాలపై కెమెరా తగిలించుకొని వీధుల్లోకెళ్లి సంఘటనలు దృశ్యీకరించేవారు. గతేడాది సెప్టెంబర్‌లో పెల్లెట్ల వల్ల ఆయన ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. దాంతో, ఆయనిపుడు గదిలోని ఓ మూలకు పరిమితమైపో యారు. డజన్లకొద్దీ ఖాళీ చేసిన సిగరెట్ ప్యాకెట్లు ఆయన గదిలో కనిపించాయి. తన జీవితమిపుడు పంజరంలో చిలకలా తయారైందంటూ ఆయన వాపోయారు. ఈయన కూడా ఓ కన్ను కోల్పోయారు. చూపు పోయి చీకట్లో గడపాల్సి వస్తోంద న్నారు. పెల్లెట్ల వల్ల ధ్వంసమైన తన కెమెరాను పునరుద్ధరించినట్టు ఆయన తెలిపారు. మరికొన్ని



నెలల్లో ఆయన కంటికి నాలుగో సర్జరీ చేయనున్నారు.

తీవ్రమవుతున్న ఆందోళనలు

శ్రీనగర్‌కు 30 కి.మీ. దూరంలోని పుల్వామా జిల్లా రాంబూ గ్రామానికి చెందిన షాబ్రోజా మీర్(18)ది మరో విషాద గాథ. ఆందోళనల్లో పాల్గొన్న ఈమె అక్టోబర్‌లో పెల్లెట్లు తగిలి ఎడమ కన్ను కోల్పోయారు. కృత్రిమ లెన్స్ అమర్చేందుకు ఆమె ఎడమ కంటికి ఇటీవలే ఓ సర్జరీ చేశారు. ఆమె కుడి కన్నుకు గాయాలేమీ కాలేదు. తనకు కోపం తెప్పించడం సులభమని, ఒక్కోసారి తనపై తనకే కోపం వస్తుందంటూ ఆమె తన సున్నిత మనస్తత్వం గురించి చెప్పారు. ఆరోజు తాను ఎందుకు బయటకు వెళ్లాల్సి వచ్చింది..? అవన్నీ మరిచిపో యాను అని మీర్ అన్నారు. అదే వీధిలో 14 ఏండ్ల ఇఫ్రాజాన్ అనే బాలుడు కూడా ఓ కన్ను కోల్పోయారు. ఉత్తర కాశ్మీర్‌లోని సోపోర్‌కు చెందిన 16 ఏండ్ల సాఖిబ్(పేరు మారింది)



గతేడాది జులైలో పెల్లెట్లతో ఓ కన్ను కోల్పోయారు. పదోతరగతి చదివే అతనికి మూడు సర్జరీలు జరిగినా చూపు రాలేదు. తోటి యువకులతో కలిసి రాళ్ళు విసరడంలో తప్పేమీ లేదంటూ సాఖిబ్ తమ నిరసనను సమర్థించుకుంటున్నారు. పెల్లెట్ బాధితులది జీవన పోరాటమని హెల్ప్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ నిఘత్ షఫీ పండిట్ అన్నారు. బాధితులకు ఆ రాష్ట్రం బయట మెరుగైన చికిత్స కోసం ఈ సంస్థ తోడ్పాటునందిస్తోంది. బాధితుల్లో ఎక్కువమంది తక్కువ ఆదాయవర్గాల నుంచి వచ్చినవారే కావడంతో ప్రత్యేక చికిత్సను పొందలేకపోతున్నారని పండిట్ తెలిపారు. పెల్లెట్ బాధితుల స్వస్థతపై ఇప్పుడే వ్యాఖ్యానించడం తొందరపాటే అవుతుందని డాక్టర్ ఖురేషీ అన్నారు. ఏడాది సమయం పడుతుందని ముందే చెప్పామని ఆయన అన్నారు. రెండో, మూడో సర్జరీ తర్వాత స్వస్థత చేకూరుతుందని..అయితే, కొందరిలో ఆ తర్వాత కూడా బాధ ఉంటుందని ఆయన అన్నారు. అలాంటివారికి మరిన్ని సర్జరీలు అవసరమవుతాయని ఖురేషీ తెలిపారు. బాధితుల్లో మాత్రం మొదటిరోజు నుంచే ఆగ్రహం వ్యక్తమవుతోందని ఆయన అన్నారు.

నేరెళ్ల ఘటన తెలంగాణకు మాయనిమచ్చ

రాష్ట్రంలో భూ, ఇసుక మాఫియా రాజ్యమేలుతోంది

- త్యాగాల తెలంగాణను యాగాల తెలంగాణగా మార్చారు
- టీమాస్ ఆవిర్భావ సభలో స్టీరింగ్ కమిటీ సభ్యులు



మాట్లాడుతున్న తమ్మినేని

నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి

నేరెళ్లలో దళితులపై పోలీసులు చేసిన పాశవిక దాడి, చిత్రహింసలు తెలంగాణ చరిత్రలో మాయని మచ్చలా నిలిచిపోతుందని టీమాస్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు అన్నారు. రాష్ట్రంలోని పదివేల సంఘాలను ఏకం చేసి దొరల పాలనను తరిమికొట్టడమే లక్ష్యంగా, సామాజిక న్యాయమే పునాది రాళ్లుగా తెలంగాణ రాష్ట్ర సామాజిక, ప్రజా సంఘాల ఐక్య వేదిక (టీమాస్) ఆవిర్భవించిందని పునరుద్ఘాటించారు. డ్రగ్, ల్యాండ్, శాండ్, లిక్కర్, గ్రానైట్ మాఫియా యథేచ్ఛగా కొనసాగుతోందని విమర్శించారు. ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన టీమాస్ ఆవిర్భావ సభ స్టీరింగ్ కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, విమలక్క, ప్రజాగాయకుడు గద్దర్, జాన్‌వెస్లీ, జేబీరాజు, ప్రొఫెసర్ ఐ.తిరుమలి తదితరులు పాల్గొన్నారు. తొలుత ఖమ్మంలో టీ-మాస్ ఆధ్వర్యంలో నయాబజార్ కళాశాల నుంచి భక్తరామదాసు కళాక్షేత్రం వద్ద గల సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. 191 సంఘాలు ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. సభలో తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ...అట్టడుగు వర్గాల ప్రజలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి సాధిస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. సామాజిక న్యాయం దేశంలో కరువైందన్నారు. దళితున్ని రాష్ట్రపతి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ అదే రాష్ట్రపతి కోవింద్‌ను పూరీలోని దేవాలయంలో కొబ్బరికాయ కొట్టించగలరా? అని ప్రశ్నించారు. జేబీరాజు మాట్లాడుతూ లాల్‌సలాం, నీల్ సలాం నినాదంతో మరో విప్లవం రాబోతోందన్నారు. విమలక్క మాట్లాడుతూ.. నిజాం కాలంలో ఏ రకమైన ఉద్యమాలు జరిగాయో ఇప్పుడూ అదే తరహా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాల్సి వస్తోందని, ఇది తెలంగాణ ప్రజల దురదృష్టమని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో పదిమందికి పైగా అమాయకులు ఇసుక లారీ వల్ల చనిపోతే కేటీఆర్, కేసీఆర్ మాట్లాడలేదని, అదే ఆవేదనతో మృతుల కుటుంబాలు రెండు లారీలను తగులబెడితే అంతగా ఎందుకు స్పందించారని ప్రశ్నించారు. రోడ్లపై మద్యం అమ్ముతూ తాగినోళ్లపై కేసులుపెట్టడం దివాళాకోరు రాజకీయాలకు పరాకాష్ట అన్నారు.

ప్రజాగాయకుడు గద్దర్ మాట్లాడుతూ..ఓటే ప్రజలకు ఉన్న ప్రధాన ఆయుధమన్నారు. పూలే, అంబేద్కర్, మార్క్స్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని ఉద్యమాల వైపు మళ్లించాలన్నారు. తెలంగాణలో ఓపెన్‌కాస్టులుండవని చెప్పిన కేసీఆర్ అందుకు విరుద్ధంగా ఓసీలు తెచ్చి తెలంగాణను బొందల గడ్డగా మార్చారని విమర్శించారు. తరతరాలుగా దేశంలో ఉన్న నిచ్చెన మెట్ల సిద్ధాంతాన్ని గద్దర్ కళాకారులతో కలిసి ప్రదర్శించి చూపారు.

రాష్ట్ర మేధావుల ఫోరం చైర్మెన్ ఐ.తిరుమలి మాట్లాడుతూ.. అనేక మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ పాలనపై ఇంత త్వరగా వ్యతిరేకత వస్తుందని ఊహించలేదన్నారు. ప్రస్తుత పరిణామాలు చూస్తే ఇందుకేనా తెలంగాణ సాధించిందన్న భావన కలుగుతోందన్నారు.

టీమాస్ కన్వీనర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ టీమాస్‌తో కేసీఆర్‌కు వణుకుపుడుతోందన్నారు. ఇప్పటికే 14 జిల్లాల్లో 2700సంఘాలను ఏకం చేశామని తెలిపారు. రాజ్యాంగబద్ధంగా సంక్రమించాల్సిన హక్కులను పాలకులు కాలరాస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారనీ, అన్ని వర్గాలు ఏకమైతే ఆయన నాలుకను వెయ్యి ముక్కలు చెయ్యడం ఓ లెక్కా కాదని అన్నారు. అనంతరం జ్వలిత, కాకిభాస్కర్, కోక్యానాయక్, తదితరులు ప్రసంగించారు.

టీమాస్ ఖమ్మం జిల్లా కన్వీనర్‌గా యర్రా శ్రీకాంత్

గురువారం ఖమ్మంలో జరిగిన టీమాస్ ఆవిర్భావ సభలో జిల్లా కమిటీ, అధ్యక్షకమిటీలతోపాటు, జిల్లాకన్వీనర్‌ను ఎంపికచేశారు. జిల్లా కన్వీనర్‌గా యర్రాశ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అతని తోపాటు జిల్లా కమిటీని ప్రకటించారు.

జనం ప్రాణాల కంటే మాఫియానే ముఖ్యమా?

నేరెళ్ల బాధితులకు న్యాయం చేయకపోతే నిరాహారదీక్ష: కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్


బాధితుడిని పరామర్శిస్తున్న వి హనుమంతరావు

నవతెలంగాణ-వేములవాడ

మీకు జనాల ప్రాణాల కంటే ఇసుక మాఫియా ముఖ్యమైపోయిందా? అని ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లను కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు ప్రశ్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేరెళ్ల బాధితులను గురువారం ఆయన పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీహెచ్ మాట్లాడుతూ...ప్రచారం కోసమే బాధితులను మంత్రి కేటీఆర్ పరామర్శించారని, ఘటన గురించి తనకేమీ తెలియనట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. అమాయక ప్రజలను పోలీసులు చిత్రహింసలకు గురిచేశారని వాపోయారు. రాష్ట్రంలో కేసీఆర్ దొరతనాన్ని ఊరూరా ఎండగడతామని హెచ్చరించారు. బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరగకపోతే ఈ నెల 30 నుంచి నేరెళ్లలో నిరాహారదీక్ష చేపడతానన్నారు. ఒకే నెంబర్‌తో 8 ఇసుక లారీలు నడుస్తున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆ లారీలను ఎవరు పట్టుకున్నా రూ.50వేలు నజరానా అందజేస్తామని చెప్పారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ముడికె చంద్రశేఖర్, నాగంకుమార్, కె. కొమురయ్య, తదితరులున్నారు.

బాధితులకు వైద్య పరీక్షలు

హైకోర్టు ఆదేశాల మేరకు ఎంజీఎం వైద్యులు బాధితులకు వైద్య పరీక్షలు గురువారం నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన రిపోర్టును హైకోర్టుకు అందజేయనున్నట్టు ఎంజీఎం వైద్యులు చంద్రశేఖర్, కృపాల్‌సింగ్ తెలిపారు.

పెట్టుబడుల ఉపసంహరణపై నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వరంగ సాధారణ బీమా కంపెనీల్లో పెట్టుబడుల ఉపసంహరణను తక్షణం విరమించుకోవాలని హైదరాబాద్ రీజియన్ జనరల్ ఇన్స్యూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (హెచ్‌ఆర్‌జీఐఈఏ) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆలిండియా ఇన్స్యూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) ఇచ్చిన పిలుపులో భాగంగా యునైటెడ్ ఇండియా రీజనల్ ఆఫీసు ముందు గురువారం ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఐఈఏ సీనియర్ నాయకులు కెవివిఎస్ఎస్ రాజు, హెచ్‌ఆర్‌జీఐఈఏ ప్రధాన కార్యదర్శి వై.సుబ్బారావు మాట్లాడుతూ... ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేయటానికి బదులుగా ఎన్డీయే ప్రభుత్వం వాటిని బలహీనపరిచేందుకు కుట్రలు పన్నుతున్నదని విమర్శించారు. ఇందులో భాగంగానే పెట్టుబడుల ఉపసంహరణకు పూనుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థలు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకవంటివని అన్నారు. వీటిని ప్రయివేటీకరించేందుకు ప్రయత్నించటం శోచనీయమని విమర్శించారు.

నేటి నుంచి ఫార్మోరియా సదస్సు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఫార్మసీ రంగంలో అత్యుత్తమ ప్రమాణాలు, భవిష్యత్‌ను నిర్దేశించుకోవడంలో భాగంగా ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు 'ఫార్మోరియా' సదస్సును నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో శుక్రవారం ప్రారంభమయ్యే ఈ సదస్సులో ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మంత్రి గంటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఫార్మా-డి, బీ-ఫార్మసీ, ఎమ్-ఫార్మసీల్లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, విభిన్న సంస్థల్లో స్థిరపడిన వారితో పాటు ప్రస్తుత విద్యార్థులు కూడా 'ఫార్మోరియా'లో భాగస్వాములు అవుతున్నట్టు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం రూపకల్పన చేస్తున్న ఫార్మాసిటీ, ఉద్యోగ అవకాశాలు, రీసెర్చ్ వంటి పలు అంశాలపై ఈ సదస్సులో చర్చలు జరుగుతాయని తెలిపారు.

మానవాళి సుఖం కోసం పాటుపడేవారు నిజాలను ధైర్యంగా ఒప్పుకోగలవారై ఉండాలి. - లెనిన్

సంపాదకీయం

మంత్రికి తెలియదా?!

ఆవు చేనులో మేస్తే దూడ గట్టుమీద మేయదు కదా! నేరెళ్ళ ఘటన విషయంలో రాష్ట్ర మంత్రి కల్వకుంట్ల తారకరామారావుగారి స్పందన కూడా ఇదే కోవలోకి వస్తుంది. నేరెళ్ళలో నిరుపేదలూ, బడుగు బలహీన వర్గాలకు చెందిన అభాగ్యులమీద పోలీసులు బరితెగించి చేసిన దాడుల ఫలితంగా నేటికీ ఆ ఎనిమిది మంది నిలువలేకపోతున్నారు. ఈ పరిస్థితి పాషాణ హృదయులైతే తప్ప మనసున్న మనుషులందరినీ చలింపజేసింది. వివిధ రాజకీయ పార్టీలూ, ప్రజా సంఘాలూ, కవులూ, కళాకారులూ, రచయితలూ, మేధావులూ... వీరూ వారని లేదు... అన్నివర్గాల వారూ నేరెళ్ళ బాటపట్టారు. ఓదార్పు సగం ఉపశమనాన్నిస్తుంది. ఎదుటివారికి చెప్పుకుంటే సగం బాధ తీరుతుందంటారు. అందుకే అనేకమంది నేరెళ్ళబాట పట్టారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. గాయాలపాలై వేములవాడలో తలదాచుకున్న వారినీ ఓదార్చారు. 'మీకు.. మేమున్నామని' సంఘీభావం తెలిపారు. ఇంత జరిగినా, ఘటన జరిగి నెలరోజులు దాటినా... సమస్యను మంత్రి ఏమాత్రం పట్టించుకోలేదు. పైగా ఇప్పుడు పరామర్శకు వస్తున్న వారిని టూరిస్టులుగా అభివర్ణించారు.

సమస్య హైకోర్టు గడపతొక్కి ఉండకపోతే ఈమాత్రం కూడా మంత్రి పరామర్శ ఉండేది కాదేమో! వైద్యబృందాన్ని పంపించాలనీ, నివేదిక ఇవ్వాలనీ న్యాయస్థానం ఆదేశించి ఉండకపోతే కార్పొరేట్ స్థాయి వైద్యం వాగ్దానం కూడా వచ్చేది కాదేమో!

మానసిక వ్యధతో కుంగిపోతున్న బాధిత కుటుంబాలూ వారి నివాసాలూ మంత్రికి సందర్శనా స్థలాలుగానూ, వచ్చే వారంతా యాత్రీకులుగానూ కనిపిస్తున్నారు. ఇది కష్టాలలో ఉన్నవారిని అవహేళన చేయటమే. తాము ఆదుకోకపోగా, అండగా నిలచిన వారిని కించపరుస్తున్నారు. అధికారదర్పంతో వచ్చే అహంభావం ప్రజల నెత్తిన మోయలేని భారమవుతుందని కూడా గమనించగల విజ్ఞత లేదు పాలకులకు. మీడియాతో మాట్లాడుతూ... "పోలీసులు దాడిచేసారా? నాకు తెలియదే!" అన్నారట మంత్రి కేటీఆర్. ఈ వ్యంగ్యాస్త్రం పుండుమీద కారం చల్లటం లాంటిదే కదా! గాయపడిన గుండెలమీద గడ్డపార దించటం లాంటిదే కదా! ఏమీ జరగనప్పుడు పరామర్శకోసం ఎందుకుపోయారు? పరామర్శ సమయంలో మీడియాను దూరంగా ఉంచారంటేనే పాలకుల గుండెల్లో భయం వెన్నాడుతున్న విషయం స్పష్టం. దెబ్బలు తిన్న పేదలు మంత్రిని నిలదీస్తే... అది మీడియా కంటపడకూడదనే కదా మీడియా మీద ఆంక్షలు! వాస్తవం వెలుగు చూడకూడదు. తాము చెప్పిందే రాసుకోవాలి. కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాల్సిన అవసరం మంత్రి గుర్తించారంటేనే పోలీసుల చిత్రహింసలు ఏ మోతాదులో ఉన్నాయో అర్థమవుతున్నది. వీరి



గాయాలు చూసి, జైలులోకి అనుమతించ లేదన్న విషయం కూడా మంత్రి ప్రస్తావించారు. అంటే కోర్టులో హాజరుపరచకముందే పోలీసులు వారిని చిత్రహింసలు పెట్టిన విషయం స్పష్టమే. అయినా ఒక్క పోలీసు అధికారిమీద చర్యలేదు. కండ్లముందు కనబడుతున్న పోలీసుల నిర్వాకం చాలదట! డీజీపీ నివేదిక వస్తే... అప్పుడు చర్య తీసుకుంటామంటున్నారు. మరి లారీలు తగులబడినప్పుడు, డీజీపీ నివేదిక కోసం చూడకుండానే వీరందరినీ చిత్రవధ చేసారు కదా! నిమిషాల్లో ఖాకీలు కదం తొక్కారు కదా! అర్ధరాత్రి అరెస్టులు చేసారు కదా! పేదలమీద విరుచుకుపడేందుకు ఏ నివేదికలూ అవసరం లేదు. వారు పాలకుల దృష్టిలో మనుషులు కాదు. ఎట్టకేలకు ఎస్పీని వదిలి ఎస్సైపైన వేటు వేసారు. ఘనకార్యం చేసినట్టుగా ట్వీట్ చేసారు.

'ఇసుక మాఫియా' అంటే సహించం అంటున్నారు. పేదల శరీరాలు నుజ్జు నుజ్జు చేసినా సహిస్తారు. మాఫియాను మాఫియా అంటే మాత్రం సహించరు. అందుకే కదా పేదలు లారీల కింద పడి చచ్చినా దిక్కులేదు... లారీలు తగులబడితే మాత్రం భూమండలం బద్దలైనట్టుగా ఖాకీలు రెచ్చిపోయారు. మనుషుల ప్రాణాలకంటే లారీల విలువ ముఖ్యం. ఇన్సూరెన్స్ సొమ్ము చేసుకుని లారీ యజమాన్యాలు కొత్తలారీ పొందుతారు. పోయిన ప్రాణాలను ఇన్సూరెన్స్ కంపెనీలు ఇవ్వజాలవు కదా! అయినా ఈ బక్క ప్రాణాలకన్నా ఆ ఇసుకలారీలే మిన్న. అక్కడ లాభం ప్రవహిస్తున్నది. అక్రమార్జన సవారీ చేస్తున్నది. అయినా అది మాఫియా కాదు! ఎందుకంటే అయినవారే అక్కడున్నారు. పాలకుల కనుసన్నలలోనే కొల్లగొడుతున్నారు. పాలకపక్షం వాటాల పర్వం దాగి ఉన్నది. అందుకే మాఫియా అంటే మాత్రం సహించజాలరు. మనుషులనేమన్నా ఫర్వాలేదు. కష్టజీవులనేం చేసినా లెక్కలేదు. మాఫియాను ముట్టుకుంటే ప్రభుత్వం భగ్గుమంటున్నది. "ఇసుక దందా జరుగుతున్నదా?" అని అడుగుతున్నారు మంత్రి. గ్రామాల్లో లారీల మోతలు గానీ, మీడియా రాతలూ, ప్రసారాలుగానీ మంత్రికి వినబడకపోవటం, కనబడకపోవటమే వైపరీత్యం. మాఫియా కదలికలను గుర్తించి గుట్టురట్టు చేయవల్సిన నిఘావిభాగం మాఫియా తరపున పనిచేయటమే ఈ వైపరీత్య కారణం.

సమస్య హైకోర్టు గడపతొక్కి ఉండకపోతే ఈ మాత్రం కూడా మంత్రి పరామర్శ ఉండేది కాదేమో! వైద్యబృందాన్ని పంపించాలనీ, నివేదిక ఇవ్వాలనీ న్యాయస్థానం ఆదేశించి ఉండకపోతే కార్పొరేట్ స్థాయి వైద్యం వాగ్దానం కూడా వచ్చేది కాదేమో! ఇంత జరిగినా... గాయాలపాలైన వారితో బేరసారాలాడి... కొందరినైనా తమ వైపు తిప్పుకుని... పోలీసు బాసును రక్షించాలన్న యావేతప్ప న్యాయం చేయాలన్న నిబద్ధత కానరాదు. పరిణామాలను ఓ కంట కనిపెడుతున్న ప్రజలే పరిష్కారం వెతకాలి.

పురాణాలూ మానవ పరిణామ క్రమంలో భాగమే!



డాక్టర్ దేవరాజు మహారాజు

దేవుళ్ళకు ఏ కాలంలో రూపకల్పన జరిగి ఉంటుందంటే... అది, ఆదిమ కాలంలోనే అయి ఉంటుంది. ఒక్కసారి దేవతా విగ్రహాలు చేతుల్లో ఉన్న మారణాయుధాలు చూడండి. కత్తులు, బాణాలు, ఈటెలు వగైరా... ఆ ఆయుధాలే చాలా విషయాలు చెపుతాయి. ఆది మానవుడి అజ్ఞానం, అభద్రతాభావం... ఆధునిక సమాజం వరకు వారసత్వంగా వచ్చాయి. ఆ నమ్మకాలకు కొన్ని వర్గాలు కల్పితాలు, కట్టుకథలూ అల్లి, కష్టజీవులను దోపిడీ చేశారు. ఇంకా చేస్తున్నారు. మతమనే అజ్ఞానాన్ని పెంచి, అసమానతల్ని సృష్టించి, సామాజిక నిర్మాణాన్ని తప్పుదారి పట్టించారు. దాన్నే ఇంకా కొనసాగిస్తున్నారు. దేవతల ఆయుధాలైన ఖడ్గాలు, బల్లాలు, విల్లు, చక్రం, గధ

మనిషిని మనిషిగా గుర్తించేవారు, మనిషి స్థాయిని, అవగాహనను పెంచుదామన్న ధ్యేయం ఉన్నవారు చాలా తక్కువ మందే ఉన్నారు. అయినా సరే వారి నిజాయితీ నిబద్ధతలతో సమాజంలో శాస్త్రీయ అవగాహనను పెంచే ప్రయత్నం చేస్తూనే ఉంటారు. మానవ సంబంధాల్ని నరికేసే విష సంస్కృతిని ధ్వంసం చేస్తూనే ఉంటారు. ఒక ఉదాత్తమైన శాస్త్రీయ ప్రజాస్వామ్య స్థాపనకు నిరంతరం తపిస్తూనే ఉంటారు.

వగైరాలన్నీ మన ఆదిమానవులు ఉపయోగించినవి! అణు ఆయుధాలు, ఆటంబాంబులు, కాదు గదా, ఏకే-47 గన్స్, మామూలు తుపాకులు, పిస్టల్స్ లాంటివి దేవతలకు లేవు. అంటే, ఆ కాలంలో ఆ దేవతల పాత్రల్ని సృష్టించి, ఆయా రచనలు చేసినవారికి ఆ ఆయుధాలు మాత్రమే తెలుసునన్నమాట! ఎందుకంటే వారి పూర్వీకులు వాడిన ఆయుధాలు అవే గనక! కఱ్ఱ, ఇనుములతో తయారు చేసుకున్నవి. వారి పరిజ్ఞానం మేరకు అవే ఆయుధాలు దేవతలకు ఆపాదించి కథలు చెప్పుకున్నారు. అవే రాసుకున్నారు. కానీ, దేవతలు ఆది మానవుడి కన్నా బలవంతులని రుజువు చేయాలి కాబట్టి, వారికి అభూత కల్పనలు, మహిమలు, అతీతశక్తులు ఆపాదించారు.

ఆదిమానవుడు వాస్తవంలో జీవించాడు. వాడి ఆయుధాలు మోటుగా ఉంటాయి. ప్రకృతిని, ఇతర జంతు, వృక్షజాతుల్ని అర్థం చేసుకుంటూ మనుగడ సాగించాడు. తమ కథల్లోని పాత్రలు అంత సాదాసీదాగా ఉంటే ఎట్లా అని తర్వాత కాలంలో, తొలిదశలోని రచయితలు, కవులు మంత్రశక్తులు, ఆత్మజ్ఞానాలు, దివ్యదృష్టులు ప్రవేశపెట్టారు. ఆయుధాలు ప్రయోగించేప్పుడు మంత్రోచ్ఛారణ చేసి, తమశక్తిని, తాము నమ్మిన దేవతల శక్తిని ఆ ఆయుధంలో ప్రవేశపెట్టి ప్రయోగించేవారన్నమాట! అంటే మనిషి తనకు లేని శక్తులను దేవతలకు ఆపాదించి రాసుకున్నాడన్న మాట! అభూత కల్పనలతో దేవతలను, రాక్షసులను బలశాలులుగా తీర్చిదిద్దుకున్నాడు మనిషి. అభూత కల్పనకు ఒక ఉదాహరణ చూడండి. 'కబంధహస్తాలు' అనేది ఇప్పటికీ వాడుకలో ఉన్న పదమే. కబంధుడొక రాక్షసుడు. వాడికి తల ఉండదు. మొండానికి పెద్ద పెద్ద చేతులుంటాయి. ఎంత దూరంలో ఉన్న మనుషులనైనా లాక్కుని తినేస్తాడు. అలాగే 'బకాసురుడి తిండి' అనే మాట కూడా ఇప్పటికీ వాడుకలో ఉంది. బకాసురుడు అనే కల్పిత రాక్షస పాత్ర ఉంది. వాడికి ఒక మనిషితో పాటు, ఒక బండెడు అన్నం కావాలి. అంటే వాడి శక్తి ఎంతటిదో చెప్పడానికి ఆ ఆకారం, ఆ తిండీ అలా సృష్టించుకున్నారన్న మాట!

ఈ పురాణ గాథలన్నీ ఎవరు రాశారు? ఎట్లా రాశారూ? అని ఆలోచిస్తే జవాబు సులభంగా దొరుకుతుంది. ఇవి భూగర్భం నుండో, సముద్రగర్భం నుండో, ఆకాశ గర్భం నుండో ఊడిపడి మనిషికి లభించలేదు. మనిషి తనను తాను అర్థం చేసుకుని, ప్రకృతిని అర్థం చేసుకుని, ఊహపెంచుకుని, తనను తాను వ్యక్తీకరించుకునే దశకు వచ్చిన తర్వాత... అంటే ఎన్నోఎన్నో దశలు దాటి వచ్చిన తర్వాత కథలల్లుకోవడం ప్రారంభించాడు.

అతను చూసింది, తెలుసుకుంది మాత్రమే అతని కథలలో ఉండడానికి ఆస్కారముంది. చూడలేనిది, ఊహకు అందనిది ఆ కథల్లో ఉండదు. అందుకే మన ఇస్రో రాకెట్ ప్రయోగం పురాణాల్లో లేదు. ఇది అప్పటి మనిషి ఊహకు అందని విషయం. అలాగే శరీరంలోకి మైక్రో కెమెరాలు పంపే ప్రక్రియ పురాణాల్లో కనిపించదు. అలాగే రాడార్లు లేవు. శతఘ్నులూ లేవు. మనం ఈ విషయాలు మాట్లాడుకునేది పురాణాల స్థాయి దేవతల స్థాయి తగ్గించాలని ఎంత మాత్రమూ కాదు. కానీ, ఆ గ్రంథాలు, ఆ పాత్రలు అప్పటి మనిషి అవగాహనా స్థాయిని బట్టి సృష్టించబడ్డాయన్నది మనం ఎంత సత్వరం గుర్తిస్తే అంత మంచిది.

అలాగే దేవతల వాహనాలు గమనించండి. గుఱ్ఱాలు, ఏనుగులు, ఎద్దులు, పులులు, హంసలు మొదలైనవి. అంటే ప్రకృతిలో మనిషికి అనుభవంలోకి వచ్చిన జంతువుల్ని, పక్షుల్ని దేవతలకు వాహనాలు చేశాడు. రాక్షసబల్లుల గురించి, అనకొండ లాంటి ఇతర జంతువుల ప్రసక్తి ఎందుకు లేదో ఆలోచించాలి. సూక్ష్మ క్రిములున్నాయని, మైక్రోస్కోపులు, టెలిస్కోపులు తయారవుతాయనీ ఆనాటి మానవులకు తెలియదు. కాబట్టి, వాటి ఊసే పురాణాలలో లేదు. మనిషి కోరికలు తీర్చడానికి ఒకప్పుడు 'కల్పవృక్షం' ఉంటే, ఆ తర్వాత కాలంలో 'అల్లాఉద్దీన్ అద్భుతదీపం' వచ్చింది. ఇవన్నీ మనిషి ఊహాశక్తికి కొలమానాలు. ఇలాంటివి మన పురాణాల్లోనే కాదు. ప్రపంచ సాహిత్యంలో చాలా కనిపిస్తాయి. శిష్ట సాహిత్యానికి సమాంతరంగా వచ్చిన ప్రపంచ జానపద సాహిత్యంలోనూ దయ్యాలు, భూతాలు, రాక్షసులు విరివిగా సృష్టించబడ్డాయి. మనిషి ముఖంతో రెక్కలున్న ఎద్దు ఇతర దేశాల పురాతన గాథల్లో కనిపిస్తుంది. మనిషి శరీరానికి సింహం తల, ఏనుగుతల, గుఱ్ఱం తల గల దేవతలు మనందరికీ తెలుసు. ఇవన్నీ ఆలోచించినప్పుడు, మనిషి సృజనాత్మక శక్తికి జేజేలు పలకాలి. మన పూర్వీకుల ఊహాశక్తికి సంతోషపడాలి. అంతేగాని, వారు అమాయకంగానో, అవగాహన లేకో ఆపాదించిన 'శక్తుల్ని' మాత్రం ప్రశ్నించక తప్పదు. నిజం నిగ్గుతేల్చకా తప్పదు. సంస్కృతి-సంప్రదాయాల పేరిట వాటినే పట్టుకుని, ఊగిసలాడుతున్న వారిని ఆలోచించుకోండని హెచ్చరించకా తప్పదు.

మన పురాణాలన్నీ సంస్కృతంలోనే ఎందుకున్నాయి? బుద్ధుడు పాళీ భాషలో ఎందుకు బోధించాడు అంటే ఆ కాలంలో ఆయా భాషలు వర్ధిల్లాయి. జన సామాన్యానికి విషయం అందాలంటే ఆ ప్రాంతంలోని భాషల్లోనే రచనలు రావాలి. ఏ రచయిత అయినా అతనికి తెలియని భాషలో రచనలు చేయలేడు కదా? గాలిబ్ ఇంగ్లీషులో గజళ్ళు రాయలేదు. సోమర్‌సెట్ మామ్ ఉర్దూలో నవలలు రాయలేదు. అంటే రాసేవాళ్ళు ఆయా సమాజాల్లోంచే పుట్టి పెరుగుతారు. ఆయా సమాజాల్లోంచే తమకు కావల్సిన ముడి సరుకు - భాష, వస్తువు లాంటివి తీసుకుంటారు. ఈ అనంత కాల గమనంలో ఒక్కోచోట ఒక్కో భాష ప్రామాణిక మౌతుంది. కొంత కాలానికి ఆ భాష ఉనికి తగ్గిపోవచ్చు. సంస్కృతమిప్పుడు వాడుకలో లేదుకదా? అదంతా మళ్ళీ వేరే చర్చ. ప్రపంచంలోని భాషలన్నీ ఆయా ప్రాంతాల్లోని జనం కాలక్రమంలో రూపొందించుకున్నవే. అభివృద్ధి పరచుకున్నవే. మనకు అందుబాటులోకి వచ్చిన మత గ్రంథాలు, పురాణ కావ్యాలు అన్నీ మనిషి రాసుకుంటూ వస్తున్నవేనన్నది అర్థం చేసుకుంటే మంచిది.



భాష పరిణామ క్రమం గురించి తెలుసుకున్న వారికి ఈ విషయాలు బాగా తెలుస్తాయి. మాటకన్నా పాట ముందు పుట్టింది. లిపికన్నా రేఖాచిత్రాలు ముందు పుట్టాయి. క్రీ.పూ.4000-3000 మధ్య కాలంలో దక్షిణ మొసపొటేమియా ప్రాంతంలోని సుమేరియన్లు ఒకరకమైన ప్రామాణిక లిపికి రూపకల్పన చేశారు. మట్టి పలకలు తయారుచేసి, అవి పచ్చిగా ఉన్నప్పుడే వాటిమీద వెదురు పుల్లలతో గొడ్డలి ఆకారంతో గీతలు రాసే (గీసే)వారు. మనిషితల, ధాన్యం, చెట్టు, సూర్యుడు, నాగలి, ఎద్దు వంటివి.. వేటి గూర్చి చెప్పాలనుకున్నా వాటి బొమ్మ రాయడం చేసేవారు. మొదట వెదురు పుల్లలతో మట్టిపలక మీద అద్దినప్పుడు కోణాలున్న కొన్ని గీతలు ఏర్పడేవి. దీన్ని 'క్యూనిఫాం' లిపి అన్నారు. ఆ తర్వాత మనిషి క్రమ క్రమంగా వంకర గీతలను సాధించడానికి (గీయడానికి) మరికొన్ని వందల యేండ్లు పట్టింది. వంకర గీతల వల్ల అక్షరాల ఆకారాలు స్పష్టంగా రూపుదిద్దుకున్నాయి. సుమేరియన్ జాతి వర్ధిల్లుతున్న సమయంలోనే బాబిలోనియన్‌లు, ఎస్సైరియన్‌లు కూడా ఉన్నారు. ఈ రెండు జాతులు కలిసి సుమేరియన్‌లను బలహీన పరిచాయి. కానీ, వారు రూపొందించిన 'క్యూనిఫాం' లిపిని మాత్రం స్వీకరించాయి. దాన్ని ఇంకొంచెం అభివృద్ధి చేసుకుని, ఎవరి లిపి వారు తయారు చేసుకున్నారు. చివరకు పరిశోధకులు తేల్చిందేమంటే, సుమేరియన్ లిపే వంకర గీతలతో అందంగా, పొందికగా తయారైందని! క్రమంగా దీని నుండి 'హైరోగ్లైఫిక్' లిపి తయారైంది. గ్రీకు భాషలో హైరో గ్లైఫిక్ అంటే వంకర తిరిగిన అక్షరాలు అని అర్థం. ఈ లిపే తర్వాత కాలంలో "పవిత్రమైన" వంకర అక్షరాలుగా వాడుకలోకి వచ్చింది. అంటే అక్షరాలకు పవిత్రభావన అంటగట్టి వాటిని ఆ రకంగా దైవాంశంలోకి తీసుకుపోవడం జరిగింది.

లిపి గురించి సంక్షిప్తంగా ఇక్కడ కొన్ని వివరాలు ఎందుకు ఇచ్చానంటే ఏ భాషా దైవభాష కాదు. అన్నీ పరిణామ క్రమంలో మనిషి సృష్టించుకున్నవే.. అని చెప్పడానికి! ప్రతి భాషా ఇదే విధంగా దశలు మారి రూపొందిందేనని రుజువు చేయడానికి!! తననెవరో సృష్టించారని, తననెవరో నడిపిస్తున్నారని భావించిన మనిషి, దైవానికి రూపకల్పన చేసుకుని కీర్తించడం ప్రారంభించాడు.. అన్నది మనం గ్రహించుకోవల్సిన నిజం! తను రూపొందించుకున్న లిపితో పదాలు, వాక్యాలు ఏర్పరచుకుని కథలూ, కావ్యాలూ రాసుకున్నాడు తప్పిస్తే దేవుడనే వాడు మనిషికి ఏ భాషనూ బహూకరించలేదు. వేదాల్ని, పురాణ కావ్యాల్ని సముద్ర గర్భంలోంచి ఏ దేవుడూ తెచ్చివ్వలేదు. ఈ కల్పనలన్నీ, భ్రమలన్నీ మనిషివే! సంస్కృతాన్ని 'దైవభాష' అని కొనియాడేవారు, మరిప్పుడు ఆ భాష ఎందుకు ప్రజాదరణ కోల్పోయిందో చెప్పాలి.

దేవుణ్ణి మనిషే సృష్టించుకున్నాడు కాబట్టి, ఆయన ఆకారం, వేషం, ఆభరణాలు, ఆయుధాలు అన్నీ మానవుడు సృష్టించుకున్నవే. అంతా మానవలీలే.. దైవలీల అంటూ ఏదీ లేదు. భాషల విషయానికొస్తే అన్నీ మానవ భాషలే తప్ప, దైవభాషలేవీ లేవు. దేవుడు ఫలాని భాష మాట్లాడేవాడని ఎవరు చెప్పుకున్నారు? మనిషే చెప్పుకున్నాడు. తమిళనాడు మధుర మీనాక్షి ఆలయంలో పూజారులు తమిళంలో హారతి ఇస్తారు. పూరీ జగన్నాథునికి అక్కడి పాండాలు ఒరియాలో పూజలు చేస్తారు. యాదగిరిగుట్ట మీద పంతుళ్ళు దేవుడితో తెలుగులో మాట్లాడుతారు. యూరోప్ దేశాల్లోని చర్చిలలో ఒక్కో దేశంలో ఒక్కో భాషలో ప్రేయర్లు జరుగుతాయి. అంటే ఏమిటీ? దేవుడికి ఒక భాష, ఒక వేషం ఏదీలేదు. అవి మారుతూ ఉంటాయి. ఆ ప్రాంతంలో ఉన్న జనానికి సంబంధించిన నేపథ్యంలోంచి అవన్నీ ఏర్పడ్డాయి.

అందువల్ల ప్రపంచాన్ని ఎవరు సృష్టించారు? మత గ్రంథాలు ఎవరిచ్చారూ? వంటి పనికిరాని చర్చలు మానాలి. ప్రపంచం ఏర్పడింది. మత గ్రంథాలు మనిషే రాసుకున్నాడు. ఈ విషయాలు పక్కన పెడితే, అసలీ ప్రపంచాన్ని అన్ని రకాలుగా నాశనం చేస్తున్న విలన్‌లు ఎవరూ? అన్నది గుర్తిస్తూ ఉండాలి. వారికి ఎప్పటి కప్పుడు బుద్ధి చెపుతూ ఉండాలి! అదీ నేటి అవసరం!! తనకు అధికార పీఠం దక్కితే చాలుననుకునేవాడు రాజకీయాలతో జనాన్ని గొఱ్ఱెల్ని చేస్తున్నాడు. తను బాగుంటే చాలు ప్రపంచమేమైతే నాకేంటి అనుకునే వాడు కాలుష్యాలు పెంచుతున్నాడు. ఏదో రకంగా తన ఆధిపత్యం కొనసాగితే చాలన్నట్టు మత గురువులు జనానికి వక్రభాష్యాలు చెపుతున్నారు. భార్యను, తల్లిని గాలికొదిలేసి తిరిగే వారు దేశాన్ని ముందుకు నడుపుతామంటారు. ఇవన్నీ చూస్తుంటే, సామాన్యుడికి తల తిరిగిపోతోంది.

వ్యాసకర్త: సుప్రసిద్ధ సాహితీవేత్త, సైన్స్ ప్రొఫెసర్,
సెల్: 9908633949

మెయిల్ @ నవతెలంగాణ

నేరెళ్ల నోరెళ్లబెట్టలె...



ఎస్. సంపత్

స్వయానా రాష్ట్ర ముఖ్యమంత్రి తనయుడు కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలో ఓ చిన్న గ్రామమే నేరెళ్ళ. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉండే ఈ గ్రామస్తులు చేసిన తప్పేంటో ప్రభుత్వమే చెప్పాలి. 8మందిని ఎందుకు అంత కిరాతకంగా చావబాదారో కేసీఆర్ సర్కార్ సమాధానం చెప్పాలి. నేరెళ్ల ఘటనలో ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు రాజకీయం చేస్తున్నాయంటూ ఆరోపణ చేస్తున్న కేసీఆర్, ఈఘటనలో ప్రభుత్వం ఎంత బాధ్యతాయుతంగా వ్యవహరించిందో ప్రజలను వేధిస్తున్న సమస్య. గతేడాది నుంచి ఇసుక లారీలు ఢీకొని 10 మంది ప్రాణాలు కోల్పోయారు. 128 మంది గాయాలకు గురైనట్టు అధికారుల లెక్కలే సాక్ష్యం. జిల్లాలోని సిరిసిల్ల, చింతల్‌ఠాణా, కొదురుపాక, చీర్లవంచ, కొడిముంజ గ్రామాల వద్ద ఇసుక క్వారీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రోజూ ఇసుకను వందలాది లారీల్లో హైదరాబాద్ లాంటి మహానగరాలకు తరలిస్తున్నారు. మార్చి 26, 2017న తంగళ్ళపల్లి మండలం నేరెళ్ళ గ్రామానికి చెందిన యువకుడు కారంగుల కరుణాకర్‌రావు సిరిసిల్ల నుంచి జిల్లెల్ల వైపు వెళ్తుండగా బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కు వద్ద ఇసుకలారీ ఢీకొనడంతో మృతి చెందాడు. మే 25, 2017న నేరెళ్ల గ్రామానికి చెందిన గంధం మల్లేశం, తన కుమారుడితో జిల్లెల్ల నుంచి తిరిగి వస్తుండగా నేరెళ్ల శివారులో ఇసుకలారీ ఢీకొని మల్లేశం అక్కిడికక్కడే మృతిచెందాడు. నేరెళ్ల గ్రామనివాసి పోతుల సుగుణ ఉపాధిహామీ మే 30న పనికివెళ్ళి నడుచుకుంటూ వస్తుండగా లారీ ఢీకొని తీవ్రగాయాలయ్యాయి. ఢీకొట్టి ఆపకుండా వెళ్తున్న ఇసుక లారీని గ్రామస్తులు వెంబడించి పట్టుకొని పంచాయతీ ఆఫీసులో బంధించి పోలీసులకు అప్పగించారు. తరుచూ ఇలా ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రమాద నివారణా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు రాస్తారోకో చేశారు. జూలై 2న బదనాపురంచ భూమయ్య జిల్లెల్ల నుంచి వస్తుండగా నేరెళ్ళ గ్రామ శివారులో ఇసుక లారీ ఢీకొని మృతి చెందారు. తరచూ లారీ ప్రమాదాల వల్ల తమ గ్రామానికి చెందిన వారు చనిపోతున్నారని ఆగ్రహించిన గ్రామస్తులు లారీలను ధ్వంసం చేశారు. ప్రజలు ఎన్నిసార్లు ఈ ప్రమాదాల గురించి అధికారుల దృష్టికి, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం లేకపోయింది. నేరెళ్ళ నుండి ఇసుక లారీలు వెళ్ళే రోడ్డు వెడల్పు ఎంత? రోడ్డు సామర్థ్యం ఎంత? పరిష్కారం ఏమిటోనని అధికారులు కనీసం ఆలోచించడం లేదు. 30 ఫీట్ల రోడ్డులో అటో లారీ, ఇటో లారీ వస్తే ఆ గ్రామంలో నివసించే ప్రజలు ఎటువైపు నడవాలి..? ఎటూ వెళ్ళకుండా వుంటే ఇల్లు గడిచేదేలా. ఇలా ఇసుక లారీల రాకపోకలు ఆ గ్రామస్తులకు జీవనమరణ సమస్య అయింది. రోజూ వెయ్యి లారీల చొప్పున రెప్పపాటు సమయం లేకుండా నడుపుతుంటే జరిగే ప్రమాదాలకు కూటికోసం రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు బలవుతున్నారు. ఈ ప్రమాదాలకు ఎవరు కారణం? ఇసుక మాఫియానా? ప్రజల ప్రాణాలను తీస్తూ అక్రమంగా ఇసుక దందా చేస్తున్నా ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ఎనిమిది మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయినా అధికారులూ రాష్ట్ర మంత్రీ ఎందుకు పట్టించుకోలేదంటే ఈ ఇసుక దందా స్వయంగా కేటీఆర్ బంధువుదే కాబట్టి. గ్రామంలో ఇంతమంది ప్రాణాలు పోయినా ప్రజలు సహనం కోల్పోలేదు. న్యాయం కోసం ఎదురు చూశారు. మూడు సార్లు ధర్నాలు చేసినా పట్టించుకున్న ప్రజాప్రతినిధి ఏరి? పైగా మంత్రి కేటీఆర్ 'నేరెళ్లలో దళితులపై దాడి జరిగిందా...' అని అమాయకంగా ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, హోంమంత్రి నాయని లారీలు తగులబడితే ఊరుకుంటామా..? అని.. ప్రజలను అవహేళన చేస్తుండ్రు... నిండు ప్రాణాలు లారీల కింద నలిగిపోతుంటే.. ప్రజలు ఊరుకోరు... తిరగబడతరు... అందుకే 'నేరెళ్ల నోరెళ్లబెట్టలె..!'

సెల్ : 9989737316


ప్రజావాణి

నేతన్నలకు రుణాలపై సీఎంకు వినతి

చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు ఉద్యోగులు వారంలో ఒకరోజు చేనేత వస్త్రాలు ధరించి, వారిని ఆర్థికంగా ఎదిగేలా చేయాలని పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునివ్వడం అభినందనీయం. 2015-16లో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న బీసీ రుణాలను 80శాతం సబ్సిడీతో చేనేతకార్మికులతో పాటు బీసీలందరికీ సీఎం కేసీఆర్ చేయూతనిచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రతి నియోజవర్గ కేంద్రంలో టెస్కో (చేనేత వస్త్రాలయం) ఏర్పాటు చేస్తూ జీఎస్‌టీ పరిధి నుంచి చేనేతలను మినహాయింపు నిచ్చి చేనేతలను ఆదుకోవల్సిందిగా సీఎంకు విజ్ఞప్తి.

కె. శ్రీనివాస్,
బెల్లంపల్లి,
మంచిర్యాలజిల్లా.

ఈ దేశం 'మాది' కాదు మనది



జి. తిరుపతయ్య

"నేనింకా 'న' నుంచి 'మ' వరకు రానేలేదు, 'మన' అనుకున్నప్పుడు కదా ముందడుగు" అంటూ కవి కాళోజి నారాయణరావు ఐక్యత ప్రాముఖ్యతపై ఏనాడో వ్యక్తపరచిన చిన్న పంక్తి ఇప్పటికీ మనం నేర్చుకోవలసిన, నిత్యం మననం చేసుకోవలసిన అవసరం ఎంతో ఉంది. "ఈ దేశం నాది.., మాది..." అని అంటున్నప్పుడు ఎవరినో వేరు చేస్తున్నట్టు, కొందరిది కాదు అన్నట్టు అర్థమౌతోంది. "ఈ దేశం మనది" అని ఉచ్చరిస్తే ఉట్టిపడుతున్న ఐక్యత అనన్య సామాన్య బలాన్నిస్తున్నట్టుంది. దేశభక్తి అంటే దేశాన్ని ఇష్టపడటంతో సరిపోదు పొరుగు దేశాన్ని వ్యతిరేకించాలి అలాంటి వ్యతిరేకతను వ్యక్తపరచాలి, "జై హింద్" సరిపోదు భారత్ మాతాకీ జై అనాలి లేదంటే దేశద్రోహి అనటానికి వెనకాడరు. సారాంశమేమంటే దేశాన్ని కానీ దేవుణ్ణి కానీ ఎవరికి నచ్చిన రీతిలో వారు కొలవడానికి వీల్లేదు దానిపై కూడా ఆంక్షలున్నాయి. మహాత్మాగాంధీని ఆరాధించినా, పొగిడినా అది తప్పుగా చిత్రీకరిస్తున్నారు, సర్దార్ పటేల్‌ను కీర్తించాలంటున్నారు. పరిపాలనలో భక్తి ప్రాబల్యం లేకుండా పూర్తి లౌకికతరహా ప్రభుత్వాన్ని నడిపింది నెహ్రూ మాత్రమే. భారత రాజ్యాంగం అంగీకరించని మతపరమైన జాతీయ వాదాన్ని ప్రతిపాదించిన దీనదయాల్ ఆరాధ్యమంటున్నరు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత ఆరాధ్యులు ఎవరో ఒకరు ఉండవచ్చు అది వారి వ్యక్తిగతం. కానీ రాజ్యాంగ పదవిని అలంకరించే వారు వ్యక్తిగత అభిప్రాయాలను పక్కనబెట్టి సమిష్టితత్వంతో వ్యవహరించాలి. ఇందుకు భిన్నంగా భారత 14వ రాష్ట్రపతిగా ప్రమాణం చేసిన రాంనాథ్ కోవింద్ హిందూ జాతీయవాదానికి మాత్రమే కట్టుబడి పని చేసిన ఒక రాజకీయ నాయకులు దీన్ దయాళ్ ఉపాధ్యాయను ప్రస్తావించడం కూడా పరోక్ష పక్షపాత వైఖరేనన్నది స్పష్టం.

నేడు కేంద్ర ప్రభుత్వాన్ని నడిపిస్తున్న రాజకీయ పార్టీ ఒక వర్గాన్ని మాత్రమే ఏకం చేసి దేశ ఐక్యతను కోరుకుంటుంది. ఇది ఏ దేశంలోనూ సాధ్యపడదు. హిందువులుగా భావించబడుతున్న వారందరూ ఒకే ఆచారాలతో ఉన్నారా? లేరు. నేడు మత ప్రాతిపదికన వేర్పాటువాదాన్ని కోరిన వారు రేపు ఆచార, కుల, ప్రాంతాలుగా విభేదించరని ఏమిటి గ్యారంటీ? ఎప్పటినుండో తమిళనాడులో హిందీ భాష వాడకంపై అసంతృప్తి ఉంది, నేడది కర్నాటకకి విస్తరించింది. కాశ్మీరుకు మాత్రమే రాష్ట్ర జెండా ఉన్నది నేడు కర్నాటక కూడా రాష్ట్రానికి ప్రత్యేక జెండా ఉండాలంటోంది, లింగాయతులకు ప్రత్యేక మతం కావాలంటోంది. ఈ అస్తిత్వ భావనలన్నీ పుట్టుకు రావడానికి కారణం బీజేపీ ప్రోత్సహిస్తున్న వేర్పాటువాద ధోరణుల పర్యావసానాలే.

వివిధ జాతుల కలగలిపిన గొప్ప ఉమ్మడి సంస్కృతి భారతదేశం యొక్క వారసత్వ సంపద. దీని విచ్ఛిన్నానికి మత, సంప్రదాయ వాదులు తెగ కృషి చేస్తున్నారు. ప్రతిరోజూ పాఠశాల విద్యార్థులు ప్రార్థనలో ఉచ్ఛరిస్తున్న "ఈ దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం" అన్న పద పంక్తిలోని భారత వారసత్వ సంపదను సృష్టించింది మైనారిటీ, మెజారిటీలు కాదు అందరూ కలిసి నిర్మించిన సమ్మిళిత సంస్కృతి. నాగరికత అభివృద్ధి చెందిన చోట జీవన విధానాలను బట్టి నడుచుకోవాలి కాని సంప్రదాయపు నమ్మకాలను బట్టి కాదు. మూడు తరాలకు మించి మన పూర్వీకులెవరో.., వారు ఏ ఏ సాంప్రదాయాలు పాటించారో... తెలియదు కాని మూడు వేల ఏండ్ల నాటి అపరిపూర్ణ చరిత్రను ఉటంకిస్తూ ఎవరో రేపుతున్న ఉచ్చులో పడి ముక్కుపచ్చలారని జీవితాలను ఊచకోత కోసుకోవడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి.



మానవ సంబంధాలలో ముఖ్యంగా కుటుంబ సంబంధాలలో భారత్‌కు పెట్టింది పేరు. ఆకలి తీర్చగలిగిన అపర కుబేరులు కూడా కన్నతల్లిని అనాథ శరణాలయాలకు తరలిస్తుంటే పట్టించుకునే నాథుడు లేడు. కాని చనిపోయిన గోవుని పూడ్చిపెట్టినవారిని పాతిపెట్టేస్తున్నారు. ప్రపంచంలో ఏ దేశంలో చూసినా తల్లిని మించిన గొప్పదనం ఎవ్వరికీ, (దేవుడికి కూడా) ఇవ్వలేదు. కానీ మనదేశంలో కన్నతల్లికన్నా గోమాత(ఆవు) ఎక్కువౌతున్నది. గత నాలుగేండ్లలో గోవు పేరు మీద 28 మంది హత్యగావించబడ్డారు. ఇందులో 24మంది ముస్లింలు. సాక్షాత్తూ కేంద్రప్రభుత్వమే అనాలోచిత ఆవేశాలకు లోనై పశువుల వినియోగంపై అసంబద్ధ చట్టం చేసింది. "భారత" జాతీయ వాదం కాదు "హిందూ" జాతీయ వాదం కావాలంటూ అధికార పక్షమే రెచ్చగొడుతున్నప్పుడు శాంతికి స్థానమెక్కడ? అస్సాంలో, టీవీ షోలలో పాల్గొంటూ అద్భుతంగా పాడుతూ పాటల పోటీల్లో పాల్గొంటున్న పదహారేండ్ల నహీద్ ఆఫ్రీన్ని ఆ రాష్ట్రంలోని 46 ముస్లిం క్లెరిక్స్ మరియు మద్రసా టీచర్లు నిషేధిస్తూ ఆజ్ఞలు జారీ చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. అంతకు ముందు కేరళలో సుహాన సయ్యద్ అనే అమ్మాయి లార్డ్ బాలాజీ భజన గీతాలు ఆలపించిందని ముస్లిం ఛాందసవాదులు దూషించారు. ఇలా దూషించడం వ్యక్తిగత స్వేచ్ఛను హరించినట్టే. విచిత్రమేమంటే ఈ రెండు ఘటనలపై కొందరు కేంద్ర మంత్రులు, అస్సాం ముఖ్యమంత్రి, కొందరు హిందూ మత పెద్దలు ఆ ఇద్దరు అమ్మాయిలను బలపరుస్తూ తీవ్రంగా స్పందించారు. ఇది వాక్ స్వాతంత్ర్యానికి భంగమని ఎత్తి చూపారు. కానీ నవాజుద్దీన్ సిద్దిఖీని లక్నోలోని రాంలీలా మైదానంలో జరిగిన నాటకాల్లో శివసేన పాల్గొననివ్వనప్పుడు వీరిలో ఎవ్వరు కూడా నోరు విప్పలేదు. జన్మతాః క్రైస్తవుడైన గాయకుడు జేసుదాస్ హిందూ దేవుళ్ళను ఆరాధిస్తూ ముఖ్యంగా శబరిమలై పాటలతో ఎంతో అలరించారు. కానీ ఒక సందర్భంలో ఆయనను కూడా మందిరాల్లో అనుమతించలేదు. కొంతమంది బాలీవుడ్ నటులపై, వారి వ్యాఖ్యలపై దాడి జరిగినప్పుడు కూడా వాక్స్వాతంత్ర్యాన్ని కాపాడుతున్నామన్న ఏ నాయకుడూ ముందుకు రాలేదు. సారాంశమేమంటే మెజారిటీ వాదానికి అనుకూలంగా లేకుంటే సహించలేకపోతున్నారు. కాశ్మీర్లో అమరనాథ్ యాత్రికులపై దాడి చేసింది ముస్లిం తీవ్రవాదులు కావచ్చు. కాని చాలామందిని కాపాడింది ఒక ముస్లిం బస్ డ్రైవర్. పాలకుల విధానాలు అప్రయత్నంగానే పత్రికల ద్వారా ప్రజలను ప్రభావితం చేస్తాయని నానుడి కానీ కోర్టు తీర్పులను కూడా పాలకుల విధానాలు ప్రభావితం చేస్తాయని "వ్యక్తిగత స్వేచ్ఛకూ పరిమితులుండాలంటూ" సుప్రింకోర్టు ఇచ్చిన తీర్పులో స్పష్టమైంది. ఇదొక్కటే కాదు చాలా సందర్భాల్లో చాలా రాష్ట్రాలలో కోర్టు తీర్పులు ప్రభుత్వానికి అనుకూలంగనే వస్తున్నాయి. కోర్టులొక్కటే కాదు సీబీఐ లాంటి ప్రతిష్టాత్మక దర్యాప్తు సంస్థలు కూడా ఒక వైపుకు వాలిపోతున్న సంకేతాలనిస్తున్నాయి. కర్నాటకలోని కాంగ్రెస్ మంత్రి శివకుమార్ మాత్రమే దోషి అన్నట్టు ఆయనపై ఐటీ దాడులు ఎందుకు జరిగాయన్నది జగద్విదితం. బీహార్ నుండి వచ్చిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తన రిసార్ట్‌లో ఉంచడమే నేరమైంది. ఆయన దొంగో దొరో వేరే విషయం కానీ ప్రతిపక్షంలో ఉన్న అలాంటి ఇతర రాష్ట్రాలైన బెంగాల్ త్రిపుర, ఢిల్లీ వంటి చోట్ల మాత్రమే దాడులు జరుగుతున్నాయి. పాలక పక్షం చట్టానికి అతీతులమనే భావనను కల్పిస్తున్నది. ఉదా.. ఉత్తరప్రదేశ్‌లో అధికార పార్టీ కార్యకర్తలు పోలీసు నిబంధనలు పాటించకుండా అధికారులకు ఎదురు తిరిగి వాదులాడి, అడ్డగించిన మహిళా పోలీసు అధికారిని బదిలీ చేయించారు.

ప్రధాని నరేంద్ర మోడీ జులై నెల రేడియో ప్రసంగం మన్ కీ బాత్‌లో క్విట్ ఇండియా మూమెంట్ గురించి ప్రస్తావిస్తూ క్విట్ భ్రష్టాచార్, క్విట్ పావర్టీ, క్విట్ టెర్రరిస్మ్... అంటూ భావావేశపు నినాదాలు చేశారు. అయితే భారత దేశానికి వీరిచ్చిన నినాదాలు అవసరమే. కానీ నేడు వాటన్నిటికన్నా కావాల్సింది స్వామి వివేకానందుడు చెప్పినట్టు క్విట్ బిగాట్రి(ఏక పక్ష వాదన), క్విట్ పర్సెక్యూషన్(మతపరమైన హింస), క్విట్ హేట్రెడ్ (అసహ్య భావన) అత్యంత కీలకమైనవి. వీటికి కావలసిందల్లా అభివృద్ధి ధృక్పథంలో మార్పు. మానవాభివృద్ధి మతపరమైన ఏకీకృతంలో కాదు. ఆర్థిక అసమానతల తొలగింపులో ఉన్నది. నాది... నా మతం, ఆచారం గొప్ప అని చెప్పుకునే ప్రతివారిలోనూ మనం మనది అని చెప్పగలిగే రోజు రావాలి.

సెల్: 9951300016

'లింగ వివక్షను రూపుమాపాలి.. జెండర్ సెన్సిటైజేషన్ రావాలి' అంటూ ఎంతో మాట్లాడుకుంటున్నాం. కానీ వేదికలపై ప్రసంగాలతోనూ.. మీడియాలో రాతలతోనూ మాత్రమే వివక్షను అంతం చేయలేం. లింగవివక్షకు బీజాలు కుటుంబంలోనే ఉన్నాయి. చిన్నతనం నుంచి కుటుంబవ్యవస్థలో వినే మాటలతోనే పిల్లలు మనసులో వివక్ష రూపుదిద్దుకుంటుంది. అందుకే కుటుంబంలో ఎంత ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటే... పిల్లలు అంత ఆరోగ్యంగా పెరుగుతారు. ఇంట్లో వాళ్లు మహిళలకు ఎంత గౌరవం ఇస్తే... పిల్లలు అంతగా గౌరవించడం నేర్చుకుంటారు.

ఇల్లే తొలి వేదిక



ఇటీవల గ్లోబల్ ట్రెండ్స్ నిర్వహించిన ఒక సర్వేలో 64శాతం మంది భారతీయులు మహిళలను మంచి భార్యగా, తల్లిగా మాత్రమే గుర్తిస్తామని తమ అభిప్రాయం వెల్లడించారు. ఆశ్చర్య గొలిపేలా ఉన్నా... అదే వాస్తవం. అందుకు ముఖ్యమైన కారణం బాల్యం నుంచి ఇంట్లో వినిపించే కొన్ని మాటలు..

'అమ్మాయిలా ఆ ఏడుపు ఎంటీ?'
'ఏడిచే మగవాడిని.. నవ్వే ఆడదాన్ని నమ్మొద్దు'
'ఆడపిల్లలకు ఇంటి పని రావాలి'
'మగవాళ్లకు వంటింట్లో ఏం పని?'
'మగరాయుడిగా బయట తిరుగుతున్నావా?'
'అమ్మాయిలు అమ్మాయిలతోనే ఆడుకోవాలి'
'పొద్దువాలేలోగా ఆడపిల్లలు ఇంట్లో ఉండాలి'
'ఆడపిల్లకు చదువేందుకు? మొగుడికి వండిపెట్టి.. పిల్లలను కని పెంచితే చాలు'
'చేతులకు గాజులు తొడుకున్నామా?'
'ఉద్యోగం పురుష లక్షణం'

ఇలా... ఒకటా, రెండా బోలెడు. ఇలాంటి మాటలు మనదేశంలో జీవితంలో కనీసం ఒక్కసారైన వినని వ్యక్తులు లేరంటే అతిశయోక్తి కాదు. ఇంట్లోనూ.. ఇరుగుపొరుగు వారింట్లోనూ.. చివరకూ సినిమా, టీవీలలోనూ కూడా ఇలాంటి డైలాగులే.. ప్రతిచోటా, ప్రతిపనిలోనూ వివక్షే. లింగ అసమానత అనేది ఇంట్లోనే మొదలవుతుంది. అమ్మలే ఈ అసమానతను పిల్లలకు ఉగ్గుపాలతో పాటు నేర్పిస్తారు. ఆడపిల్ల, మగపిల్లాడు ఇద్దరూ ఉన్న కుటుంబాలను పరిశీలిస్తే.. వారి ఆటబొమ్మల నుంచి కూడా తేడాలను గమనించవచ్చు. అబ్బాయిలకు కార్లు, ఆడుకునే బొమ్మలు కొనిస్తే.. అమ్మాయిలకు బార్బీడాల్స్, వంటింటి సామానులు కొనిస్తారు. అబ్బాయిలు కార్లతో రేస్‌లు ఆడుకుంటుంటే అమ్మాయిలు బొమ్మలకు స్నానం చేయించి.. ముస్తాబు చేస్తుంటారు. స్మార్ట్‌ఫోన్స్‌లోనూ అమ్మాయిలకు.. అబ్బాయిలకు వేరువేరుగా డిజైన్ చేసిన గేమ్స్ మనం గమనించవచ్చు. బాల్యంలోనే అమ్మాయిలు.. అబ్బాయిలు వేరు అన్న భావన పిల్లల్లో నాటుకుపోతుంది. వారితో పాటే పెరిగి పెద్దదై సమాజంలో లింగ వివక్షకు కారణం అవుతుంది.

ఇటీవల ఇప్సోస్ గ్లోబల్ ట్రెండ్స్ నిర్వహించిన ఒక సర్వేలో 64శాతం మంది భారతీయులు మహిళల పాత్ర మంచి తల్లి, మంచి భార్య అని నమ్ముతారు. ప్రపంచవ్యాప్తంగా 144 దేశాలలో నిర్వహించిన జెండర్ గ్యాప్ ఇండెక్స్‌లో భారత్ 87వ స్థానంలో ఉంది. మరి ఈ పరిస్థితిని మార్చాలంటే మనం ఏం చేయాలి? ఉపన్యాసాలతో సమానత్వం వస్తుందా? అమ్మగా.. తోబుట్టువుగా, భార్యగా.. మహిళల పాత్ర ఎలా ఉండాలి? దీనికి సమాధానం మన ఇంటి నుంచే ప్రారంభం కావాలి.



మీ పిల్లలతో మాట్లాడండి

మీ పిల్లలు అమ్మాయైనా.. అబ్బాయైన వారికి మీరు చెప్పే పనులలో తేడాలు చూపకండి. అమ్మాయిలైతే ఇంటిపనులు, అబ్బాయిలైనే బయటి పనులు పురమాయించడం చేయవద్దు. పిల్లలిద్దరికీ అన్ని పనులు నేర్పించండి. స్వతంత్రంగా వారి పనులు వారు చేసుకునేలా తర్ఫీదు ఇవ్వండి. మార్కెట్‌కు వెళ్లే పనులకు పిల్లలిద్దరినీ తీసుకువెళ్లండి. మీరు ఎంత బిజీగా ఉన్న రోజులో వీలైనంత సమయం వారితో మాట్లాడండి.

రోల్‌మోడల్‌గా ఉండండి

ఈ తరం పిల్లలు చాలా తెలివైనవారు. ఎవరూ ఎన్ని చెప్పినా..



వారు చూసిందే నేర్చుకుంటారు. వారికి ఇంట్లో కనిపించే అమ్మనాన్ననే రోల్‌మోడల్స్. ఇంట్లో అమ్మ వంటింట్లో బిజిగా పనిచేస్తుంటే.. నాన్న లాప్‌టాప్‌తో బిజిగా ఉంటే వారి మనోచిత్రంపై అదే రికార్డు అవుతుంది. అలాకాకుండా కిచెన్‌లో అమ్మకు నాన్న సహాయం చేస్తుంటే వారు కూడా వచ్చి చిన్నచిన్న పనులు చేస్తుంటారు. ప్రాక్టికల్‌గా వారు నేర్చుకోవడంతో పాటు పనులు ఇద్దరికీ సమానమే అని చిన్నతనం నుంచే తెలుసుకుంటారు.

గౌరవం నేర్పండి

వినయం లేని విద్య నిరూపయోగం అని పెద్దలు అంటారు. ఎంత ఉన్నత చదువులు చదివినా ఎదుటి మనషిని గౌరవించడం తెలియకపోతే.. జెండర్ సెన్సిటైజేషన్ అనేది సాధ్యం కాదు. పెద్దవారిని గౌరవించడం, తోటివారితో స్నేహంగా మెలగడం, చిన్నవారిని ఆప్యాయంగా చూడటం చిన్నతనం నుంచి నేర్పించండి. ఈ అలవాటు దీర్ఘకాలంలో సోసైటీ జెండర్ సెన్సిటైజేషన్ చేస్తుంది.

మద్దతు ఇవ్వండి

చాలామంది తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను పిల్లలపై బలవంతంగా రుద్దుతారు. ఇది కరెక్ట్ కాదు. మీ పిల్లల ఇష్టాలను తెలుసుకుంటూ వారికి మద్దతు ఇవ్వండి. ముఖ్యంగా టీనేజ్ పిల్లల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. 14ఏండ్లు దాటిన పిల్లలతో స్నేహంగా మెలగండి. స్కూలులో జరిగే విషయాలు వారు మీతో షేర్ చేసుకునే టైం వారికి ఇవ్వండి. వారి అభిరుచులను తెలుసుకోండి. మంచి మంచి పుస్తకాలు చదివేలా వారికి ప్రోత్సహించండి.

ఇవి చిన్నచిన్న విషయాలే.. కానీ సమాజంలో జెండర్ సెన్సిటైజేషన్ పెంచే ప్రయత్నాలు ఇంటినుంచే ప్రారంభం కావాలన్న చిన్న లాజిక్‌ను గుర్తుంచుకోండి.

వి. యశోద

చుక్కలపై పరిశోధనలు..



ఎవా అనెర్ట్-రోహిఫ్స్
(11 ఆగస్టు 1912 - 9 మార్చ్ 1954)

ఆకాశంలో మిలమిల మెరిసే చుక్కలను చూసి మనం సంబురపడతాం. కానీ ఆమె వాటి వెనుక మెరుపుల కథ తెలుసుకోవాలనుకున్నారు.. చిన్నతనం నుంచే తారలపై మక్కువ పెంచుకుని ఖగోళ శాస్త్రవేత్తగా ఎదిగారు. ఆమె జర్మన్ ఖగోళవేత్త ఎవా అనెర్ట్ రోహిఫ్స్.

ఎవా జర్మనీలోని కోబర్గ్ నగరంలో జన్మించారు. వర్స్‌బర్గ్, మ్యూనిచ్, కీల్‌లలో ఆమె విద్యాభ్యాసం కొనసాగింది. ఆ తర్వాత కుటుంబానికి దూరంగా ఉంటూ ఆమె తన ఉన్నతవిద్యను పూర్తి చేసింది. సోన్నెబెర్గ్ అబ్జర్వేటరీలో ప్రముఖ జర్మనీ ఖగోళశాస్త్రవేత్త ప్రొఫెసర్ కునో హాఫ్మెయిస్టర్ దగ్గర అసిస్టెంట్ ఖగోళశాస్త్రవేత్తగా చేరారు. 1951 లో జెన విశ్వవిద్యాలయం నుండి ఖగోళ భౌతిక శాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నారు. సోన్నెబెర్గ్ అబ్జర్వేటరీలో పనిచేసే ఖగోళశాస్త్రవేత్త పాల్ ఓస్వాల్డ్ అనెర్ట్‌తో పరిచయం ప్రేమగా మారింది. వారిద్దరూ 1952 లో పెండ్లి చేసుకున్నారు.

విశాల వినీలాకాశంలో మిలమిల మెరిసే తారలపై ఆమె ఎన్నో పరిశోధనలు చేశారు. మరిన్ని పరిశోధనలు చేసి సమయంలోనే ఆమె అకాల మరణం పొందారు. 41 ఏళ్ల వయసులో సోనేబర్గ్‌లో తుదిశ్వాస విడిచారు. ❄

బయటికి వెళ్తున్నారా !



వానా కాలంలో ఆహ్లాదకరమైన గాలి, ప్రశాతంతమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తూ అన్ని పనులను ఆనందంగా పూర్తి చేసుకోవాలంటే కొన్ని చిట్కాలను పాటించాల్సిందే !

- ఆఫీసు వెళ్లే ముందు, అత్యవసర పని మీద బయటకు వెళ్సాల్సి వస్తే కాళ్లకు కంఫర్టుగా ఉండే చెప్పులను వేసుకోవాలి. వర్షంలో తడిసినా పాడవకుండా ఉండే చెప్పులను లేదా వాటర్ ప్రూఫ్ షూను ఎంచుకుంటే సరిపోతుంది. వాటర్ ప్రూఫ్ షూవల్ల కాళ్లు తడవకుండా కాపాడుకోవచ్చు.
- అలాగే ఏదైనా అకేషన్‌కు, పార్టీకి వెళ్లాల్సి వస్తే రెయిన్ కోట్ వేసుకుంటే మంచిది. దీని వల్ల దుస్తులు తడిసిపోవు. రెయిన్ కోట్ వేసుకుంటే ముఖ్యంగా జుట్టు వానలో తడవకుండా కాపాడుకోవచ్చు.
- ఇతర పనుల మీద బయటకు వెళ్లాల్సి వస్తే చిన్న సైజు గొడుగును తీసుకెళ్లడం మంచిది. ఎందుకంటే వర్షం పడినా ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం ఉండదు.
- కొంత మందికి వర్షంలో తడిస్తే వెంటనే జలుబు, దగ్గు వంటివి వచ్చే ప్రమాదం ఉంటుంది. అలాంటి వారు చెవుల్లో పత్తి పెట్టుకోవడం, ముఖానికి స్కార్ఫ్ కట్టుకోవడం, రెయిన్ కోట్ వేసుకోవడం వంటి చిన్న చిన్న నియమాలను పాటిస్తే సరిపోతుంది. ❄

ఇవి తింటే తగ్గుతారు...

పొట్టతగ్గాలంటే తక్కువ తినాలనుకుంటారు చాలా మంది. కానీ కొన్నింటిని ఎక్కువగా ఆహారంలో తీసుకున్నా పొట్ట తగ్గుతుంది. అవేంటంటే...

బాదం: మోనోశాచురేటెడ్ ఫ్యాట్లు శరీరంలో కొవ్వును కరిగించే శక్తిని పెంచుతాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. శరీరంలో నీరు కూడా పేరుకోకుండా ఉంటుంది. ఆ పోషకాలు అందాలంటే బాదంతోపాటు ఇతర నట్స్ తినాలి.

గుడ్డు: మాంసకత్తులు అధికంగా అందించే గుడ్డు పొట్ట చుట్టూ ఉండే కొవ్వుని కరిగించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా తెల్లసొన తీసుకోవడం వల్ల బి12, డి విటమిన్లు, ఒమెగా- 3 ఫ్యాటీ ఆమ్లాలు శరీరానికి అధికంగా అందుతాయి. ఇవి బరువు తగ్గడంలో కీలక పాత్రపోషిస్తాయి. దీనివల్ల ఎముక సాంద్రత పెరుగుతుంది. గుండె పని తీరు కూడా మెరుగవుతుంది.

పండ్లు: ఆకలిగా అనిపించినప్పుడు ఏ చిరుతిళ్లొ తినే బదులు.. పండ్లు ఎంచుకోవడం మంచిది. వీటి వల్ల చక్కెర్లు, కొవ్వు బాధ ఉండదు. పోషకాలు ఎక్కువగా అందుతాయి. బరువు తగ్గుతారు.



కీరా : ఇందులో కెలోరీలు చాలా తక్కువ. పైగా తొంభ్కైశాతం వరకూ నీరే ఉంటుంది. ఒక్క కీరా తింటే.. అందే కెలోరీలు కేవలం 45 మాత్రమే. ఆకలీ వేయదు. అందుకే.. భోజనానికి ముందు ఒక కీరా తీసుకోగలిగితే అన్నం తక్కువ తినే ఆస్కారం ఉంటుంది.

గింజలు

అన్నిరకాల గింజల్ని ఎంత ఎక్కువగా తీసుకుంటే.. అంత మంచిది. శరీరంలోని కొవ్వు కరగడంతోపాటూ.. కండరాలూ ఆరోగ్యంగా మారతాయి. జీర్ణవ్యవస్థ పనితీరు కూడా మెరుగుపడుతుంది. సెనగలూ, బఠాణీలూ, పెసల మొలకల్లాంటివి పావు కప్పు తిన్నా.. పొట్టనిండినట్లు అనిపిస్తుంది. ఎక్కువ సేపు ఆకలి కూడా వేయదు. ఇదే బరువు తగ్గడానికి దారితీస్తుంది. ❄

ఇట్లచేద్దాం

బ్రెడ్ పాడవకుండా ఉండాలంటే అందులో ఓ ఆలుగడ్డ ముక్కను ఉంచితే సరిపోతుంది.

ఉద్యోగం మారుతుంటే..?



ఏదో కారణం వల్ల చాలా మంది ఉద్యోగాలు మారుతూ ఉంటారు. హఠాత్తుగా మరో ఉద్యోగంలో చేరుతున్నారా? అయితే ఈ జాగ్రత్తలు తీసుకున్నారా? లేదా ఒక్కసారి చూడండి. ప్రస్తుతం మీరు ఏ సంస్థలో ఉద్యోగం కోసం చేరినా వేతనాలన్నీ బ్యాంకు ద్వారానే జమ అవుతున్నాయి. ఆయా సంస్థలు తమ ఉద్యోగులకు బ్యాంకులు ప్రత్యేకంగా జీరో బ్యాలెన్స్ అకౌంట్ ఖాతాలనే అందిస్తున్నారు. ఇలా కొత్త ఉద్యోగంలో చేరినప్పుడల్లా కొత్త బ్యాంక్ అకౌంట్ కూడా ప్రారంభించాల్సి ఉంటుంది. ఇలాంటివే మరిన్ని విషయాలను తెలుసుకుందాం.

బ్యాంక్ ఖాతా: ఇక్కడే చాలా మంది నిర్లక్ష్యం వహిస్తుంటారు. పాత కంపెనీలో ఉన్న బ్యాంకు ఖాతాను రద్దు చేయకుండానే మరో బ్యాంకు ఖాతాను ప్రారంభిస్తుంటారు. దీని వల్ల భవిష్యత్‌లో ఇబ్బందులు వస్తాయి. ఆయా కంపెనీ ఇచ్చే శాలరీ అకౌంట్‌లో మూడు నెలల పాటు జీతం పడకపోతే దాన్ని సేవింగ్స్ అకౌంట్‌గా బ్యాంకులు మార్చేస్తాయి.కొన్ని బ్యాంకుల్లో సేవింగ్స్ అకౌంట్‌లో నిల్వ రూ. 10 వేల నుంచి 25 వేల వరకూ ఉంటుంది. దీంతో మినిమం బ్యాలెన్స్‌ను ఉంచకపోతే రూ. 750 నుంచి రూ.1,000 వరకూ రుసుము విధిస్తారు. కాబట్టి ఉద్యోగం మారితే, పాత ఖాతాను రద్దు చేసుకుంటే మంచిది.

ఎంప్లాయి ప్రావిడెంట్ ఫండ్(ఈపీఎఫ్): కొత్త ఉద్యోగంలో చేరినప్పుడు పాత కంపెనీకి చెందిన ప్రావిడెంట్ ఫండ్ విషయంలో చాలా మంది గందరగోళానికి గురవుతుంటారు. ప్రావిడెంట్ ఫండ్ విషయంలో రెండు పద్ధతులున్నాయి. ఒకటి పాత కంపెనీకి చెందిన ప్రావిడెంట్ ఫండ్ మొత్తం తీసుకుని ఖాతాను రద్దు చేసుకోవడం. రెండోది పాత కంపెనీ పీఎఫ్ ఖాతా రద్దు చేసుకోకుండా కొత్త కంపెనీ పీఎఫ్ ఖాతాలోకి బదిలీ చేసుకోవడం.

ఇలా చేయడం మంచిది: రిటైర్మెంట్ తర్వాత పెద్దమొత్తంలో నగదు ఆశించే వారు ఈపీఎఫ్ నుంచి నగదు తీసుకోకుండా బదిలీ చేసుకోవడమే ఉత్తమం. దీని వల్ల మీ నగదు చక్రవడ్డీకి దూరం కాదు. దీంతో పాటు ట్యాక్స్ పరంగా కూడా కలిసి వస్తుంది. అయితే కొత్త కంపెనీ పీఎఫ్ ఖాతాలోకి నగదు బదిలీ చేసుకోవడానికి కనీసం మూడు నెలలు సమయం పడుతుంది.

ఇన్‌కమ్ ట్యాక్స్: సాధారణంగా అందరూ ఆర్థిక సంవత్సరం మొదటి నుంచి ఇన్‌కమ్ ట్యాక్స్ నుంచి తప్పించుకునేందుకు ప్రణాళికలు వేసుకుంటారు. కాబట్టి పాత కంపెనీలో పని చేస్తున్నప్పుడు అకౌంట్స్ విభాగానికి సమర్పించిన పన్ను ఆదా పథకాలకు సంబంధించి వివరాలు ఒకసారి చూసుకోండి. పాత కంపెనీ ఫారం-16, సీటీసీ వివరాలను జాగ్రత్త పరుచుకోండి.

ఇన్సూరెన్స్ పాలసీలు: నెలవారీ ప్రీమియం చెల్లిస్తుంటే, బీమా సంస్థకు మీరు ఉద్యోగం మారిన విషయంతో పాటు కొత్త బ్యాంకు వివరాలను కూడా తెలియజేస్తే మంచిది. ఇలా చేయడం వల్ల మీ పాలసీ చెల్లించే ప్రీమియానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ❄

జిడ్డుకు పరిష్కారం...

కారణం ఏదైనా ..జిడ్డు సమస్య ఎక్కువగా ఇబ్బంది పెడుతుంటే నిర్లక్ష్యం చేయకూడదు. ఇంట్లో దొరికే సహజ పదార్థాలతోనే సమస్యకు పరిష్కారం ఉంది.

నిమ్మరసం, మినరల్ వాటర్‌ని సమపాళ్లలో తీసుకుని అందులో దూదిని ముంచి ముఖాన్ని తుడుచుకోవాలి. పదినిమిషాల తరవాత గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకుని నూనె లేని మాయిశ్చరైజర్ రాసుకోవాలి.

రెండు చెంచాల పెరుగులో కొద్దిగా ఓట్‌మీల్ పొడి, చెంచా గోరువెచ్చని తేనె కలిపి ముఖానికి రాసి, మర్దన చేసుకోవాలి. పావుగంటయ్యాక కడిగేయాలి.



టమాట ముక్కతో ముఖం మీద మర్దన చేసుకోవాలి. వీలుంటే టమాట రసంలో కాస్త తేనె కలిసి ముఖానికి మర్దన చేస్తే మరీ మంచిది.

యాపిల్ గుజ్జులో కాస్త, పెరుగు, నిమ్మరసం కలిపి రాసుకోవాలి. ఈ మిశ్రమాన్ని స్నానానికి ముందు ముఖానికి రాసుకోవాలి. అరగంటయ్యాక గోరువెచ్చటి నీళ్లతో కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల ముఖం మీద జిడ్డు పేరుకోకుండా ఉంటుంది.

కీరదోస గుజ్జును, నిమ్మరసం సమపాళ్లలో తీసుకుని ముఖానికి రాసుకోవాలి. కాసేపటికి కడిగేసుకుంటే సరిపోతుంది. ❄

ఆయేషా మీరా హత్య కేసుపై విశాఖ డీఐజీ శ్రీకాంత్‌తో సిట్

హైదరాబాద్: ఆయేషా మీరా హత్య కేసును తిరిగి దర్యాప్తు చేసే ప్రత్యేక దర్యాప్తు బందానికి (సిట్) విశాఖ రేంజ్ డీఐజీ సీహెచ్ శ్రీకాంత్ సారథ్యం వహిస్తారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు వివరించింది. వెంటనే దర్యాప్తును ప్రారంభించే సిట్ టీంలో సభ్యులుగా డీఎస్పీలు శ్రీలక్ష్మి, డి.హిమావతి, నున్న ఇన్‌స్పెక్టర్ సాహెరున్నీసా ఉంటారని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్‌కు విన్నవించింది. బి ఫార్మసీ విద్యార్థిని అయేషా మీరా హత్య కేసులో పి.సత్యంబాబును హైకోర్టు నిర్దోషి తేల్చుతూ,అసలు దోషులు ఎవరో గుర్తించే ప్రయత్నం చేయాలని పేర్కొంది.దీంతో ఈ కేసును పునర్ దర్యాప్తు చేయాలని కోరుతూ ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ రమా మేల్కోటే, సామాజిక కార్యకర్త వి.సంధ్యారాణి, జర్నలిస్టు కె.సజయ వేసిన ప్రజాహిత వ్యాజ్యంతోపాటు పలువురు పిటిషన్ వేశారు.

రూ.2.17 కోట్లు జరిమానా చెల్లించిన శ్రీచైతన్య, నారాయణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేట్ కాలేజీలు దిగొచ్చాయి. ప్రవేశాలు, ఇతర నిబంధనలు పాటించని శ్రీచైతన్య, నారాయణ కాలేజీలపై విజిలెన్స్ కమిషన్ గతేడాది జరిమానా విధించిన విషయం తెలిసిందే. గురువారం ఇంటర్ బోర్డుకు ఆ కాలేజీ యాజమాన్యాలు జరిమానా చెల్లించినట్టు తెలిసింది. శ్రీచైతన్య కాలేజీ రూ.1.55 కోట్లు, నారాయణ కాలేజీ రూ.62 లక్షల చొప్పున మొత్తం రూ.2.17 కోట్లు జరిమానా చెల్లించినట్టు సమాచారం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణలోనూ ఇంటర్ బోర్డుపై కార్పొరేట్ కాలేజీలు పెత్తనం సాగిస్తున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలోనూ కార్పొరేట్ కాలేజీలు ఇంత పెద్దమొత్తంలో జరిమానా చెల్లించిన దాఖలాలు లేవు. తెలంగాణ ఇంటర్ బోర్డుకు రూ.2.17 కోట్లు చెల్లించడం చారిత్రాత్మకమని పలువురు విద్యావేత్తలు అంటున్నారు.

ప్రత్యేకచట్టం తేవాలి

- **మైనార్టీలు, దళితులు, మహిళలపై దాడుల నివారణకు బివి రాఘవులు డిమాండ్**



సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా అనంతపురంలో నిర్వహించిన భారీ ప్రజా ప్రదర్శన, అనంతరం జరిగిన బహిరంగ సభలో అభివాదం చేస్తున్న నాయకులు

అనంతపురం : దేశ వ్యాప్తంగా మైనార్టీలు, దళితులు, మహిళలపై పెరుగుతున్న దాడుల నివారణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా అనంతపురంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ అధ్యక్షతన గురువారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో నరేంద్రమోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దాడులు విపరీతంగా పెరిగాయని అన్నారు.
దాడుల నుండి ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం దానికి భిన్నంగా మత విద్వేషాలు, ప్రాంతీయ వైషమ్యాలను పెంచి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని విమర్శించారు దేశంలో వ్యవసాయం తీవ్రమైన సంక్షోభంలో ఉందని తెలిపారు. దీంతో చాలా రాష్ట్రాల్లో రైతులు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు నిర్వహిస్తున్నారని చెప్పారు. వారి రక్షణకు ప్రత్యకమైన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఎన్‌డిఎ అధికారంలోకి రాకముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న 70 లక్షల ఉద్యోగులను తొలగించారన్నారు. బ్యాంకింగ్, విమానయాన తదితర ప్రభు త్వరంగ సంస్థలన్నింటినీ ప్రయివేటుపరం చేసే చర్యలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేగవంతంగా చేపట్టిందన్నారు. జీఎస్‌టీ అమలుతో చిన్న పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతినే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పై సమస్యలన్నింటిపైనా ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు దేశవ్యాప్త ప్రచారోద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బాబును ఉరితీసినా తప్పలేదు :జగన్

నంద్యాల : 'నంద్యాలలో ఉప ఎన్నికల్లో ఓటరుకు రూ.5 వేలు చొప్పున ఇచ్చి ఓటు వేయాలని టీడీపీ నాయకులు ప్రమాణం చేయించుకుంటున్నారు. ముఖ్యమంత్రి అబద్ధాల టేప్ రికార్డు ఆన్ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు' అని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి తీవ్రంగా విమర్శించారు. నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గంలోని చాబోలు గ్రామంలో గురువారం జగన్ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేబినెట్ మొత్తం నంద్యాలలో తిష్ట వేసిందన్నారు. 'ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసాలు చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబును ఉరితీసినా తప్పులేదని మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలకు తెరదీశారు. 'ఎన్నికల ముందు హామీలు ఇచ్చి తప్పితే తప్పు కాదా? మాట తప్పినందుకు ఉరిశిక్ష విధించాలంటే నా దిష్టిబొమ్మను కాల్చారు.' అని జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

ఉద్యమించిన విద్యార్థి లోకం

విజయవాడ : అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా గురువారం ఐక్యంగా ఉద్యమించారు. ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, పీడీఎస్‌ఒ, పీడీఎస్‌యూ ఆధ్వర్యాన తరగతులను స్వచ్ఛందంగా బహిష్కరించి బంద్ పాటించారు. అనేక జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలల యాజమా న్యాలు ముందుగానే సెలవు ప్రకటించాయి. రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కళాశాలలు మూతబడ్డాయి. అన్ని జిల్లాల్లోనూ విద్యాసంస్థల బంద్ సంపూర్ణంగా విజయవంతమైంది. బంద్‌లో భాగంగా విద్యార్థులు పలుచోట్ల ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహిం చారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీని ముట్టడిస్తా మని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు.

పరిటాల శ్రీరామ్ నిశ్చితార్థం

హైదరాబాద్ : మంత్రి పరిటాల సునీత కుమారుడు శ్రీరామ్ నిశ్చితార్థం గురువారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. మాదాపుర్‌లోని ఎన్ కన్వెన్షన్‌లో పరిటాల కుటుంబ సభ్యులు, అభిమానుల మధ్య వైభవంగా జరిగిన ఈ వేడుకకు రాజకీయ, సినీ ప్రముఖులు విచ్చేశారు.

సిటిజన్స్ ఆస్పత్రిలో బేరియాట్రిక్ సర్జరీ

హైదరాబాద్ : అధిక బరువు తగ్గించుకునేందుకు, జీవక్రియ లోపాల చికిత్స కోసం ప్రత్యేక బేరియాట్రిక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్టు సిటిజన్స్ స్పెషాలిటీ ఆస్పత్రి పేర్కొన్నది. డాక్టర్ సురేష్ చంద్రహరి ఆధ్వర్యంలో ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్టు తెలిపింది. బేరియాట్రిక్ సర్జరీ కోసం 9000900773 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఖాతాదారులకు నాణ్యమైన సేవలు

- **భారత్ బిల్లు చెల్లింపు వ్యవస్థను ప్రారంభించిన ఏపీ మహేశ్ కోఆపరేటివ్ బ్యాంక్**

హైదరాబాద్ : తమ ఖాతాదారులకు నాణ్యమైన సేవలందిస్తున్నామని ఏపీ మహేశ్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మెన్ పురుషోత్తందాస్ మంధానా అన్నారు. బ్యాంకు స్థాపించి 40 ఏండ్లు పూర్తయిందన్నారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.3300 కోట్ల లావాదేవీలు నిర్వహించామని అన్నారు. తమ ఖాతాదారుల సౌలభ్యం కోసం భారత్ బిల్లు చెల్లింపు వ్యవస్థను ప్రారంభించామన్నారు. తద్వారా ప్రజలు బ్యాంకు శాఖ లేదా ఇంటర్నెట్ ద్వారా కరెంట్, నీటి, టెలిఫోన్, గ్యాస్ బిల్లులు చెల్లించుకోవచ్చున్నారు. కార్యక్రమంలో తెలంగాణ పరిశ్రమల కమిషనర్ అహ్మద్ నదీమ్, జైళ్ల కరెక్షనల్ సర్వీసుల డీజీ వినోయ్‌కుమార్ సింగ్, బ్యాంక్ వైస్ చైర్మెన్ రాంపాల్ అట్టల్, బ్యాంక్ ఎండీ ఉమేశ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో జీఎస్టీపై అవగాహన సదస్సు

హైదరాబాద్ : గోదావరిఖని జీఎం కార్యాలయంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)పై అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి రామగుండం, బెల్లంపల్లి ప్రాంతాల ఉద్యోగులు, కార్మికులు హాజరైనట్టు సింగరేణి డైరెక్టర్ పవిత్రన్ కుమార్ పేర్కొన్నారు. జీఎస్టీ అమలు చేయడంలో సింగరేణి రాష్ట్రంలోనే ముందంజలో ఉందన్నారు. ఈసందర్భంగా జీఎస్టీకి సంబంధించి ఉద్యోగులు అడిగిన పలు సందేహాలను పవిత్రన్ కుమార్ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జీఎం (సివిల్ క్వాలిటీ) మురళీకృష్ణ, జీఎం నర్సింహమూర్తి, కార్పొరేటర్ చక్రవర్తి, విజయ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారుపై సర్పంచుల సమరభేరి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సమస్యలు పరిష్కరించకపోతే త్వరలో 'చలో ప్రగతిభవన్' కార్యక్రమాన్ని చేపడతామని తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ ప్రకటించింది. టీఆర్ఎస్ మూడేండ్ల కాలంలో స్థానిక సంస్థలకు పైసా ఇవ్వలేదని విమర్శించింది. గురువారం తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షులు సి సత్యనారాయణరెడ్డి, గౌరవాధ్యక్షులు నరేందర్, కన్వీనర్ ఎం.పురుషోత్తమరెడ్డి, కోకన్వీనర్ అనంత్‌గౌడ్ తదితరులు హైదరాబాద్‌లోని ఒక ప్రయివేటు హోటల్‌లో విలేకర్లతో మాట్లాడారు. సర్పంచులు, పంచాయతీరాజ్ సంస్థల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 14వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా పంచాయతీరాజ్ సంస్థలకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సైతం టీఆర్ఎస్ ప్రభుత్వం కాలరాస్తున్నదని విమర్శించారు. కరెంటు బిల్లులు, ఇతర ఛార్జీలు చెల్లించడానికి కేంద్రం నుంచి వచ్చే నిధులను వినియోగిం చబోమన్నారు. మూడేండ్లుగా సర్పంచులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి రాలేదన్నారు. గ్రామాల్లో సర్పంచులు ప్రజలకు ముఖం చూపించలేని పరిస్థితి నెలకొందన్నారు. దాదాపు రూ. 5 వేల కోట్లు స్థానిక సంస్థలకు రావాల్సి ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్త పర్యటన అనంతరం చలో ప్రగతిభవన్ చేపట్టనున్నట్టు ప్రకటించారు.

డిగ్రీ తుది విడత సీట్లు కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల్లో భాగంగా తుది విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా గురువారం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) సీట్లు కేటాయించింది. తుదివిడతలో 77,502 మంది విద్యార్థులు వెబ్ఆప్షన్లు నమోదు చేయగా, 74,699 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. 1092 డిగ్రీ కాలేజీల్లో 4,10,267 సీట్లున్నాయి. ఇప్పటికే రెండు విడతల్లో విద్యార్థులకు సీట్లు కేటాయించారు. తుదివిడతలో కేటాయించిన వారిలో గురువారం 25,049 మంది అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. 968 మంది ప్రవేశాలను ప్రిన్సిపాల్స్ ఆమోదించారు. ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కాలేజీల్లో చేరేందుకు గడువుంది.

'మల్లన్నసాగర్' టెండర్లను నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇవ్వలేం : హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్

మల్లన్నసాగర్ రిజర్వాయర్ నిర్మాణ పనుల టెండర్ పనుల్ని నిలిపివేస్తూ మధ్యంతర స్టే ఉత్తర్వుల మంజూరు చేసేందుకు హైకోర్టు నిరాకరించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించబోయే మల్లన్నసాగర్ టెండర్ ప్రక్రియ నిలిపివేసేందుకు న్యాయమూర్తి ఎ.రామలింగేశ్వరరావు అంగీకరించలేదు. అయిదారుగురి కోసం భారీ ప్రాజెక్టు పనులపై స్టే ఇవ్వజాలమని తేల్చి చెప్పారు. బహుళ ప్రజావసరాల కోసమని అంటే ఈ వ్యాజ్యాన్ని ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించాలని రిజిస్ట్రీని ఆదేశిస్తామని న్యాయమూర్తి పిటిషనర్‌కు ప్రతిపాదన చేశారు. అయితే కోర్టుకు వచ్చిన పిటిషనర్లను వారి భూముల నుంచి ఖాళీ చేయించరాదని న్యాయమూర్తి మధ్యంతర ఆదేశాల్లో పేర్కొన్నారు. పర్యావరణ క్లియరెన్స్‌లు రాకుండానే టెండర్ నోటిఫికేషన్ చట్ట వ్యతిరేకమంటూ వేములఘాట్ నివాసి జి.లక్ష్మి, ఇతరులు వేసిన వ్యాజ్యం గురువారం విచారణకు వచ్చింది. కాళేశ్వరం భారీ ఎత్తున నిర్మాణం చేయబోయే ఈ ప్రాజెక్టు కోసం 17వేల ఎకరాల భూమిని సేకరణ జరుగుతున్నదని, అతి చిన్న సమస్యతో పిటిషనర్లు కోర్టుకు వచ్చారని తెలంగాణ అడ్వకేట్ జనరల్ డి.ప్రకాష్‌రెడ్డి వాదించారు. పిటిషనర్లకు అవసరమైన నష్టపరిహారం చట్ట ప్రకారం చెల్లిస్తామని, బహుళ ప్రయోజనాల్ని గమనంలోకి తీసుకుని ప్రాజెక్టు నిర్మాణానికి అవరోధం లేకుండా చేయాల్సిన అవసరముందని ఆయన హైకోర్టును కోరారు

ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు కేంద్రం కుట్ర

ఎస్‌సిఆర్ఎంయూ సభలో ఏఐఆర్ఎఫ్ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ఒక్కొక్కటిగా ప్రయివేటు పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలో భాగంగా ఇప్పటికే ఎయిర్ ఇండియాను అమ్మకానికి పెట్టి ఇప్పుడేమో రైల్వే వ్యవస్థను భ్రష్టుపట్టించి కార్పొరేట్ సంస్థలకు కట్టుబెట్టేందుకు కుట్రలు సాగిస్తోందని ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శివగోపాల్ మిశ్రా అన్నారు. కేంద్రం తీసుకుంటున్న చర్యలను ఉద్యోగులు, కార్మికులు సంఘటితంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. రైల్వే శాఖను ఒకవేళ ప్రయివేటు పరం చేయడానికి ప్రయత్నిస్తే ఆల్ ఇండియా రైల్వే ఫెడరేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సమ్మెద్వారా రైల్వేను స్థంభింపచేస్తామని కేంద్రాన్ని హెచ్చరించారు. దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ 47వ వార్షిక సర్వసభ్య సమావేశం గురువారం సికింద్రాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ రైల్వేశాఖలో అనేక ఏండ్లుగా ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని రైల్వే ఫెడరేషన్ రైల్వే బోర్డు దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు. ఏడవ వేతన సవరణతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. యూనియన్లు అందజేసిన విధంగా అలెన్సులు అందజేయాలని లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల నుండి తీవ్రమైన ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని మిశ్రా హెచ్చరించారు. రైల్వే శాఖలో విధినిర్వహణలో ఉన్న ఎంతో మంది కార్మికులు ప్రాణత్యాగాలు చేశారని, వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని శివగోపాల్ మిశ్రా అన్నారు. సేఫ్టీ కేటగిరీలో పనిచేసే వారికి కూడా ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. మజ్దూర్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను కేంద్రం వెంటనే భర్తీ చేసి నిరుద్యోగులకు అవకాశం కల్పించాలన్నారు.రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు ఎన్.వి.రమణారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యానికి తెలియజేస్తూ వారి సమస్యల పరిష్కారానికి దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఎంతో కృషి చేస్తోందన్నారు. హైదరాబాద్ డిఆర్ఎం అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ రైల్వే శాఖలో పినిచేస్తున్న కార్మికుల పిల్లల కోసం జాబ్‌మేళా, ఉద్యోగుల కోసం పాస్‌పోర్టు మేళాను ఏర్పాటు చేయడంలో మజ్దూర్ యూనియన్ ఎంతో కృషి చేసిందన్నారు.

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఉద్యోగుల భాగస్వామ్యంతో దక్షిణ మధ్య రైల్వే ఎంతో పురోగతి సాధించిందన్నారు. అంతకు ముందు మజ్దూర్ యూనియన్ సెంట్రల్ ఆఫీస్‌లో యువజన విభాగం మజ్దూర్ యూనియన్ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా ప్రొఫెసర్ నాగేశ్వర్ హాజరై మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువకుల ముందు అనేక సవాళ్లు ఉన్నాయన్నారు. ఈ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు యువకులు తమ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలో రైల్ నిలయం ఆడిటోరియంలో మహిళా ఉద్యోగుల సదస్సు జరిగింది. ప్రధాన వక్తగా ప్రొఫెసర్ లక్ష్మి హాజరై మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు అనేక అసమానతలకు గురవుతున్నారన్నారు.

నేరెళ్ల ఘటనపై సమిష్టి ఉద్యమం

కాంగ్రెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

- **నేడు డీజీపీకి అఖిలపక్షం ఫిర్యాదు**
- **15న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన**
- **22,23 తేదీల్లో రాష్ట్రపతికి ఫిర్యాదు**



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నేరెళ్ల ఘటనపై సమైక్య ఉద్యమం చేయాలని రౌండ్‌టేబుల్‌లో వక్తలు అభిప్రాయపడ్డారు. బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ నేడు అఖిలపక్షం తరపున డీజీపీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షులు, మాజీ విప్ ఆరేపల్లి మోహన్ నేతృత్వంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. 15న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలపాలని, 22, 23 తేదీల్లో రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామన్నారు. సిరిసిల్ల ఘటనపై కాంగ్రెస్ పార్టీ ఎంతో పోరాటం చేసి బాధితులకు న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తోందని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

బాధితుల పరిస్థితి చూసి.మీరా కుమార్ కంట తడిపెడితే ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు హేళన చేశారన్నారు. ఇలాంటి సంఘటనల పట్ల అన్ని పార్టీలు ఏకమై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

ఏకతాటిపై రావాలి : కోదండరామ్

అట్టడుగు వర్గాల మీద జరిగిన దాడులను ఖండించడానికి అన్ని పార్టీలు, సంఘాలు ఏకతాటిపైకి రావాలని టీజేఏసీ చైర్మెన్ కోదండరామ్ కోరారు. దళితుల పట్ల ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహ రిస్తోందని సీపీఐ నేత బాలమల్లేష్ అన్నారు ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావుపాలన నిజాం నిరంకుశ పాలనను మించిన పాలన కొనసాగిస్తున్నారని టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు చెప్పారు.నేరెళ్ల ఘటనపై కేటీఆర్ అహంకార పూరిత ధోరణితో మాట్లాడుతున్నారని టీటీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షులు రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కులవివక్ష భయంకరంగా ఉందని టీపీసీసీ కార్యనిర్వహక అధ్యక్షులు మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బాంఛన్ దొర అన్నా వదలకుండా దళితులు, బీసీలను కొట్టారన్నారు. సొంత నియోజకవర్గంలో ఏం జరుగుతుందో తెలుసుకునే సోయి కేటీఆర్‌కు లేదని విమర్శించారు.ప్రభుత్వ అండతో ఇసుక వ్యాపారాన్ని నిర్వహించడం సరైందికాదని బీజేపీ సీనియర్ నేత చింత సాంబమూర్తి అన్నారు.

బదిలీల్లో వితంతువులకు అవకాశమివ్వాలి

సీఎస్‌కు టీఎన్జీవో వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అంతర్రాష్ట్ర బదిలీల ప్రక్రియలో వితంతువులకు అవకాశం కల్పించాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్జీవో) కేంద్ర సంఘం డిమాండ్ చేసింది. జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి పోస్టుల్లో పనిచేస్తున్న ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీలు చేపట్టాలన్న రెండు రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయం హర్షం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను గురువారం సచివాలయంలో టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేందర్ కలిసి వినతిపత్రం సమర్పించారు.

కస్టమ్ మిల్లింగ్ రైస్ సేకరణ గడువు ఈ నెల 31 :సీవీ ఆనంద్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ నెల 31వ తేదీలోగా మిల్లర్ల నుండి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను సేకరించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 9వ తేదీ నాటికి మిల్లర్లు 54 శాతం బియ్యాన్ని అప్పగించారని, మిగిలిన 46 శాతం బియ్యాన్ని గడువులోగా అప్పగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బియ్యం సేకరణ, ఈ పాస్ విధానం, దీపం, తదితర అంశాలపై గురువారంనాడు కమిషనర్‌గారు జాయింట్ కలెక్టర్లు, డీసీఎస్‌ఓలు, జిల్లా మేనేజర్లు, ఎఫ్‌సీఐ, రైస్ మిల్లర్లు, ఎన్ఐసీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గత ఖరీఫ్‌లో జగిత్యాలలో ఒక రైస్‌మిల్ మినహా 99.94 శాతం బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి గడువులోగా అప్పగించారని, ఈ రబీలో కూడా అదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు.

అభివృద్ధి పేరుతో అన్యాయం చేయొద్దు

రాంకీ భూ కొనుగోళ్లపై విచారణ జరిపించాలి: రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అభివృద్ధి పేరుతో నిర్వాసితులకు అన్యాయం చేయొద్దని పలువురు వక్తలు ప్రభుత్వానికి హితవు పలికారు. బలవంతపు భూసేకరణ ఆపాలని, భూనిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిర్వాసితుల పోరాట కమిటీ, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి టి. సాగర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు నియోజకవర్గంలోని రైతులకు ఒక విధంగాను, ఇతర నియోజకవర్గంలోని రైతులకు మరో విధంగా నష్టపరిహారం ఇవ్వడం న్యాయం కాదన్నారు. భూములు కోల్పోయిన రైతాంగం మొత్తానికి మార్కెట్ విలువ కంటే మూడింతలు అదనంగా కలిపి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

నేరెళ్లలో 44 ప్రమాదాలు జరిగితే సంబంధిత నియోజకవర్గ మంత్రికి తెలియకుండా ఎలా ఉంటుందని ప్రశ్నించారు. తక్షణమే ఆ జిల్లా ఎస్పీని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. రాంకీ సంస్థ రైతుల నుంచి లాక్కున్న భూములపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని కోరారు. సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేశ్ మాట్లాడుతూ 2013 చట్టం ప్రకారం భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. అధికారంలోకి రాకముందు రాంకీ సంస్థ అంతు చూస్తానన్న కేసీఆర్ అధికారంలోకి వచ్చినంక ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొంతల చంద్రారెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేసేటప్పుడు రైతులకు భూములు ఇస్తామని సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. తెలంగాణ గిరిజన సంఘం కార్యదర్శి ధర్మానాయక్ మాట్లాడుతూ నిర్వాసితులకు నష్టపరిహారం 2017 చట్టం ప్రకారం చెల్లించడం సరైందికాదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. ప్రసాద్ మాట్లాడుతూ పట్టా భూములతో పాటు అసైన్డ్ భూములకు కూడా సమాన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా యాచారం, ఆమనగల్లు, కందుకూరు మండలాల్లో ఫార్మాకంపెనీ పేరుతో భూములు లాక్కుంటున్నారని చెప్పారు.



సివిల్ ఇంజినీరింగ్‌తో జీవన విధానం మెరుగు

- **హోలిమేరి కాలేజీ సదస్సులో లాల్జీసింగ్**

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జీవన విధానం మెరుగుకావడానికి సివిల్ ఇంజినీరింగ్ ఎంతో దోహదపడుతుందని సీసీఎంబీ మాజీ డైరెక్టర్ లాల్జీసింగ్ అన్నారు. బోగారంలోని హోలిమేరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీలో రెండురోజులపాటు జరిగే అంతర్జాతీయ సదస్సును ఆయన గురువారం ప్రారంభించారు. రోజురోజుకీ సివిల్ ఇంజినీరింగ్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. పర్యావరణ ఇబ్బందులూ తలెత్తుతున్నాయని అన్నారు. మారుతున్న పరిస్థితులను గమనిస్తూ ఎప్పటికప్పుడు సృజనాత్మకతతో ముందడుగు వేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. మానవ శరీర నిర్మాణం, దాని ఆకృతి, పనిచేసే తీరు ఎంతో ఆసక్తి కలిగిస్తుందని చెప్పారు. శరీరంలో కాళ్లకు పటిష్టత ఎంత అవసరమో, భవనాలు, ఇతర నిర్మాణాలకు స్ట్రక్చరల్ విధానం అంతే అవసరమని అన్నారు. మెరుగైన పద్ధతుల ద్వారా ప్రజలకు రక్షిత మంచినీరు అందించాల్సిన అవసరముందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథి డాక్టర్ సుబ్రమణ్య, హోలిమేరి కాలేజీ చైర్మెన్ ఎ వరప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి ఎ విజయశారదరెడ్డి, వైస్ చైర్మెన్ సిద్ధార్థరెడ్డి, ప్రిన్సిపాల్ సుభాష్‌చంద్ర, సదస్సు కన్వీనర్ ఎంఎస్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త జిల్లాలా.. పాత జిల్లాలా..!

- **డీఎస్సీ నిర్వహణపై సర్కారు తర్జనభర్జన**

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకంపై తెలంగాణ సర్కార్ స్పష్టత ఇవ్వడం లేదు. కొత్త జిల్లాల ప్రకారం నోటిఫికేషన్ ఇవ్వాలా..? లేక పాత జిల్లాల ప్రకారమా..? అనేది ఇంకా తేల్చడం లేదు. ప్రభుత్వ పెద్దలు ఒకసారి కొత్త జిల్లాలనీ, మరోసారి పాత జిల్లాలనీ ప్రకటనలు చేస్తుండటంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు ఇప్పటికీ ఏ జిల్లాలో ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయనే దానిపై ప్రభుత్వం గానీ, విద్యాశాఖ స్పష్టత ఇవ్వలేదు. టెట్ ఫలితాల రోజే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చెప్పిన ప్రభుత్వం, ఆ మాటను నిలబెట్టుకోలేదు. నోటిఫికేషన్ ఎప్పుడు విడుదల చేస్తారనే దానిపై ఇప్పటికీ అధికారిక ప్రకటనా చేయలేదు. కొత్త జిల్లాల ప్రకారం డీఎస్సీ నిర్వహిస్తే చాలా జిల్లాల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు రెండంకెల్లోనే ఉంటాయని, కొన్ని సబ్జెక్టులకు పోస్టులు కూడా ఉండవని అధికారులు చెబుతున్నారు. 'ఉమ్మడి జిల్లాల ప్రకారమే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని' డిప్యూటీసీఎం కడియం శ్రీహరి వరంగల్ పర్యటనలో ప్రకటించారు. 31 జిల్లాలకు సంబంధించిన గెజిట్ విడుదల అయిన తర్వాత పాత జిల్లాల ప్రకారం భర్తీ చేస్తే కూడా న్యాయపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఉమ్మడిజిల్లాల ప్రకారం డీఎస్సీ నిర్వహిస్తే, అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఎవరి ద్వారా అందించాలనే దానిపై అధికారులు అయోమయానికి గురవుతున్నారు. సెప్టెంబర్ 11న ఈ కేసుపై న్యాయస్థానం విచారించనున్నది. ఆ లోపు నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

- **అధునాతన హై అండ్ మిషనరీ ఏర్పాటు హర్షనీయం: ఐసీయూలో 65 పడకల ప్రారంభోత్సవంలో గవర్నర్ నరసింహన్**

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఒకట్రెండేండ్లలో రాష్ట్రం ఆరోగ్య తెలంగాణగా మారే అవకాశం ఉందని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ఆశాభావం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానాలోని ఎమర్జెన్సీ బ్లాక్‌లో 65 పడకల అత్యాధునిక ఇంటెన్సివ్ కేర్ యూనిట్, పౌర సమాజ సమాచార యంత్రం, డిజిటల్ రేడియోగ్రఫీ, సిటీ స్కాన్, సెంట్రల్ డయాగ్నసిస్ ల్యాబరేటరీని గురువారం ఆయన ప్రారంభించారు. ఒక్కో పరికరం, దాని వినియోగం, దాని విలువ వంటి అనేక అంశాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'నేను కూడా గాంధీలో చికిత్స తీసుకున్నాను. తీసుకుంటాను కూడా. తెలంగాణ వచ్చిన మొదట్లో ఆస్పత్రి అధ్వాన్నంగా ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారింది. అన్ని సదుపాయాలూ అందుబాటులోకి వచ్చాయి' అని అన్నారు. ఐసీయూలో అధునాతన సాంకేతిక హై ఎండ్ మెషనరీ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. వైద్యుల మీద బాధ్యత పెరిగిందని, నెల నెలా సమీక్షలు నిర్వహించాలని సూచించారు. అనంతరం వైద్యఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గవర్నర్, ముఖ్యమంత్రి సూచనలు, అందరి సహకారంతో గాంధీ ఆస్పత్రిని తీర్చిదిద్దామని, మంచి సదుపాయాలు అందుబాటులోకి తెచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వాస్పత్రుల్లో ఓపీ, ఐపీ పెరిగిందని చెప్పారు. కార్యక్రమంలో టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ పర్యాద కృష్ణమూర్తి, మేయర్ బొంతు రామ్మోహన్, శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజేశ్వర్ తివారీ, ఎండీ వేణుగోపాల్, సీఈ లక్ష్మణ్‌రెడ్డి, డీఎంఈ డాక్టర్ రమేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల, సూపరింటెండెంట్ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టడం తగదు

ఉ.కొరియా వివాదాన్ని మరింత రెచ్చగొడుతున్నారు : ట్రంప్ తీరుపై మండిపడిన సెనెటర్ బెర్నీ సాండర్స్

- అణు యుద్ధంతో లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతారని ఆందోళన
- చైనా, ఇతర మిత్ర దేశాలతో దౌత్య వ్యూహం రచించాలని సూచన



వాషింగ్టన్ : ఉ.కొరియా వివాదంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని సెనెటర్ బెర్నీ సాండర్స్ తీవ్రంగా తప్పుబట్టారు. ట్రంప్ తన మాటలతో కయ్యానికి కాలుదువ్వే తీరు ఎంతో ప్రమాదకరమైనదని ఆయన హెచ్చరించారు. దీనివల్ల లక్షలాది ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశముందని సాండర్స్ ఆందోళన వ్యక్తం చేశారు. ఒక సమగ్రమైన దౌత్య విధానంతో ముందుకెళ్లాల్సింది పోయి, మాటలతో ఉద్రిక్తతను తీసుకొస్తున్నారని ఆయన విమర్శించారు. ఉ.కొరియా వివాదం దౌత్యమార్గంలో, చర్చల ప్రక్రియ ద్వారా పరిష్కరించుకోవచ్చునని ఆయన చెప్పారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...


ట్విట్టర్ వేదికగా ట్రంప్ విడుదల చేస్తున్న సందేశాలు, ప్రకటనలు ఆయన్ని బాగా పాపులర్ చేస్తున్నదేమో కానీ, కీలకమైన అంశాలకు కూడా ఇలా ట్విట్టర్ ద్వారా మాట్లాడటం సరైంది కాదు. ఉ.కొరియా వివాదంపై అనేకమార్లు ట్రంప్ తీవ్రమైన మాటలతో సందేశాలు పంపారు. విపరీతమైన ఆగ్రహంతో కూడిన పదజాలంతో ట్రంప్ మాటలు వివాదాన్ని మరింత రెచ్చగొడుతున్నది. అణుబాంబులు ఆధునీకరించాం, సిద్ధంగా ఉంచాం, వేస్తే మస్సై పోతావ్...వంటి మాటల్ని ట్రంప్ అన్నారు. ప్యాంగ్యాంగ్ నాయకత్వానికి హెచ్చరికలు జారీ చేశారు. ఇలాంటి ధోరణితో వివాదాన్ని అణు యుద్ధం దిశగా ట్రంప్ నడిపిస్తున్నారు. చివరికి దీని ఫలితం...లక్షలాది మంది ప్రాణాలు కోల్పోవటమే. తీవ్రమైన నష్టాన్ని చేకూర్చే ఇలాంటి విధానం సరైంది కాదు. ఉ.కొరియా వివాదాన్ని పరిష్కరించటం కోసం అమెరికా విదేశాంగ శాఖకు సమర్థులైన వ్యక్తులు అవసరం. ఉ.కొరియా అణు కార్యక్రమాన్ని అడ్డుకునే వ్యూహాన్ని ఎంచుకోవాలి. చైనాతో కలిసి పనిచేయాలి. కలిసి ముందుకు అడుగేయాలి. అలాగే ఆసియాలోని అమెరికా మిత్ర దేశాలతో కలిసి సమగ్రమైన దౌత్య విధానాన్ని రచించాలి. తద్వారా ఉ.కొరియా వివాదాన్ని పరిష్కరించాలి.

ఆగ్రహంతో ఊగిపోతున్న ట్రంప్ !



అమెరికా మాపై దాడి చేస్తే...వారి గువాం సైనిక స్థావరంపై దాడిచేస్తామని ఉ.కొరియా హెచ్చరించిన కొద్ది గంటల్లోనే ట్రంప్ తీవ్ర ఆగ్రహంతో ఊగిపో యారు. అణు బాంబు వేస్తామని పరోక్షంగా హెచ్చరించారు. ఇకపై అమెరికాకు హెచ్చరిక చేయడానికే భయపడే విధంగా, ఉ.కొరియాను దెబ్బతీస్తాం. ప్రపంచం ఇంతకు ముందు చూడని స్థాయిలో అమెరికా మిలటరీ చర్య ఉంటుందని ట్రంప్ హెచ్చరించారు. "అమెరికా అణు ఆయుధశాలను పునరుద్ధరించి.. ఆధునీకరణ చేయాలని అధ్యక్షుడిగా నేను ఇచ్చిన తొలి ఆర్డర్ అది. ఇప్పుడు అమెరికా ఆయుధాగారం గతంలో కంటే మరింత శక్తిమంతమైనదిగా తయారైంది. ఈ అధికారాన్ని ఉపయోగించాలని అనుకోవడం లేదు. అది ఉపయోగించాల్సిన సమయం రాకూడదనే కోరుకుంటున్నా" అని ట్రంప్ హెచ్చరించారు.

గువాం ఎక్కడుంది ?



- పసిఫిక్ మహాసముద్రంలో ఫిలిప్పైన్స్, హవాయి మధ్య ఉన్న చిన్న దీవి 'గువాం'. దీని వైశాల్యం **541** చదరపు కిలోమీటర్లు. అమెరికా ఆధీనంలో ఉన్న ఈ దీవిలో లక్షా **63** వేలమంది ప్రజలున్నారు. గువాంలో పుట్టినవారంతా అమెరికా పౌరులేనన్నది లెక్క.
- గువాం దీవిలోని నాలుగోవంతు భూభాగాన్ని తన సైనిక స్థావరంగా అమెరికా మార్చుకుంది. ప్రస్తుతం ఇక్కడ **6** వేలమంది అమెరికా సైనికులున్నారు.
- రెండో ప్రపంచ యుద్ధం సమయంలో గువాం సైనిక స్థావరం అమెరికాకు పెద్ద దన్నుగా నిలబడింది. దక్షిణ చైనా సముద్ర జలాల్లోకి, కొరియా సముద్ర జలాల్లోకి తమ యుద్ధ విమానాల్ని పంపాలంటే అమెరికాకు 'గువాం' చాలా కీలకమైన స్థావరం.
- కానీ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మాత్రం ఓటేసే హక్కు గువాం పౌరులకు లేదు. ఇక్కడి ప్రజలు ఒక గవర్నర్‌ను, ఒక ఎంపీ(ప్రతినిధుల సభకు)ని ఎన్నుకుంటారు.

అమెజాన్‌పై ట్రాన్స్‌జెండర్ కేసు



కెంటకి: ప్రముఖ ఈ-కామర్స్ సంస్థ అమెజాన్‌పై ఓ ట్రాన్స్‌జెండర్ మహిళ కేసు వేసింది. తనను, తన భర్తను మానసికంగా వేధించటంతోపాటు, తమపై హత్యాయత్నం చేశారంటూ ఆమె ఆరోపణలు చేసింది. కెంటకిలోని వేర్‌హౌజ్ రిటైలర్‌లో అలెగ్రా ష్కావే లేన్, ఆమె భర్త డేన్ లేన్‌లు పని చేసేవారు. ఆ సమయంలో సహోద్యోగులు తమపై లింగ వివక్ష చూపేవారని ఆ జంట తెలిపింది.తమ లైంగిక జీవితంపై తరచూ కామెంట్లు చేస్తూ వేధించేవారన్నారు. ఈ విషయాన్ని స్టోర్ సూపర్‌వైజర్ దృష్టికి తీసుకెళ్లగా అతను కూడా ఉద్యోగులతో జత కలిసి తమను మానసికంగా క్షోభకు గురి చేశారని వాపోయారు. వారిద్దరిపై ఓ కన్నేసి ఉంచండంటూ తమ ముందే తోటివారితో చెబుతుండేవారని, ఒకసారి కారు బ్రేక్‌లు తీసేసి తమను చంపే యత్నం కూడా చేశారని పేర్కొన్నారు.అమెజాన్‌పై ఇలాంటి ఆరోపణలు రావటంపై పలువురు మండిపడుతున్నారు. గతంలో ఫెడరల్ కోర్టులు ఇలాంటి కేసులను తీవ్రంగా పరిగణించాయని, లింగ వివక్షకు పాల్పడిన సూపర్‌వైజర్‌తోపాటు కంపెనీపైనా చర్యలు తప్పవని అలెగ్రా తరఫు న్యాయవాది జిల్లియన్ వెయిస్స్ చెబుతున్నారు. కాగా, ఈ వ్యవహారంపై స్పందించేందుకు అమెజాన్ విముఖత వ్యక్తం చేసింది.

అతడు చేసిన నేరానికి 12,000 సంవత్సరాల జైలు!

కౌలాలంపూర్ : మలేషియాలో ఓ వ్యక్తిపై 600కు పైగా లైంగిక వేధింపుల ఆరోపణలు నమోదయ్యాయి. అతడు చేసిన నేరానికి దాదాపు 12 వేల సంవత్సరాల జైలు పడనున్నట్టు న్యాయవర్గాలు చెబుతున్నాయి. ఇన్ని నేరాలు చేసింది కూడా అతడు ఒకరిపైనే. అది కూడా సభ్య సమాజం తలదించుకునేలా కన్న కూతురుపైన. దర్యాప్తు అధికారులు నమోదు చేసిన 626 ఆరోపణలతో కూడిన ఈ మొత్తం చార్జీ షీట్లను కోర్టులో చదివేందుకు రెండు రోజుల సమయం పట్టింది. వివరాల్లోకి వెళితే.. మలేషియాకు చెందిన 36 ఏండ్ల వ్యక్తి తన భార్యతో విడాకులు తీసుకున్నాడు. అతడి వద్ద 15 ఏళ్ల కూతురు ఉంది.ఆమెపై అతడు లైంగిక వికృతక్రీడలు సాగించాడు. చెప్పవీలుకాని విధంగా ప్రవర్తించాడు. చాలా కాలంగా సాగిన అతడి రాక్షస క్రీడ చివరకు వెలుగులోకి చూడటంతో అరెస్టు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా విస్తుపోయే విషయాలు తెలిశాయి. దీంతో అతడిపై మొత్తం 626 చార్జీ షీట్లు ఫైల్ చేశారు.

రాణా

అలా చేస్తే జనం కూడా చూడరు



'రెగ్యులర్ కమర్షియల్ సినిమాల్లోలాగా నేను డాన్స్ చేయను. అవి చేసేందుకు చాలా మంది ఉన్నారు. నేను కూడా అదే చేస్తే ప్రేక్షకులు చూడరు. నేను యాక్టర్ అయ్యిందే కొత్త కాన్సెప్ట్ సినిమాలు చేయడానికి' అని అంటున్నారు కథానాయకుడు రానా. తేజ దర్శకత్వంలో రానా, కాజల్, కేథరిన్ నాయకానాయికలుగా తెరకెక్కిన చిత్రం 'నేనే రాజు నేనే మంత్రి'. నేడు (శుక్రవారం) ఈ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో గురువారం రానా మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాల సమాహారం ఆయన మాటల్లోనే..

ఆర్ట్ ఫిల్మ్ తరహాలో..

ఈ చిత్రం కమర్షియల్ సినిమా కంటే ఎక్కువగా ఉంటుంది. ఆర్ట్ ఫిల్మ్ తరహాలో ఉంటుంది. అలాగని కమర్షియల్ అంశాలు లేవని కాదు. అన్నింటి కలబోతగా ఉంటుంది. ఇది చూడ్డానికి పొలిటికల్ థ్రిల్లర్‌లా కనిపించినా సినిమా సోల్ మాత్రం రాధా, జోగేంద్రల మధ్య ప్రేమే ఉంటుంది. రాధా పాత్ర ప్రధానంగా సినిమా సాగుతుంది. అనంతపురం, కర్నూలు వంటి ప్రాంతంలో వడ్డీ వ్యాపారం చేసుకునే వ్యక్తి అనుకోని పరిస్థితుల్లో కసితో, కోపంతో ఏదో చేసేద్దామని రాజకీయాల్లోకి వెళితే ఏం జరిగింది?, రాజకీయాలు తెలియకపోవడంతో అతను చేసే తప్పులేంటి అనేదే సినిమా. సినిమా, పాత్రలు చాలా రియలిస్టిక్‌గా ఉంటాయి.

సినిమా ఆరేండ్ల వ్యవధిలో జరుగుతుంది. ఆ వ్యవధికి తగ్గట్టుగా జోగేంద్ర పాత్రలో వచ్చే మార్పులకు అనుగుణంగా బరువు ఎక్కువగా, ఆ తర్వాత సన్నగా, మజిల్స్ తగ్గించడం జరిగింది. మేం ట్రై చేసిన కొత్త ప్రయత్నమిది. ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ఆశిస్తున్నాను. దర్శకుడు తేజకు ముందు సక్సెస్‌లు లేవు. నేను ప్రీవియస్ ట్రాక్ రికార్డ్ చూడను. కథ నచ్చిందా లేదా అన్నదే చూస్తాను. ఈ కథ తేజగారు రాయడానికి కారణం.. దీనికి సంబంధించి ఆయన వ్యక్తిగత జీవితంలో పెద్ద జర్నీ ఉంది.

కోలీవుడ్‌కి బాగా కనెక్ట్ అవుతుంది..

ఈ చిత్రాన్ని తెలుగుతోపాటు తమిళంలో కూడా విడుదల చేస్తున్నాం. ఈ కథ తమిళ రాజకీయాలను బాగా రిప్రజెంట్ చేస్తుంది. అంతేకాదు అక్కడివాళ్ళకి ఇది బాగా కనెక్ట్ అవుతుంది. వారికి ఇంకా బాగా కనెక్ట్ అవ్వడానికి ఓ సీన్‌లో హోటల్‌కి బదులు రిసార్ట్ అని డబ్బింగ్‌లో చెప్పాం. రిసార్ట్ అనేది వారికి ఈజీగా కనెక్ట్ అవుతుంది.

సక్సెస్ రేషియో 5 శాతం మాత్రమే..

'బాహుబలి2' తర్వాత నాకు మార్కెట్ పెరగడంతో బాగా కలిసొచ్చింది. ఈ సినిమాకి బడ్జెట్‌పరంగా నాన్న సురేష్‌బాబు గారే గైడ్. సినిమాను తక్కువ బడ్జెట్‌లో రిచ్‌గా తీయడమనేది ఆయనకే సాధ్యం. బిజినెస్ కంప్లీట్ ఫైనాన్షియల్‌గా విడుదలకు ముందే ఈ సినిమా లాభాల్లో ఉండటం ఓ పాజిటివ్ ఎనర్జీ. ఈ సినిమా విషయంలో అందరం చాలా హ్యాపీగా ఉన్నాం. ప్రపంచం మొత్తంగా ఇప్పుడున్న పరిస్థితుల్లో ఫిల్మ్ ఇండస్ట్రీ సక్సెస్ రేషియో 5 శాతం మాత్రమే ఉంది. మన లక్ ఏంటంటే ఇటీవల హిందీ, తమిళం, కన్నడ ఇలా అన్నీ ఇండస్ట్రీలు బార్డర్‌గా ఉన్నాయి. అవసరమైతే కిందకి వెళ్తున్నాయి. కాని ఒక లెవల్‌లో పెరిగే ఇండస్ట్రీ ఏదైనా ఉందంటే అది మన తెలుగు ఇండస్ట్రీనే. 'బాహుబలి' టైమ్‌లో మన ఇండస్ట్రీ సక్సెస్ రేషియో 15 శాతానికి కూడా వెళ్ళింది.

టెక్నాలజీ సినిమాని ఆడించలేదు..


మన సినిమా ఇండస్ట్రీ గ్రోత్ అవ్వడానికి కారణం కథలే. మంచి కథల వల్లే వరుసగా సక్సెస్‌లు వస్తున్నాయి. అంతేతప్ప ఇది టెక్నాలజీతోనే సాధ్యమైందన్నది వాస్తవం కాదు. టెక్నాలజీ వల్ల సినిమాలు ఆడవు. మంచి కథకు టెక్నాలజీ హెల్ప్ అవుతుందే తప్ప అంతిమంగా నవ్యమైన, బలమైన కథే ముఖ్యం. సినిమాకు ఆత్మ ఏదైనా ఉందంటే అది కథే. ఈ చిత్రాన్ని సొంత బ్యానర్‌లో చేయడం చాలా హ్యాపీగా ఉంది. మా నాన్న(సురేష్‌బాబు), బాబాయ్(వెంకటేష్) మెయిన్ స్ట్రీమ్‌లో ఉన్నారు. ఫస్ట్‌టైమ్ ఈ కథ నాకు, మా నాన్నకు, బాబాయ్ ముగ్గురికీ నచ్చడం సంతోషించదగ్గ విషయం.

పాత్రల నుంచి నేర్చుకుంటున్నా..

నా సినిమాలు రొటీన్‌కి భిన్నంగా ఉంటాయి. నేను చేసే ప్రతి సినిమా కొత్తగా, డిఫరెంట్‌గా ఉండాలని కోరుకుంటాను. రొటీన్‌గా చేసిందే చేస్తే నాకే బోర్ కొడుతుంది. నాలా భిన్నమైన సినిమాలు ఎవరూ చేయరు. 'బాహుబలి 2', 'ఘాజీ', ఇప్పుడు 'నేనే రాజు నేనే మంత్రి' ఈ మూడు సినిమాలు డిఫరెంట్ జోనర్స్‌లో ఉంటాయి. చేసే ప్రతి సినిమాలోని పాత్ర నుంచి నేనేదొక కొత్త అంశం నేర్చుకుంటాను. నెక్ట్స్ కూడా విభిన్నంగానే ఉంటూనే తెలుగు, తమిళ ప్రేక్షకులను కనెక్ట్ అయ్యేలా కాన్సన్‌ట్రేట్ చేస్తాను. కథపై ఎక్కువ హోంవర్క్ చేస్తాను. అందుకే నా సినిమాలు చాలా గ్యాప్‌తో వస్తుంటాయి. ప్రస్తుతం ఓ తమిళ దర్శకుడితో 1945లో జరిగే కథతో ఓ సినిమా అనుకుంటున్నాం. అలాగే హాలీవుడ్ చిత్రానికి సంబంధించి కూడా చర్చలు జరుగుతున్నాయి.

రియల్ హీరోలు

నవచిత్రం



షారూఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్

భారీ అంచనాలతో విడుదలైన సినిమాలు ప్రేక్షకుల నిరాదరణతో పరాజయం పాలైతే, సదరు చిత్రాలకు సంబంధించిన హీరోలు తమ రెమ్యూనరేషన్‌లో కొంత భాగాన్ని నష్టపోయిన నిర్మాతలకు, పంపిణీదారులకు ఇవ్వడమనేది తెలుగునాట తరచూ చూస్తూనే ఉన్నాం. ఇలాంటివి బాలీవుడ్‌లోనూ వింటూనే ఉన్నాం. తాజాగా ఇదే బాటలో బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ కూడా కొంత డబ్బు వెనక్కి ఇవ్వబోతున్నారు. కబీర్ ఖాన్ దర్శకత్వంలో ఆయన నటించిన 'ట్యూబ్‌లైట్' చిత్రం బాక్సాఫీసు వద్ద డీలా పడింది. ఈ చిత్రానికి సల్మానే నిర్మాత. సినిమా పరాజయం చెందడంతో ముందుగా చెప్పినట్టే డిస్ట్రిబ్యూటర్లకు 35 కోట్ల రూపాయల్ని సల్మాన్ తిరిగి ఇస్తున్నారు. ప్రస్తుతం 'టైగర్ జిందా హై' చిత్రీకరణ నిమిత్తం మొరాకోలో ఉన్న సల్మాన్ ఇండియాకి రాగానే ఆ డబ్బును డిస్ట్రిబ్యూటర్లకు ఇవ్వనున్నట్లు చిత్ర వర్గాలు వెల్లడించాయి. మరో విశేషమేంటంటే 'ట్యూబ్‌లైట్' చిత్రం వల్ల నష్టపోయిన డిస్ట్రిబ్యూటర్లే షారూఖ్ నటించిన 'జబ్ హ్యారీ మెట్ సెజల్' చిత్రం కారణంగా కూడా నష్టపోయారు. వీరికి కూడా షారూఖ్ డబ్బు తిరిగి ఇచ్చేయనున్నట్టు బాలీవుడ్ వర్గాలు తెలిపాయి.



జయ జానకి నాయక

మంచి ఫీల్‌గుడ్ సినిమా : బోయపాటి శ్రీను



నందు, ప్రగ్యాజైశ్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, బోయపాటి శ్రీను, బెల్లంకొండ సాయిశ్రీనివాస్, మిర్యాల రవీందర్‌రెడ్డి

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రగ్యా జైశ్వాల్ హీరో,హీరోయిన్లుగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ద్వారకా క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'జయ జానకి నాయక'. నేడు (శుక్రవారం) ఈ చిత్రం విడుదల కానున్న సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ సెవెన్ ఎకర్స్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ, "భద్ర' తర్వాత నేను చేసిన బ్యూటిఫుల్ లవ్‌స్టోరీ ఇది. మంచి ఫీల్‌గుడ్ చిత్రమవుతుంది. ప్రతి ఒక్క ఆడియెన్ హృదయాన్ని టచ్ చేసేలా ఉంటుంది. మంచి ఎమోషన్స్, యాక్షన్, లవ్‌స్టోరీ ఇలా అన్ని రకాల అంశాలుంటాయి. ఏ, బి, సి ఆడియెన్స్ ఒకే వరసలో కూర్చుని చూసేలా ఉంటుంది. ఎంత మంచి సినిమా చేయాలో అంత మంచి సినిమా చేశాం. మా ప్రయత్నాన్ని ఆదరించాలని కోరుకుంటున్నా. అల్లు అరవింద్ తర్వాత ఆ స్థాయిలో కంఫర్ట్ ఇచ్చే నిర్మాతల్లో మిర్యాల రవీందర్‌రెడ్డి ఒకరు. మంచి టేస్ట్ ఉన్న నిర్మాత' అని అన్నారు. 'రీ-రికార్డింగ్‌తో సినిమా చూసి చాలా ఎగ్జైట్ అయ్యాను. ఇంత మంచి సినిమాను నాకిచ్చిన బోయపాటికి థ్యాంక్స్. కొన్ని సినిమాలను చూసుకుని ఇది నా సినిమా అని గర్వంగా చెప్పుకుంటాం. కెరీర్ ప్రారంభంలోనే ఇది నా సినిమా అని జీవితాంతం చెప్పుకునేలా ఉంటుంది. ఇలాంటి సినిమాను రీచ్ కావడమే నా నెక్ట్స్ టార్గెట్. సినిమాను ఇంత గ్రాండ్‌గా తీసిన రవీందర్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఆయన చాలా గట్స్ ఉన్న నిర్మాత. జానకి క్యారెక్టర్‌ని చూసి రకుల్ తప్ప మరెవ్వరూ చేయలేరని అంటారు. ప్రగ్యా చాలా బాగా చేసింది. జగపతిబాబు, శరత్‌కుమార్ వంటి లెజెండ్స్‌తో పనిచేయడం ఆనందంగా ఉంది. సపోర్ట్ చేయాలని ప్రేక్షకులను కోరుకుంటున్నా' అని హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తెలిపారు.

రకుల్ ప్రీత్ సింగ్ చెబుతూ, 'ఈ చిత్రంలో నాకు జానకి క్యారెక్టర్ దొరకడం నా అదృష్టం. ఇంత పెద్ద ఎమోషన్ ఉన్న క్యారెక్టర్‌ను నేను చేయగలనని నమ్మి ఛాన్స్ ఇచ్చిన బోయపాటిగారికి ధన్యవాదాలు. సినిమా చూసిన అందరికీ సినిమాలో నా పాత్రలోని స్ట్రాంగ్ ఎమోషన్ బాగా కనెక్ట్ అవుతుంది. వీటితోపాటు ఇందులో ప్యూర్ లవ్‌స్టోరీ ఉంటుంది. నిజమైన లవ్, కేర్, ఎమోషన్ ఎలా ఉంటుందో బోయపాటిగారు ఈ చిత్రంలో చూపించారు' అని చెప్పారు. 'బోయపాటిగారు ఇప్పటి వరకు చేసిన సినిమాలన్నిటిలో ఇది ది బెస్ట్ ఫిల్మ్ అవుతుందని చెప్పగలను. సినిమాకు మంచి కథ కుదరడమే తొలి సక్సెస్. చిత్రంపై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. నేడు విడుదల కానున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరుతున్నా' అని నిర్మాత మిర్యాల రవీందర్‌రెడ్డి తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రగ్యా జైశ్వాల్, నటుడు నందు పాల్గొని సినిమాను ఆదరించాలని కోరారు.



మీ రాక మాకెంతో సంతోషం..

తనయుడు క్రాంత్ వివాహం సందర్భంగా రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి స్వయంగా చిరంజీవిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. నవ్యతో క్రాంత్ వివాహ మహోత్సవం నేడు (శుక్రవారం) శంషాబాద్‌లోని కె.ఎల్.టి.సి కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం గం.11.35నిమిషాలకు జరుగనుంది. ఈ వివాహ మహోత్సవానికి రాజకీయ అతిరథ మహారథులతోపాటు సినీ రంగానికి చెందిన పలువురు ప్రముఖులూ హాజరు కానున్నారు. చిరంజీవిని ఆహ్వానించిన వారిలో తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ కూడా ఉన్నారు.



'భూమి'లో అదితిరావు హైదరి, సంజయ్‌దత్

ఇల్లు ఎక్కడుంది నాన్నా..

సంజయ్ దత్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'భూమి'. ఒమంగ్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్ర ట్రైలర్ గురువారం విడుదలైంది. సంజయ్ దత్ కుమార్తె త్రిషాలా దత్ బర్త్‌డే సందర్భంగా ఈ ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ఓ అమ్మాయికి పుట్టినిల్లు, మెట్టినిల్లు ఉంటాయి. కానీ ఇల్లు ఎక్కడుంది నాన్నా' అని సంజయ్‌ని అదితి అడుగుతున్న డైలాగ్ ఈ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచింది. తండ్రీ కూతుళ్ల అనుబంధం నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో దత్‌కు కూతురి పాత్రలో అదితి రావ్ హైదరి నటించింది. ఈ ట్రైలర్‌కు విశేష స్పందన వస్తుంది. తండ్రీకూతుళ్లుగా సంజయ్, అదితిలా నటన మైండ్ బ్లోయింగ్‌గా ఉందని ప్రశంసిస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 22న విడుదల కానుంది.

అనుష్క శర్మ



రియలైజ్ అయ్యా..

'కెరీర్ మొదట్లో బబ్లీ రోల్స్ చేశాను. అలాంటి పాత్రల విషయంలో రియలైజ్ అయ్యాను. ఇకపై నటనకు స్కోప్ ఉన్న శక్తివంతమైన పాత్రలకే ప్రయారిటీ ఇస్తాను' అని అంటోంది అనుష్క శర్మ. 2008లో 'రబ్ నే బనా ది జోడి' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన అనుష్క ఆ తర్వాత 'బద్మాష్ కంపెనీ', 'బ్యాండ్ బాజా బారత్', 'జబ్ తక్ హై జాన్' వంటి చిత్రాల్లోని బబ్లీ రోల్స్‌తో ప్రేక్షకులను అలరించింది. ఈ మధ్య విడుదలైన 'సుల్తాన్', 'ఎన్‌హెచ్10', 'బాంబే వాల్వెట్', 'ఫిల్లౌరి' వంటి చిత్రాల్లో శక్తివంతమైన పాత్రలు పోషించి తన నటనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేసింది. తాజాగా షారూఖ్‌తో నటించిన 'జబ్ హ్యారీ మెట్ సెజల్' చిత్రం ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. ఈ సందర్భంగా అనుష్క మాట్లాడుతూ, 'మన గురించి మనం ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే అందులో చాలా వరకు శక్తివంతమైన నటనకు స్కోప్ ఉన్న పాత్రలు కనిపించాలి. అలాంటి సినిమాలు, పాత్రలు నాకు ఇప్పుడొస్తున్నాయి. అందుకు కారణం వ్యక్తిగా నేను మారడమే. బబ్లీ రోల్స్ విషయంలో నేను రియలైజ్ అయ్యాను. అవి ఎక్కువ చేయకూడదనిపించింది. అయితే ఈ మార్పును చూసి నా చుట్టూ ఉన్నవాళ్ళు మరోలా అర్థం చేసుకుని కన్‌ఫ్యూజన్‌లో తప్పుగా భావిస్తున్నారు. ఇది నాలో సడన్‌గా వచ్చిన మార్పు కాదు. అనుభవంతో సహజంగానే వచ్చిన మార్పు' అని తెలిపింది. అనుష్క ప్రస్తుతం 'పరి', సంజయ్‌దత్ బయోపిక్, ఆనంద్ ఎల్.రాయ్ దర్శకత్వంలో తెరకెక్కబోయే చిత్రంలోనూ నటిస్తోంది.



కట్టి తీరుతాం



నవతెలంగాణ-మెండోరా/ఆర్మూర్

రాష్ట్రంలో రైతుల శ్రేయస్సు కోసం సాగునీటి ప్రాజెక్టులు పెద్దఎత్తున నిర్మిస్తుంటే కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటోందని, తెలంగాణ అభివృద్ధిని ఓర్వలేకనే కేసులు పెడుతున్నదని సీఎం కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడబోమని, ప్రాజెక్టులు కట్టి తీరుతామని నొక్కి చెప్పారు. ప్రాజెక్టులను అడ్డుకోవడానికి ఇప్పటికే 96 కేసులు పెట్టారని, అయినప్పటికీ ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేసేదిశగా ముందుకెళ్తున్నామని చెప్పారు. జిల్లాలకు సాగు, తాగు నీరు తీసుకొచ్చి ప్రజా ప్రయోజనాలను నెరవేరుస్తామని హామీనిచ్చారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవ పథకంలో భాగంగా 1050 కోట్ల రూపాయలతో చేపడుతున్న పనులకు సీఎం కేసీఆర్ గురువారం శంకుస్థాపన చేశారు. పైలాన్ ఆవిష్కరించారు. తదనంతరం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ప్రాజెక్టులపై కొట్లాట తన ఒక్కడిదే కాదని, ప్రజలు కూడా కాంగ్రెస్‌ను ప్రశ్నించాలని కోరారు. కాంగ్రెస్, టీడీపీల పాలనలో 30ఏండ్లు కరెంటు కష్టాలు అనుభవించారని, స్వరాష్ట్రం సాధించుకున్నాక వాటిని అధిగమించామని తెలిపారు. అదేస్ఫూర్తితో శ్రీరాంసాగర్ ప్రాజెక్టును పునరుజ్జీవనంలో భాగంగా 12 నెలల్లో కాళేశ్వరం నీటితో నింపుతామని ధీమా వ్యక్తం చేశారు. మహారాష్ట్రలో కట్టిన ప్రాజెక్టుల వల్ల శ్రీరాంసాగర్‌కు ఒక్కచుక్క నీరు కూడా రావట్లేదని, ఇదే గోదావరిలో కాళేశ్వరం నుంచి 250 టీఎంసీల నీరు గంగ (బంగాళాఖాతం)లో కలిసిపోతోందని చెప్పారు. మేడిగడ్డ, సుందిళ్ల మీదుగా నిజాంసాగర్ నుంచి ఎస్సారెస్పీని 90 టీఎంసీల నీటితో నింపుతామన్నారు. ఏడాది పొడవునా 70 నుంచి 80 టీఎంసీల నీరు నిల్వ ఉండేవిధంగా చూస్తామన్నారు. 'మీ బిడ్డగా చేస్తున్న మోతె మొగ్గను నేను. తెలంగాణ సాధించిన తర్వాతనే ఇక్కడ అడుగుపెడతానని శపథం చేశా. మట్టిని ముడుపు కట్టి తిరిగి రాష్ట్రం సాధించాకే మోతెలో అడుగు పెట్టి ముడుపు విప్పాను. అదే ఉద్యమ స్ఫూర్తితో చెబుతున్నా వచ్చే ఆగస్టు నాటికి ప్రాజెక్టు పునరుజ్జీవనాన్ని పూర్తి చేస్తా' అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై 96 కేసులు వేశారని, కేవలం 20 రోజుల్లోనే 6 కేసులు పెట్టారని గుర్తుచేశారు. 'కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణానికి 4600 ఎకరాల భూసేకరణ చేయాలనుకున్నాం. ఇప్పటిదాకా 4500 ఎకరాల సేకరణ పూర్తయ్యింది. మిగతా వందెకరాలు కాంగ్రెస్ నాయకులది. అందుకే హైదరాబాద్ నుంచి పెద్ద నాయకులు ఫోన్ చేసి మరీ భూములివ్వొద్దని చెప్పారు. వారితో కోర్టులో కేసులు వేయించారు. అయినప్పటికీ పట్టుదలతో ప్రాజెక్టులు కట్టి తీరుతాం' అని సీఎం ఘంటాపథంగా చెప్పారు. ఈ పథకం పూర్తయి ఎస్సారెస్పీ పూర్తిగా నింపితే.. నిజామాబాద్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, నిర్మల్ నియోజకవర్గాల్లో లక్ష్మి కాలువ, సరస్వతి, సదరుమాట్ ఆయకట్టుతో పాటు జగిత్యాల, కరీంనగర్, వరంగల్, నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాలు సస్యశ్యామలమవుతాయని చెప్పారు. దీనిద్వారా అన్ని జిల్లాల రైతాంగానికి రెండు పంటలు పండుతాయని, 40 నుంచి 45 లక్షల ఎకరాలకు లబ్ది చేకూరుతుందని అన్నారు. 200 కిలోమీటర్ల మేర ఉన్న గోదావరి నది జీవధారగా మారనుందన్నారు. వరద కాలువ వరప్రదాయినిగా 44 గ్రామాలను సస్యశ్యామలం చేస్తుందన్నారు. తుపాకిగూడెం, మేడిగడ్డ తదితర బ్యారేజీలు కడతామని, తద్వారా బాల్కొండ, వేములవాడ, మెట్‌పల్లి, మానకొండూరులో చేపల పెంపకానికి కూడా సౌలభ్యంగా ఉంటుందని చెప్పారు. అయితే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తయినా ఇప్పటికీ స్టేజి 1, 2, 3లకు నీరు వచ్చే అవకాశం లేదన్నారు. భారీ నీటి పారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ..తెలంగాణ వస్తే ఏమొస్తదని అడిగిన వారికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునరుజ్జీవనం పథకమే సమాధానమన్నారు. ఒక్క ఊరూ మునగకుండా, ప్రజలకు ఎలాంటి నష్టం లేకుండా దీనికి రూపకల్పన చేసినట్టు వివరించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 12 నెలల్లో పూర్తి చేసి రైతుల రుణం తీర్చుకుంటామని చెప్పారు. సభకు ముందు కళాకారుల ఆటపాటలు ప్రేక్షకులను ఆకట్టుకు న్నాయి. ఈ బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్‌అలీ, మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, జోగురామన్న, నాయిని నర్సింహారెడ్డి, ఎంపీ కవిత, నిజామాబాద్ శాసన సభ్యులు బిగాల గణేష్‌గుప్తా, ఆయా జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మెన్లు, జిల్లా కలెక్టర్ యోగితారాణా, జేసీ రవిందర్‌రెడ్డి, ఆర్థిక శాఖ కార్యదర్శి రామకృష్ణ, సీపీ కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

ఆ పత్రం లేకుండా బీమా కల్పించొద్దు : సుప్రీంకోర్టు

- కాలుష్య రిపోర్టు ఉండాల్సిందే

న్యూఢిల్లీ: కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రం(పీయూసీ) లేకుండా వాహనాలకు బీమా సౌకర్యాన్ని పునరుద్ధరించొద్దంటూ ఇన్సూరెన్స్ కంపెనీలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఢిల్లీలోని ఇంధనం నింపే కేంద్రాలన్నిటిలోనూ పీయూసీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కేంద్ర రోడ్డురవాణా మంత్రిత్వశాఖను సుప్రీంకోర్టు ఆదేశించింది. అందుకు నాలుగు వారాల గడువు ఇచ్చింది. పర్యావరణ కాలుష్య నియంత్రణ సంస్థ సూచనలను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకున్నది. పర్యావరణవేత్త ఎంసి మెహతా వేసిన ప్రజప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా జస్టిస్ మదన్‌బీ లోకూర్ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది.

రాష్ట్రస్థాయిలో 40 స్వచ్ఛపాఠశాలలు

- ఎంపిక చేసిన విద్యాశాఖ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 40 పాఠశాలలను స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలకు పాఠశాల విద్యాశాఖ ఎంపిక చేసింది. ఎంహెచ్‌ఆర్డీ నిబంధనల మేరకు వివిధ సౌకర్యాలున్న ఆయా పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల వివరాలను, ఆ పాఠశాలల వీడియాలనూ కేంద్రానికి పంపనున్నారు. వీటిలో మూడు పాఠశాలలు కేంద్ర పురస్కారాలకు ఎంపిక చేయనున్నది. అయితే సెప్టెంబర్ 5లోగా రాష్ట్రస్థాయి స్వచ్ఛపురస్కారాలకు ఎంపికైన పాఠశాలలకు ప్రశంసాపత్రాలను అందించనున్నారు. ఖమ్మంలో ఆరు పాఠశాలలు, రంగారెడ్డిలో నాలుగు, యాదాద్రి, సంగారెడ్డి జిల్లాల్లో మూడు, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్లగొండ, సూర్యపేట జిల్లాల్లో 2 పాఠశాలలు, మంచిర్యాల, నిర్మల్, కొమురంభీం, జగిత్యాల, రాజన్న సిరిసిల్లా, వరంగల్ అర్బన్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, భద్రాద్రి, సిద్దిపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వికారాబాద్, హైదరాబాద్ తదితర జిల్లాల్లో ఒక్కో పాఠశాల చొప్పున ఎంపికయ్యాయి.

సీఎం సభలో వెల్లువెత్తిన నిరసనలు

నవతెలంగాణ-మెండోరా/కంఠేశ్వర్/ఆర్మూర్



పునరుజ్జీవ పథకానికి భారీ తరలివచ్చిన జనం నుంచి ఒక్కసారిగా నిరసనలు వెల్లువెత్తాయి. దీంతో సభా ప్రాంగణం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 'డబ్బులిస్తేనే డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇస్తామని స్థానిక నాయకులు బెదిరిస్తున్నారు' అని నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం పోచంపాడ్‌కు చెందిన విజయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. తన సమస్యను సీఎంకు దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆవేదనకు గురైన ఆమె సీఎం కేసీఆర్ భారీ కటౌట్‌పైకెక్కి నిరసన తెలిపింది. చివరకు ఆమెకు నచ్చజెప్పి కిందకు దించారు. అప్పటికీ ఎవరూ స్పందించకపోవడంతో ఏడుస్తూ సభా ప్రాంగణం నుంచి వెనుదిరిగింది. అలాగే దశాబ్దాల నుంచి కోరుతున్నా వంతెన నిర్మాణం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని నిర్మల్ జిల్లా కడెం మండలం గంగాపూర్ గ్రామ సర్పంచి భర్త చంద్రవాసు వాపోయాడు. సమస్యను పైవాళ్లకు చెప్పాలనుకున్నా ప్రజాప్రతినిధులు అడ్డుకున్నారని చెప్పాడు. అనంతరం ఒక్కసారిగా పరుగులు తీసి సీఎం కటౌట్ ఎక్కి ముఖ్యమంత్రి చిత్రపటానికి వినతిపత్రం అందజేశాడు. మాది నక్సల్ ప్రభావిత ప్రాంతమని, తమ గ్రామాన్ని ఎవరూ పట్టించుకోవటం లేదని గట్టిగా అరిచాడు. అనంతరం సీపీ కార్తికేయ ఘటనా స్థలానికి వచ్చి అతన్ని సముదాయించి కిందకు దింపారు. అనంతరం ప్లకార్డులతో కనిపించిన ఎన్ఎస్‌యూఐ కామారెడ్డి జిల్లా నాయకులపై టీఆర్ఎస్ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఎన్ఎస్‌యూఐ సభ్యుల ఫోన్లను లాక్కొని పరిగెత్తించారు. గుండాల్లాగా దాడికి ప్రయత్నించడాన్ని పలువురు ఖండించారు.

డీఎస్సీ అభ్యర్థులపై పోలీసుల జులుం

జిల్లాల ప్రకారం డీఎస్సీ నిర్వహించాలని కోరుతూ సీఎం కేసీఆర్ మాట్లాడుతుండగా డీఎస్సీ అభ్యర్థులు సభలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. గమనించిన పోలీసులు అక్కడికి చేరుకుని చేతిలో ఉన్న ప్లకార్డులను చించేశారు. వారిని సభలోంచి ఈడ్చుకెళ్లారు. ఐనప్పటికీ సుమారు 15 మంది అభ్యర్థులు డీఎస్సీ నిర్వహించాలంటూ నిరసనలు తెలపడంతో పోలీసులు లాఠీచార్జికి దిగారు.

బహిరంగ సభ నుంచి వెళ్తుండగా ఒకరు మృతి

వర్ని మండలం జాకోరా గ్రామ రైతులు సభ నుంచి తిరిగి వెళ్తుండగా అంకాపూర్ వద్ద వాహనం ఆపి నిల్చున్నారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ చక్రం ఊడిపోయి వారిపైకి దూసుకువచ్చింది. ఈ ప్రమాదంలో చందర్ మృతిచెందాడు. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. జిల్లా కేంద్ర ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి జిల్లా ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మృతిచెందిన కుటుంబానికి టీఆర్ఎస్ తరపున ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రకటించారు.

ఎస్ఎఫ్ఐ ఆందోళన

విద్యార్థిని ఆత్మహత్యకు నిరసనగా

- నారాయణ ప్రధాన కార్యాలయం భవనం అద్దాలు, కంప్యూటర్లు ధ్వంసం
- రాష్ట్ర వ్యాప్తంగా నారాయణ కళాశాల దిష్టిబొమ్మల దహనం



నవతెలంగాణ - గచ్చిబౌలి/ విలేకర్లు

నారాయణ కళాశాలలో విద్యార్థులు వరుసగా ఆత్మహత్య చేసుకుంటుంటే సర్కారుగానీ, యాజమాన్యంగానీ పట్టించుకోకపోవటాన్ని నిరసిస్తూ హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో గల నారాయణ విద్యాసంస్థల ప్రధాన కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం ధర్నా చేశారు. నాగోల్‌లోని నారాయణ క్యాంపస్‌లో విద్యార్థిని ఆత్మహత్యపై అడగ్గా యాజమాన్యం స్పందించకపోవటంతో విద్యార్థులు ఆగ్రహానికి లోనై భవనం అద్దాలను, కంప్యూటర్లను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి నరేష్, అధ్యక్షులు సంతోష్, నగర కార్యదర్శి జావేద్ మాట్లాడుతూ... విద్యార్థుల ఆత్మహత్యలు తరచూ నారాయణ కళాశాలల్లోనే జరుగుతున్నాయన్నారు. ఆ సంస్థ యాజమాన్యం అవలంబిస్తున్న విధానాల వల్లే విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. పలుమార్లు విద్యార్థి సంఘాలు హెచ్చరించినా అవే ఘటనలు పునరావృతమవుతున్నాయన్నారు. నారాయణ కళాశాలపై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మరలా నారాయణ కాలేజీలో ఇలాంటి ఘటనలు జరిగితే రాష్ట్రంలో ఆ విద్యాసంస్థను నడవనివ్వబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సతీష్ పాల్గొన్నారు.

జిల్లాల్లో ఆందోళనలు...

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నారాయణ విద్యా సంస్థల యాజమాన్య దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గజ్జెల శ్రీకాంత్, సంపత్, తదితరులు పాల్గొన్నారు. నిజామాబాద్ నగరంలోని ఎన్‌టీఆర్ చౌరస్తా వద్ద నారాయణ, శ్రీచైతన్య, గాయత్రీ, కార్పొరేట్ విద్యాసంస్థల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. పెద్దపల్లిలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బత్తిని సంతోష్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. మెదక్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బస్వరాజ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బస్వరాజ్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి రూ. 30లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో కొత్త బస్టాండ్ సమీపంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వరంలో ఇంటర్ బోర్డు దిష్టిబొమ్మ దహనం చేశారు. కంగ్టి మండల కేంద్రంలోనూ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. నారాయణ్‌ఖేడ్, సదాశివపేట మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

కౌన్సెలింగ్ కష్టాలు

(మొదటిపేజీ తరువాయి)0

అందుకు భిన్నంగా పాసైన కోర్సుకు సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్ తేవాలంటూ నిబంధన పెట్టడంతో విద్యార్థులు తల్లడిల్లుతున్నారు. బీటెక్ నాలుగో సెమిస్టర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు వారం కిందనే వెలువడ్డాయి. జేఎన్‌టీయూ అధికారులు ఒరిజినల్ సర్టిఫికెట్ ముద్రించి సంబంధిత కళాశాలలకు పంపడానికి కనీసం నెల వ్యవధి పడుతుంది. ఇది ఇలా ఉండగా కౌన్సెలింగ్‌కు వచ్చిన విద్యార్థులు నెట్ నుంచి సర్టిఫికెట్ తీసుకొస్తున్నారు. దీన్ని కౌన్సెలింగ్ చేస్తున్న అధికారులు అంగీకరించకపోగా జేఎన్‌టీయూ నుంచి ట్రాన్స్‌క్రిప్ట్ సర్టిఫికెట్ తేవాలంటూ పంపేస్తున్నారు. దీంతో విద్యార్థులు ఆపసోపాలు పడుతూ హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూకు పరుగులు తీస్తున్నారు. అయితే తీరా అక్కడికి వెళ్లి పరీక్షల విభాగాన్ని వెతుక్కుని సంబంధిత ఫారం తీసుకుని ఒక్కో దానికి రూ.40లు చొప్పున బ్యాంకులో చలానా కట్టి కౌంటర్‌లో ఇస్తుండగా..నాలుగైదు గంటలు క్యూలో నిల్చున్న అనంతరం సర్టిఫికెట్ ఇవ్వడం కుదరదంటూ అధికారులు తిప్పి పంపుతున్నారు. దీనికి పరిష్కారమేంటని అక్కడి అధికారులను అడిగినా సమాధానమివ్వట్లేదు. తాజాగా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో పాసైన విద్యార్థులకు సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్ మరో 20 రోజుల వరకు ముద్రించడం సాధ్యం కాదంటూ జేఎన్‌టీయూ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇందుకు ప్రత్యామ్నాయం ఏంటంటూ విద్యార్థులు జేఎన్‌టీయూ అధికారులు చుట్టూ తిరిగితే సంబంధిత కళాశాల నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) తెచ్చుకుని వెయ్యి రూపాయలు ఫీజు చెల్లిస్తే తత్కాల్ కింద ఒక రోజు వ్యవధిలో మెమో ఇస్తామంటూ స్పష్టం చేస్తున్నారు. అయితే ఇక్కడ మరొక డొంక తిరుగుడు వ్యవహారం ఉంది. విద్యార్థులు జేఎన్‌టీయూ అధికారుల మాటలు నమ్మి ఎన్‌ఓసీ కోసం సంబంధిత కళాశాలకు వెళ్తే అక్కడ ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు ప్రభుత్వం నుంచి రాలేదని, అందువల్ల ఎన్‌ఓసీ ఇవ్వబోమని చెబుతున్నారు. దీంతో విద్యార్థులు చేసేది లేక కౌన్సెలింగ్‌కు మానుకుని ఇంటి బాట పడుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంటు విడుదలా సమస్యే

పలు ఇంజినీరింగ్ కళాశాలలకు గతేడాదికి సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాలేదు. దీనిని సాకుగా చూపుతూ ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులకు ఒరిజినల్ మెమోలు, ఎన్‌ఓసీలు ఇవ్వట్లేదు. 70 శాతం మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ మీద ఆధారపడి చదువులు కొనసాగిస్తున్నారన్నది స్వయంగా ప్రభుత్వం అంగీకరించిన విషయమే. కానీ వాటిని విడుదల చేయకపోగా ఒరిజినల్ మెమోలతోనే ఎంటెక్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్న నిబంధన పెట్టడం విడ్డూరంగా ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. కౌన్సెలింగ్ నోటిఫికేషన్ సమయంలో సర్టిఫికెట్లు తమ దగ్గరే ఉన్నాయని పేర్కొంటూ సంబంధిత కళాశాలల నుంచి కస్టోడియన్ సర్టిఫికెట్‌తో వస్తే చాలని ప్రకటించి తీరా కౌన్సెలింగ్‌లో నానా కొర్రీలు పెట్టి విద్యార్థులను పరుగులు పెట్టిండాన్ని తీవ్రంగా తప్పుపడుతున్నారు. సర్టిఫికెట్లు ఇచ్చేందుకు కళాశాలల యాజమాన్యాలు నిరాకరిస్తుండగా నెట్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న మెమోలను అధికారులు అంగీకరించడం లేదు. కౌన్సెలింగ్ గడువు ఒక రోజు మాత్రమే ఉండడం, విద్యార్థులు హైదరాబాద్‌లోని జేఎన్టీయూకు వెళ్లి సర్టిఫికెట్ తీసుకురాలేని పరిస్థితి ఉండడంతో పలువురు విద్యార్థులు గురువారం కేయూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఉన్నత విద్యామండలి ఆదేశానుసారం తాము పని కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని, సొంత నిర్ణయాలు తీసుకోలేమని కేయూ అధికారులు ఖరాఖండిగా చెబుతుండడంతో విద్యార్థులు తీవ్ర వేదనకు గురౌతున్నారు. నెట్ ద్వారా తీసుకున్న మెమోను సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ అటెస్ట్ చేసి ధ్రువీకరించినా అనుమతించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి నెట్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న మెమోలతోనైనా అనుమతించాలని విద్యార్థులు కోరుతున్నారు. లేదా జేఎన్టీయూలో మెమోలు జారీ అయ్యేవరకైనా కౌన్సెలింగ్ తేదీని పొడిగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

టాస్క్‌ఫోర్సు కార్యాలయంపై...
మానవబాంబు కేసు కొట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

బాంబు దాడి కేసులో మొత్తం 20 మంది నిందితులను గుర్తించగా పదిమందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో ముగ్గురు ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. నాంపల్లి కోర్టు తీర్పుపై పోలీసులు హైకోర్టుకు వెళ్లే అవకాశం ఉందని తెలుస్తోంది.

2006లో టాస్క్‌ఫోర్సు కార్యాలయంపై మానవ బాంబుదాడి

2006, అక్టోబరు 16 దసరా రోజున టాస్క్‌ఫోర్స్ కార్యాలయంపై మానవబాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో అక్కడ విధులు నిర్వహిస్తున్న హోంగార్డు సత్యనారాయణ చనిపోగా, కానిస్టేబుల్ వెంకటరావుకు తీవ్ర గాయాలయ్యాయి. బంగ్లాదేశ్‌కు చెందిన డాలిని ఉగ్రవాద సంస్థ హుజీ ఇక్కడికి తీసుకొచ్చి మానవబాంబుగా మార్చి ఈ దాడికి పాల్పడిందని దర్యాప్తు బందం తేల్చింది. రెండేళ్ల పరిశోధించాక పదిమందిని అరెస్టుచేసి జైలుకు తరలించారు. నిందితులపై కోర్టులో అభియోగపత్రాలు సమర్పించి, విచారణ మొదలుపెట్టారు. వివిధ దశల అనంతరం గురువారం న్యాయస్థానం తుది తీర్పు వెలువరించింది. నిందితులు మహ్మద్ అబ్దుల్ ఖలీల్, మహ్మద్ అబ్దుల్ జాహెద్, మహ్మద్ షకీల్, సయ్యద్‌హాజీ, అలీఖాన్, అజ్మత్ అలీ, మహ్మద్ ఖాజా, మహ్మద్ హిలాలుద్దీన్, నఫీజ్ ఉల్ బిశ్వాస్‌లను నిర్దోషులుగా ప్రకటించింది. కోర్టు తీర్పు అనంతరం వీరు విక్టరీ చిహ్నం చూపుతూ వెళ్లడం గమనార్హం.

3900 మంది శిక్షణలేని ప్రయివేటు టీచర్లు

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రయివేటు పాఠశాలల్లో సుమారు 3900 మంది ఉపాధ్యాయ శిక్షణలేని టీచర్లు ఉన్నట్టు విద్యాశాఖ గుర్తించింది. వీరి వెంటనే శిక్షణ తీసుకునేలా యాజామాన్యాలు చర్యలు తీసుకోవాలని వారికి సూచించింది. 2019మార్చి 31లోగా పాఠశాలల్లో శిక్షణ లేని ఉపాధ్యాయులు ఉండొద్దని ఎంహెచ్‌ఆర్డీ ఆదేశించిన నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ చర్యలు మొదలుపెట్టింది.

11 మంది మాజీ ఎంపీలపై అభియోగాలు

(మొదటిపేజీ తరువాయి)

అభియోగాలు నమోదైన ఎంపీలు..

- ఛతర్‌పాల్ సింగ్ లోధా (బీజేపీ)
- అన్నా సాహెబ్ ఎమ్మెకే పాటిల్ (బీజేపీ)
- చంద్రప్రతాప్ సింగ్ (బీజేపీ)
- ప్రదీప్ గాంధీ(బీజేపీ)
- సురేష్ చందిల్(బీజేపీ)
- వైజి మహజన్(బీజేపీ)
- మనోజ్‌కుమార్(ఆర్జేడీ)
- రామ్‌సేవక్ సింగ్ (కాంగ్రెస్)
- నరేంద్రకుమార్ కుష్వా(బీఎస్పీ)
- లాల్‌చంద్రకోల్ (బీఎస్పీ)
- రాజా రామ్‌పాల్(బీఎస్పీ)

అడిగేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు వెల్లడైంది. అదే ఏడాది డిసెంబర్ 12న ఆజ్‌తక్ ఛానల్ వాటిని ప్రసారం చేసింది. అందుకు సంబంధించిన సీడీలు,డీవీడీలను ఆధారంగా ప్రాసిక్యూషన్ కోర్టుకు సమర్పించింది. ఆజ్‌తక్ హిందీ ఛానల్‌తో కలిసి కోబ్రాపోస్ట్(వెబ్ పోర్టల్) ఈ స్టింగ్ ఆపరేషన్‌ను నిర్వహించింది.

నిందితులైన మాజీ ఎంపీలపై ఢిల్లీ పోలీసులు ఇప్పటికే చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుల్లో బీజేపీకి చెందిన ఎంపీలు ఆరుగురు ఉండగా, బీఎస్పీకి చెందినవారు ముగ్గురు, కాంగ్రెస్, ఆర్జేడీకి చెందినవారు ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. వీరిలో 10మంది ఎంపీలు లోక్‌సభకు, ఒక్కరు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. స్టింగ్ ఆపరేషన్ వెలుగు చూసిన కొన్ని రోజుల్లోనే వీరి పార్లమెంట్ సభ్యత్వాలను ఉభయసభల్లోనూ తీర్మానాల ద్వారా రద్దు చేశారు. స్టింగ్ ఆపరేషన్‌లో పట్టుబడ్డ ఎంపీలు: ఛాత్రాపాల్‌సింగ్ లోధా, అన్నా సాహెబ్ ఎన్‌కె పాటిల్, చంద్రప్రతాప్‌సింగ్, ప్రదీప్‌గాంధీ, సురేశ్ చందేల్, వైజి మహాజన్..బీజేపీకి చెందినవారు. నరేందర్‌కుమార్ కుశ్వాహ్, లాల్‌చంద్రకోల్, రాజా రాంపాల్..బీఎస్‌పీకి చెందినవారు. రామ్‌సేవక్‌సింగ్(కాంగ్రెస్), మనోజ్‌కుమా ర్(ఆర్‌జేడీ). ఈ కేసులో 11మంది ఎంపీలతోపాటు రవీందర్‌కుమార్, విజయ్‌ఫోగట్‌పైనా చార్జిషీట్ దాఖలు కాగా, ఫోగట్ మృతి చెందారు.

ఎంపీలపై నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్‌పై పార్లమెంట్‌లోని ఉభయసభల్లోనూ 2005 డిసెంబర్‌లో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఎంపీల సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని లోక్‌సభలో బీజేపీ పక్ష నేత ఎల్‌కె అద్వానీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఓ ప్రయివేట్ ఛానల్ స్టింగ్ ఆపరేషన్‌పై ఆధారపడి ఎలా రద్దు చేస్తారంటూ ఆయన ప్రశ్నించారు. నిందిత ఎంపీల సభ్యత్వం రద్దుకు నిరసనగా అద్వానీ నేతృత్వంలో బీజేపీ ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు. అయితే, రాజ్యసభలో మాత్రం బీజేపీ పక్షం నేత జశ్వంత్‌సింగ్ నిందిత ఎంపీల సభ్యత్వం రద్దును సమర్థించారు. రాజ్యసభలో తమ పార్టీకి చెందిన ఛాత్రాపాల్‌సింగ్ లోధా సభ్యత్వం రద్దుకు ప్రవేశపెట్టిన తీర్మానానికి ఆయన మద్దతు తెలిపారు. 2005లో కేంద్రంలో మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని యూపీఏ అధికారంలో ఉన్న విషయం తెలిసిందే.

ఎస్పీని వదిలి..ఎస్ఐపై వేటు

(మొదటిపేజీ తరువాయి)

పలు పార్టీలకు చెందిన జాతీయ, రాష్ట్ర నాయకులు నేరెళ్ల బాధితులను పరామర్శించారు. విపక్షాల అండతో బాధితులు, వారి కుటుంబసభ్యులు న్యాయం కోసం పోరాటం కొనసాగించారు. కోర్టు షరతులతో కూడిన బెయిల్‌పై బాధితులను విడుదల చేసింది. వారు వేములవాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మొదట వేములవాడ ఎమ్మెల్యే రమేష్‌బాబును రంగంలోకి దింపి.. ఇద్దరు బాధితులను నేరుగా తన వద్దకు పిలిపించుకుని రాజీకి యత్నించారు. మరుసటి రోజు కరీంనగర్ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ సైతం బాధితులను కలిశారు. అనంతరం ఈ నెల 8న మంత్రి కేటీఆర్ పరామర్శించారు. ఆ మరుసటి రోజు డీఐజీ రవివర్మ ఆస్పత్రికి వెళ్లారు. బాధితులను గోప్యంగా విచారించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. ఈ నాటకీయ పరిణామాల మధ్య ఐజీ నాగిరెడ్డి నేరెళ్ల ఘటనలో సీసీఎస్ ఎస్ఐ రవీందర్‌రెడ్డిని మొదటి బాధ్యునిగా చేస్తూ సస్పెండ్ చేయాలని ఎస్పీని ఆదేశించారు. ఈ మేరకు ఎస్పీ విశ్వజిత్‌కాంపాటి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఘటనలో ఎస్పీని వదిలి..ఎస్ఐని బలిపశువు చేయటంపై విమర్శలు వస్తున్నాయి. మరికొందరు కిందిస్థాయి పోలీసులపై చర్యలు తీసుకుని కేసును మమా అనిపించే దిశగా సర్కారు యత్నిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

ప్రజా సమస్యల గొంతుక

(మొదటిపేజీ తరువాయి)

అంశాలపై జరిగే చర్చల్లో విలువైన సమాచారం ఇచ్చేవారని, చాలాసార్లు ఆయన సుదీర్ఘంగా మాట్లాడినప్పటికీ సమయం ఇంకా కాలేదనిపించేందని గుర్తు చేశారు. ఉన్నత విలువలకు ఆయన నిలువుటద్దమన్నారు.

ఏచూరి తనకు మిత్రుడుని, వివిధ అంశాలపై చాలా సార్లు తనకు సలహాలిచ్చారని సమాజ్ వాదీ పార్టీ సీనియర్ సభ్యుడు రామ్ గోపాల్ యాదవ్ గుర్తుచేసుకున్నారు. తాను ఆయన పక్కనే కూర్చునేవాడినని, ఇకపై ఆయన పక్కన ఉండరని తలుచుకుంటేనే బాధకలుగుతోందంటూ ఉద్వేగానికి లోనైయ్యారు. ప్రతి అంశపైన ఆసక్తిగా ఉండేవారని తెలిపారు. మాట్లాడే సందర్భంలో రామ్ గోపాల్ కంటితడి పెట్టుకున్నారు. ఏచూరి మాట్లాడే సందర్భంలో ఆయనను ఓదార్చుతూ సభలో లేకపోయిన, బయట కలిసి పని చేద్దామని అన్నారు. అన్నాడీఎంకే పక్షనేత నవనీత్ కృష్ణన్ మాట్లాడుతూ దేశంలో ప్రతి భారతీయుడు ఏచూరి నుంచి స్ఫూర్తి పొందాలని అన్నారు. డీఎంకే పక్షనేత తిరుచ్చి శివ మాట్లాడుతూ ఏచూరి దేశానికి తన సేవలను అందించారని, ఆయన సభలో లేకపోవడం చాలా కోల్పోతామని అన్నారు. అణగారిన వర్గాల గొంతుకై నిలిచారని కొనియాడారు. ఆయన రాజకీయ నాయకుడే కాదని, రాజకీయ వేత్తని అన్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారు: అరుణ్ జైట్లీ

సీతారాం ఏచూరి ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారని కేంద్ర ఆర్థిక మంత్రి, రాజ్యసభ నేత అరుణ్ జైట్లీ అన్నారు. సీనియర్ రాజకీయ వేత్తగా గుర్తింపు పొందారన్నారు. వివిధ సంఘాల్లో పనిచేసి ఈ స్థాయికి చేరుకున్నారని తెలిపారు. విద్యార్థి ఉద్యమం నుంచి రాజకీయ వేత్తగా ఎదిగారన్నారు. రెండు సార్లు రాజ్యసభ సభ్యుడుగా తన నిర్విరామ కృషి చేశారని అన్నారు. సభలో జరిగే అన్ని చర్చల్లో ఆయన పాల్గొనేవారని గుర్తు చేశారు. పార్లమెంట్ విలువలకు కట్టుబడి పనిచేశారన్నారు. సైద్ధాంతిక వేత్తగా ఉండేవారని, తనకు అనేక సార్లు సలహాలిచ్చేవారని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో తనవంతు పాత్రను పోషించారని అన్నారు.

ప్రతిపక్షాలను సమన్వయం చేయడంలో ఆయనది కీలక పాత్ర : గులాం నబీ ఆజాద్

ప్రతిపక్షాలను సమన్వయం చేయడంలో ఏచూరి కీలక పాత్ర పోషించారని ప్రతిపక్షనేత గులాం నబీ ఆజాద్ అన్నారు. "ఈ సభలో చాలా మంది సీనియర్లున్నారు. ఏచూరి సభను వీడుతుంటే.. తెలియని బాధకలుగుతోంది. ఆయన సభలో లేకపోవడం మాకే కాదు..సభకు కూడా లోటే. ఆయన ఒక పార్టీకే నాయకుడు కాదు. దేశానికే నాయకుడు. ఆయన వివిధ స్థాయిల్లో పనిచేశారు. సోషలిజం, లౌకిక వాదం కాపాడాలని నిరంతరం గొంతెత్తేవారు" అని గుర్తుచేశారు.

ఉద్యమాల్లో కలిసి పనిచేస్తాం: డి రాజా

దేశంలో జరిగే ప్రజా ఉద్యమాల్లో కలిసి పనిచేస్తామని సీపీఐ సభ్యుడు డి.రాజా పేర్కొన్నారు. ఏచూరి ఎస్ఎఫ్ఐలో ఉన్నప్పుడు, తను ఎఐవైఎఫ్‌లో పని చేశానని, ఆయన సభలో లేకపోవడం చాలా బాధకరంగా ఉందని అన్నారు. ఆయన సభలో లేని లోటును చాలా మంది సభ్యులు చెప్పారని, అందులోనే ఆయన ఆదర్శం కనబడుతోందని తెలిపారు. ప్రస్తుతం దేశంలో ఐక్య ఉద్యమాలు అవసరముందని, సీపీఐ, సీపీఐ(ఎం) కలిసి పనిచేస్తాయని అన్నారు.

ఏచూరి రాజకీయ మార్గదర్శికుడు: డెరిక్ ఓ బ్రెయిన్, తృణముల్ కాంగ్రెస్

సీతారాం ఏచూరి రాజకీయ మార్గదర్శకుడని తృణముల్ కాంగ్రెస్ నేత డెరిక్ ఓ బ్రెయిన్ కొనియాడారు. సీపీఐ(ఎం), టీఎంసీల మధ్య రాజకీయంగా విభేదాలున్నాయని, అయినప్పటికీ ఏచూరిని గురించి మాట్లాడకుండా ఉండలేనని అన్నారు. దేశంలో ఆయన కృషిని మరువలేమని అన్నారు. తన కూతురు ఎప్పుడు ఏచూరి గురించి చెబుతోందని తెలిపారు.

కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌ను ఏచూరి తెచ్చారు : జైరాం రమేష్

సీతారాం ఏచూరి ప్రజల ప్రోగ్రామ్ (కామన్ మినిమమ్ ప్రోగ్రామ్)ను తెచ్చారని జైరాం రమేష్ అన్నారు. 2004లో యూపీఏ-1 ప్రభుత్వం ఏర్పాడటానికి ముందు ప్రజా సమస్యలతో కూడిన కనీస ఉమ్మడి కార్యక్రమం కాంగ్రెస్ ముందుకు ఏచూరి పట్టుకొచ్చారని, అందులో భాగంగా అనేక సూచనలు సలహాలు ఇచ్చారని అన్నారు. దేశానికి వామపక్షాలు తప్పని సరి అవరమని తెలిపారు.

దేశంలోనే ఛాంపియన్ నేత : నరేష్ గుజ్రాల్

దేశంలోనే ఏచూరి ఛాంపియన్ నేత అని శిరోమని అకాలీదళ్ సభ్యుడు నరేష్ గుజ్రాల్ అన్నారు. సీతారాం తనకు మంచి స్నేహితుడని తెలిపారు. టూరిజం ట్రాన్స్ పోర్టు కమిటీలో తనకు చాలా సలహాలు ఇచ్చారని తెలిపారు. ఆయన జీవితంలో ఛాంపియన్‌గా నిలిచారని, లౌకిక వాదాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుటలో కూడా ఆయన ఛాంపియన్‌గా నిలిచారని తెలిపారు.

ప్రజా సమస్యలపై విస్తృత చర్చ జరగాలి: రాజ్యసభలో ఏచూరి చివరి మాటలు

పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై విస్తృత చర్చ జరగాలని సీతారాం ఏచూరి అన్నారు. తన వీడ్కోలు సందర్భంగా ఆయన రాజ్యసభలో చివరి సారిగా మాట్లాడారు. ప్రజా సమస్యలపైన, దేశం ఎదుర్కొంటున్న సవాళ్లపైన చర్చకు వేదికగా పార్లమెంట్ ఉభయ సభలూ ఉండాలని కోరారు. అవుట్‌సోర్సింగ్, ప్రయివేటీకరణ దేశ హితానికి ఆటంకం కలిగిస్తాయని తెలిపారు.

దేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, యువత ఎదుర్కొంటున్న ఉపాధి సమస్యపై చర్చలు జరగాలని, దళిత, మైనార్టీ, మహిళ, ఆదివాసీ, వెనుకబడిన వర్గాలపై జరుగుతున్న దాడులపై చర్చ జరగాలని కోరారు. కులం, మతం, భాష పేర్లతో ప్రజల్ని విడగొట్టడం రాజ్యాంగానికి విరుద్ధమని అన్నారు. ప్రజల వాస్తవ ఎజెండా పార్లమెంట్‌లో ఉండాలని కోరారు. దేశంలో నెలకొన్న అభద్రత భావాన్ని తొలగించాలని కోరారు. రాజకీయాలను బయట చేసుకోండని, పార్లమెంట్‌లో ప్రజల వాస్తవ సమస్యలపై చర్చ జరగాలని అధికార, ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు.

సెన్సెక్స్ ▼ 267 31,531	నిఫ్టీ ▼ 88 9,820	డాలరుకు రూపాయి విలువ 64.08	బంగారం(10.గ్రా) రూ. 29,443	వెండి (కేజీ) రూ. 41,100	కోడిగుడ్లు: హైదరాబాద్ 320, ఒక్కగుడ్డుకు 3.80, వరంగల్ 322, విజయవాడ 320, చెన్నై 355, ముంబయి 365

1:2 బోనస్ షేర్ల 'భెల్' మోగింది!

ముంబయి: భారీ విద్యుత్ ఉత్పత్తి ఉపకరణాల తయారీ కంపెనీ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్) 2017-18 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 3.92 శాతం వృద్ధితో రూ.80.82 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో సంస్థ రూ.77.77 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.6,070.21 కోట్ల నుంచి రూ.6,194.21 కోట్లకు చేరింది. గత జూన్ 30 నాటికి కంపెనీ ఆర్డర్ బుక్ రూ.1,01,380 కోట్లుగా ఉంది. 2016-17 సానుకూల అంశాలను కొనసాగిస్తామని భెల్ పేర్కొంది. గురువారం జరిగిన కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో రూ.2 ముఖ విలువ కలిగిన రెండు ఈక్విటీ షేర్లపై ఒక్క బోనస్ షేర్ అందించడానికి వారు ఆమోదం తెలిపారు. వ్యయాలు తగ్గించుకోవడంతో పాటు ఎత్తుగడల ప్రోత్సాహంతో వృద్ధి రేటు సానుకూలతను కొనసాగిస్తామని భెల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అతుల్ సోబ్తి విశ్వాసం వ్యక్తం చేశారు.

'యూనియన్ బ్యాంకు'కు మొండి బాకీల దెబ్బ

ముంబయి: ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు (యూబీఐ) మొండి బాకీల సెగ తగిలింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో మొండి బాకీల దెబ్బతో బ్యాంకు లాభాలు 30% మేర పడిపోయి రూ.117 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే త్రైమాసిక కాలంలో బ్యాంకు లాభాలు రూ.166 కోట్ల లాభాలు సాధించింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు 12.63 శాతానికి ఎగిశాయి. గతేడాది ఇదే త్రైమాసికం నాటికి జీఎన్‌పీఏ 11.7 శాతంగా నమోదు అయ్యాయి. గురువారం బీఎస్‌ఈలో యూబీఐ షేర్ 5.15 శాతం తగ్గి రూ.134.45 వద్ద ముగిసింది.

అంచనాలు అందుకున్న గెయిల్

ముంబయి: ప్రభుత్వ రంగంలోని గ్యాస్ ఉత్పత్తి కంపెనీ గెయిల్ ఇండియా ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో రూ.1,026 కోట్ల (10.26 బిలియన్ డాలర్లు) లాభాలను ఆర్జించింది. గతేడాది ఇదే త్రైమాసిక కాలంలో గెయిల్ రూ.1,335 కోట్ల మేర లాభాలు సాధించింది. దీంతో పోల్చితే గత క్యూ1 లాభాల్లో 23 శాతం క్షీణత చోటు చేసుకుంది. అయినప్పటికీ మార్కెట్ అంచనాలకు అనుగుణంగానే ఫలితాలు ప్రకటించడం విశేషం. ఇదే సమయంలో కంపెనీ సహజ వాయువు సరఫరా వ్యాపారం 10 శాతం పెరిగి రూ.1,134 కోట్లకు చేరింది.

మార్కెట్లోకి 'హైడ్రోజన్' నీటి అయోనైజర్



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: మెడిలైట్ హెల్త్ కేర్ ప్రయివేటు లిమిటెడ్ హైడ్రోజెన్ రిచ్ యాంటీ ఆక్సిడెంట్ అయొనైజర్ హెచ్‌రిచ్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. దేశంలోనే తొలిసారి పూర్తి స్థాయిలో హైడ్రోజన్ పూరిత వాటర్ అయొనైజర్ ఇదేనని మెడిలైట్ ప్రయివేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస యాదవ్ కందుల పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఫిబ్రవరి నెల నుంచి టెస్ట్ మార్కెట్ నిర్వహించిన తాము అధికారికంగా భారత మార్కెట్లో హెచ్.రిచ్ ఆల్కలైన్ వాటర్ అయొనైజర్‌ను విక్రయించనున్నామని తెలిపారు. అయితే వచ్చే మాసంలో వీటిని వాణిజ్య అమ్మకాల్లోకి తీసుకొస్తామన్నారు. వీటిని తైవాన్ నుంచి దిగుమతి చేసుకుంటున్నామన్నారు. దీని ధర రూ.1,40,000 నిర్ణయించినట్టుగా చెప్పారు. రెండేళ్లకోసారి మార్చే ఫిల్టర్ వ్యయం రూ.4000గా ఉంటుందన్నారు. ఈ ఏడాది రూ.25 కోట్లు టర్నోవర్ లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మెడిలైట్ జీఎం ఎస్.ఎస్.శ్రీనివాస శర్మ, కంపెనీ ప్రతినిధులు రవి, ప్రసాద్, సంతోష్, అమిత్ కుమార్ నర్నోలి తదితరులు పాల్గొన్నారు.

రూ.5,00,000 కోట్లు హాంఫట్!

ప్రతికూల పరిస్థితులతో మార్కెట్లకు తీవ్ర నష్టాలు

- వరుస నష్టాలతో విలవిలలాడుతోన్న సాధారణ మదుపరులు
- మరో 267 పాయింట్ల మేర పతనమైన బీఎస్ఈ సెన్సెక్స్



ముంబయి : మూడు సెషన్లలో మదుపర్లు దాదాపుగా రూ.5 లక్షల కోట్ల విలువ నష్టపోయారు. వివిధ పరిణామాలతో బీఎస్ఈ సెన్సెక్స్ 700 పాయింట్లకు పైగా కోల్పోవడంతో మదుపరి తీవ్ర ఒత్తిడికి గురి అయ్యారు. గురువారం బీఎస్ఈ మరో 267 పాయింట్లు నష్టపోయింది. క్రితం సోమవారం రూ.1,33,28,547 కోట్లుగా ఉన్న బీఎస్ఈ మార్కెట్ విలువ గురువారం ముగింపు నాటికి ఇది రూ.1,27,98,957 కోట్లకు జారిపోయింది. దీంతో మదుపర్లు రూ.5,29,590 కోట్లు నష్టపోయారు.

ఎరుపెక్కిన బ్లూచిప్స్ స్టాక్స్..

ఎక్కువగా నష్టపోయిన స్టాక్స్‌లో టాటా మోటార్స్, ఎస్‌బీఐ, సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లు ఉన్నాయి. ఈ స్టాక్స్ అత్యధికంగా రూ.10,000 కోట్ల పైగా నష్టపోయాయి. ఐటీసీ, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, బజాజ్ ఫైనాన్స్, కోల్ ఇండియా, మారుతీ సుజుకీ ఇండియా, ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, కాడిల్లా హెల్త్‌కేర్ సూచీలు రూ.7,000 కోట్ల నుంచి రూ.10,000 కోట్ల మేర విలువ కోల్పోయాయి.

వీడని యుద్ధ భయాలు..

అమెరికాపై ఉత్తర కొరియా యుద్ధ హెచ్చరికలు, పలు కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు పేలవంగా నమోదు కావడంతో గురువారం కూడా భారత మార్కెట్లు నష్టాలు చవి చూశాయి. ఈ నేపథ్యంలోనే బీఎస్ఈ సెన్సెక్స్ 266.51 పాయింట్లు నష్టపోయి 31,531.33కు పడిపోయింది. ఈ నెలలో ఇదే కనిష్ట స్థాయి కావడం విశేషం. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 87.8 పాయింట్లు పతనమై 9,820.25 పాయింట్ల వద్ద ముగిసింది. బీఎస్ఈలో రంగాల వారీగా రియాల్టీ సూచీ అత్యధికంగా 5.12 శాతం నష్టపోయింది. ఇదే క్రమంలో వైద్య సూచీ 3.15 శాతం, ఆటో 2.79 శాతం, విద్యుత్ 2.78శాతం చొప్పున విలువ కోల్పోయాయి. మరోవైపు ఐటీ సూచీ 0.63 శాతం, టెక్ 0.13 శాతం చొప్పున రాణించాయి.

సెన్సెక్స్‌లో టాటా మోటార్స్ 8.6 శాతం, డాక్టర్ రెడ్డీస్ 4.77 శాతం, సన్ ఫార్మా 3.08 శాతం, అదానీ పోర్ట్సు 2.66 శాతం, సిప్లా 2.47 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూశాయి. మరోవైపు ఇన్ఫోసిస్ 1.35 శాతం, విప్రో 0.44 శాతం, టీసీఎస్ 0.37 శాతం, ఎల్అండ్‌టీ 0.3 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 0.26 శాతం చొప్పున పెరిగి మార్కెట్లకు కొంత మద్దతుగా నిలిచాయి.

రెండు కంపెనీలకు ఊరట

- సెబీ ఆంక్షలపై స్టే జారీ చేసిన శాట్
- నేటి నుంచి యథావిధిగా ట్రేడింగ్



ముంబయి: డొల్ల కంపెనీలన్న నెపంతో స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ నిలిపివేసిన రెండు సంస్థలకు గురువారం పెద్ద ఊరట లభించింది. జే కుమార్ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్, ప్రకాష్ ఇండస్ట్రీస్ సంస్థల్లో ట్రేడింగ్‌పై సెబీ విధించిన ఆంక్షలపై స్టేనిస్తూ 'సెక్యూరిటీస్ అప్పీలేట్ ట్రిబ్యూనల్' (శాట్) మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. డొల్ల కంపెనీలన్న నెపంతో సెబీ సోమవారం స్టాక్ మార్కెట్లలోని 331 కంపెనీల ట్రేడింగ్‌లపై ఆంక్షలు విధిస్తూ వాటి స్టాక్స్‌ను స్టేజ్-4 జీఎస్ఎం విభాగంలోకి చేర్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ రెండు కంపెనీలు బుధవారం శాట్‌ను ఆశ్రయించాయి. కంపెనీల వాదనలను పరిశీలించిన శాట్ ఎలాంటి విచారణ లేకుండా సెబీ ఆయా కంపెనీలు డొల్ల కంపెనీలన్న నెపంతో ట్రేడింగ్ నుంచి దూరంగా ఉంచడాన్ని ఆక్షేపించింది. సరైన ఆధారాలు లేని కారణంగా ఆంక్షలను సడలించవచ్చన్న నిర్ణయానికిన వచ్చినట్టుగా తెలిపింది. సెబీ నిర్ణయాన్ని రిజర్వు చేస్తూ శాట్ ఆదేశాలను జారీ చేసిన నేపథ్యంలో శుక్రవారం నుంచి ఈ రెండు కంపెనీల విండోస్‌లో ట్రేడింగ్ తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ కేసులో తదుపరి విచారణను శాట్ సెప్టెంబరు 4నకు వాయిదా వేసింది.

భాగస్వామ్య యోచనకు బైబై!

- టాటా మోటార్స్ ఫోక్స్‌వ్యాగన్ సంస్థల సంయుక్త నిర్ణయం

న్యూఢిల్లీ: దేశీయ ఆటోమొబైల్ రంగంలో గురువారం అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. కొత్త తరహా కార్ల రూపకల్పన నిమిత్తం జర్మనీ సంస్థ ఫోక్స్‌వ్యాగన్‌తో జత కట్టాలనుకున్న టాటా మోటార్స్ సంస్థ తాము ఆ ప్రయత్నాలను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించింది. అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల అవసరాలకు తగ్గట్టుగా కార్లను తయారు చేసేందుకుగాను జట్టు కట్టాలని ఈ రెండు సంస్థ గత మార్చిలో ఒక అవగాహనకు వచ్చిన విషయం తెలిసిందే. భాగస్వామ్యంతో కార్ల తయారీకి సంబంధించి వాణిజ్య, టెక్నాలజీ పరమైన అవకాశాలన్నింటినీ తాము అధ్యయనం చేసినట్లు టాటా మోటార్స్ తెలిపింది. అయితే ఆయా ప్రాంతాల్లో జట్టు భాగస్వామ్యం ముందుగా ఊహించినట్టుగా గొప్పస్థాయిలో మేలు చేయదన్న తలంపుతోనే తాము భాగస్వామ్యపు ఆలోచనను వెనక్కి తీసుకోవాలని నిర్ణయించినట్టుగా టాటా మోటార్స్ తెలిపింది. ప్రస్తుతం ఉన్న విధంగానే రానున్న రోజుల్లో కూడా తాము సొంతంగానే కార్లను తయారు చేసి మార్కెట్లోకి తీసుకురానున్నట్టుగా తెలిపింది. భవిష్యత్తు అవకాశాల మేరకు ఫోక్స్‌వ్యాగన్ సంస్థతో కలిసి పని చేసేందుకు తాము ఆశావహంగానే ఉన్నామని తెలిపింది.

స్టాక్ మార్కెట్ లావాదేవీలకూ 'ఆధార్'



ముంబయి: వివిధ సంక్షేమ పథకాలకు ఇప్పటికే ఆధారంగా మారిపోయిన ఆధార్ కార్డు తాజాగా దలాల్ స్ట్రీట్‌లోకి ఎంట్రీ ఇవ్వనుంది. ఇకపై వాటాలు, మ్యూచువల్ ఫండ్స్ కొనుగోలునకు కూడా ఆధార్‌ను తప్పనిసరి చేయాలని ప్రభుత్వ యోచిస్తున్నట్టుగా సమాచారం. 'ఫైనాన్షియల్ మార్కెట్ ట్రాన్సాక్షన్స్'కు కూడా ఆధార్‌ను అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం, సెబీ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. స్టాక్ మార్కెట్లలో వివిధ రూపాల్లో పెట్టుబడులు పెట్టి నల్లధనాన్ని తెల్లగా మార్చే ప్రయత్నాపెరిగిన నేపథ్యంలో వాటిని అడ్డుకునేందుకే సర్కారు ఈ దిశగా యోచిస్తున్నట్టుగా విశ్వసనీయ వర్గాల వారి సమాచారం. మార్కెట్లకు ఆధార్‌ను లింక్ చేయాలని ఇటీవల సెబీ అనధికారింగా చర్చించినట్లు ఈ వ్యవహారాలతో సంబంధం ఉన్న ఓ అధికారి తెలిపారు. 'ఆధార్‌ను తప్పనిసరి చేయాలని ఉన్నతాధికారులు యోచిస్తున్నారు. అయితే ఎప్పటి నుంచి దీనిని అమలు చేయాలన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. అంతేగాక ప్రస్తుతం ఉన్న పాన్ కార్డుకు బదులుగా ఆధార్‌ను తీసుకొస్తారో లేదా ఆధార్, పాన్ కార్డులు రెండింటిని తప్పనిసరి చేస్తారో కూడా సర్కారు నిర్ణయించాల్సి ఉందని సదరు అధికారి వెల్లడించారు.

ఫ్లిప్‌కార్ట్‌లో సాఫ్ట్‌బ్యాంక్ పెట్టుబడులు



బెంగళూరు: దేశీయ ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌లో సాఫ్ట్‌బ్యాంక్ అతి పెద్ద వాటాదారుగా అవతరించింది. తాజాగా సాఫ్ట్‌బ్యాంక్ టెక్నాలజీ-ఫోకస్డ్ విజన్ ఫండ్‌లో భాగంగా ఫ్లిప్‌కార్ట్ మరో 2.5-2.6 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టినట్టుగా సమాచారం. ప్రాథమిక, ద్వితీయ క్యాపిటల్ రూపంలో సంస్థ ఈ నిధులను పెట్టుబడిగా తీసుకురానున్నట్టుగా సమాచారం. దీర్ఘకాలిక భాగస్వామిగా విజన్ ఫండ్ ముందుకు రావడం తమకు ఆనందం కలిగించిందని ఫ్లిప్‌కార్ట్ వ్యవస్థాపకులు బిన్నీ బన్సాల్, సచిన్ బన్సాల్ తెలిపారు. తదుపరి తరం టెక్నాలజీని అందిపుచ్చుకొని భరతీయుల అవసరాలను తీర్చేలా సంస్థను మరింత మేటి తీర్చిదిద్దనున్నట్టుగా వారు వివరించారు.

టెక్నాలజీతో రోడ్డు భద్రతకు మెరుగులు



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: టెక్నాలజీ సహాయంతో హైదరాబాద్‌లో రోడ్డు భద్రతను మరింత మెరుగుపరిచేందుకు గాను సర్కారు సన్నద్ధమైంది. ఇందుకుకోసం తెలంగాణ ప్రభుత్వం, డబ్ల్యూఆర్ఐ ఇండియా రోస్ సెంటర్‌తో భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా స్మార్ట్ స్ట్రీట్ ల్యాబ్‌ను అందుబాటులోకి తేనున్నట్టుగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింద. ఈ ల్యాబ్ పైలట్ ప్రాజెక్టులో భాగంగా టెక్నాలజీ, కృత్రిమ మేధస్సుతో హైదరాబాద్ రోడ్ల భద్రత, మహిళ భద్రత సోల్యూషన్స్‌తో పాటు కొత్త అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనుంది. భారత్‌లో వాహనీకరణ బాగా వృద్ధి చెందుతోంది. ఈ కారణంగా రోడ్ల భద్రత ప్రమాణాలపై ఈ ప్రభావం భారీగా పడుతుందని రోడు ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్ మంతిత్వశాఖ (ఎంవోఆర్‌టీహెచ్) నివేదిక విశ్లేషించింది. ఈ మేరకు టీ సర్కారు చర్యలు చేపట్టింది.

జియోకు పోటీగా ఆర్‌కామ్ 'కొత్త ప్లాన్'

ముంబయి: టెలికాం సంచలనం రిలయన్స్ జియో నుంచి ఎదురవుతున్న తీవ్ర పోటీని తట్టుకొనేందుకు గాను తోటి టెలికాం కంపెనీలు రోజుకో కొత్త ఆఫర్‌ను ప్రకటిస్తున్నాయి. తాజాగా అనిల్ అంబానీ కంపెనీ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) కూడా మరో కొత్త ప్లాన్‌తో ఈ రేసులో చేరింది. కొత్తగా రూ.299 రెంటల్ ప్లాన్‌ను ఆవిష్కరించింది. ఈ ప్లాన్ కింద అపరిమిత కాల్స్, టెక్ట్స్, డేటాను తమ సబ్‌స్క్రైబర్లకు అందించనున్నట్టు ఆర్‌కామ్ పేర్కొంది.'రిలయన్స్ మొబైల్ ఇప్పటివరకు అత్యంత చౌకైన రేట్లను ప్రవేశపెట్టింది. 299 రూపాయలతో నెలవారీ రెంటల్ ప్లాన్‌ను ప్రారంభిస్తోంది' అని ఆర్‌కామ్ ట్వీట్ చేసింది. అయితే దీనికి సంబంధించి మిగతా ఏ వివరాలను ఆర్‌కామ్ పేర్కొనలేదు. గతవారమే ఆర్‌కామ్ ఏడాది మొత్తానికి సరిపడా ఓ సరికొత్త ప్లాన్‌ను ఆవిష్కరించింది. ఆ కొత్త ఆఫర్‌ను రూ.5199కి లాంచ్ చేసిన సంగతి తెలిసింది.



ఒక మీటర్ లోతు తవ్వాల్సి ఉండగా 10 మీటర్ల లోతు తవ్విన దృశ్యం

మాఫియా కనుసన్నల్లో

ఇసుక తవ్వకాలు

పర్యావరణ చట్టం బేఖాతర్ - నిబంధనలు కాగితాల్లోనే నిక్షిప్తం - జీఓలనూ పట్టించుకోని అధికారగణం

కొండూరి రమేశ్‌బాబు

రాష్ట్రంలో మాఫియా కనుసన్నల్లోనే ఇసుక తవ్వకాలు సాగుతున్నాయి. మాఫియా ఆగడాలను అరికట్టడానికి, పర్యావరణాన్ని కాపాడటానికి సుప్రీం కోర్టు, కేంద్ర పర్యావరణ శాఖ మార్గదర్శకాలను జారీ చేసినా వాటిని ఇక్కడ అమలు చేయడం లేదు. ఇసుక తవ్వకాల్లో పారదర్శకత పాటిస్తున్నామని, అక్రమాలకు తావు లేకుండా చేసేందుకు కొత్త జీవోలను అమల్లోకి తెచ్చామని చెప్తున్న రాష్ట్ర సర్కారు వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. చట్టాలను, జీఓలను అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం కూడా వివిధ దశల్లో కాంట్రాక్టర్లతో కుమ్మక్కవడం, రాజకీయ ఒత్తిడులకు తలొగ్గడం, అడుగడుగునా అవినీతి వంటి కారణాలతో నేరెళ్ళ వంటి సంఘనలు జరుగుతున్నాయి. పర్యావరణం, ప్రజారోగ్యం పాలకులకు రుచించని పదాలుగా మారిపోయాయి.

పర్యావరణ అనుమతులు తీసుకోకుండా ఇసుక తవ్వకాలు చేపట్టవద్దని రాష్ట్రాలను సుప్రీం కోర్టు ఆదేశించింది. దీపక్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ హర్యానా కేసులో ఇచ్చిన చారిత్రక తీర్పు తర్వాత కేంద్రంతో పాటూ పలు రాష్ట్రాలు ఉలిక్కి పడ్డాయి. . ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇసుక మాఫియా ఆగడాలు మితిమీరిపోవడంతో ఒక దశలో రాష్ట్రంలో ఇసుక తవ్వకాలను హైకోర్టు నిలిపివేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జీఓ ఎమ్ఎస్ నంబర్ 38 ద్వారా కొత్త ఇసుక విధానాన్ని ప్రభుత్వం ప్రకటించింది. దీనిని అమలు చేయడానికి జీఓ ఎమ్ఎస్ నంబర్ 3 ద్వారా నిబంధనలను కూడా రూపొందించింది. రాష్ట్రంలో ఇసుక తవ్వకాలను రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థకు అప్పగించింది. గిరిజన ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జిల్లా కలెక్టర్లు, ఐటీడీఏల పర్యవేక్షణలో జరుగుతాయని జీఓల్లో పేర్కొంది.

జిల్లా కలెక్టర్ ఛైర్మెన్‌గా జిల్లా ఇసుక కమిటీలను ఏర్పాటు చేసింది. వివిధ శాఖల అధికారులను ఈ కమిటీలో సభ్యులుగా చేర్చింది. జిల్లాల్లో ఇసుక రీచ్‌లను గుర్తించి ప్రతిపాదనలు పంపడమే కాక నిబంధనలకు ప్రకారం ఇసుక తవ్వకాలు జరిగే విధంగా జిల్లా కమిటీలు పర్యవేక్షించాల్సి ఉంది. ఇసుక తవ్వకాల్లో అక్రమాలను నిరోధించడానికి రెవిన్యూ డివిజన్, మండల స్థాయిల్లో కూడా కమిటీలను నియమించింది. ఇన్ని కమిటీలు నియమించినా రాష్ట్రంలో ఇసుక తవ్వకాల్లో అక్రమాలను అరికట్టలేక పోయింది. ఇసుక తవ్వకాల పర్యవేక్షణ గురించి జిల్లా కలెక్టర్లు పట్టించుకోక పోవడంతో కింది స్థాయి అధికారులు ఇసుక మాఫియాతో చేతులు కలిపారని ప్రభుత్వానికి కూడా నివేదికలు అందాయి. ఇసుక తవ్వకాల్లో కీలక పాత్ర నిర్వహించాల్సిన గనుల శాఖ అధికారులు, ఖనిజాభివృద్ధి సంస్థ అధికారుల అవినీతి పరాకాష్టకు చేరుకోవడంతో ఇసుక తవ్వకాల్లో నియంత్రణ కొరవడింది. రెవిన్యూ, పోలీస్, రవాణా శాఖల అధికారులు ఇసుక కాంట్రాక్టర్ల వద్ద మూమూళ్ళకు అలవాటు పడటంతో మాఫియా ఆగడాలకు అంతులేకుండా పోయింది. నదుల్లో తమకు కేటాయించిన పరిధిని దాటి ఇసుకను తవ్వడం, ఓవర్‌లోడింగ్, ఒకే పర్మిట్‌పై రెండు మూడు సార్లు ఇసుక రవాణా చేయడం వంటి ఆరోపణలు ఎన్ని వచ్చినా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ఓవర్ లోడింగ్‌తో వెళ్తున్న లారీలను ఆపి పోలీస్, రవాణా శాఖల అధికారులు అనధికారిక వసూళ్ళకు పాల్పడంతో అక్రమార్కులకు భయం లేకుండా పోయింది.



సూత్రధారులు గులాబీ నేతలే...

రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ పార్టీ నేతలే ఇసుక మాఫియాకు కొమ్ముకాయడం, ఇసుక వ్యాపారంలో అనధికారిక భాగస్వాములు కావడం పరిపాటిగా మారింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో కోట్లాది రూపాయల విలువ చేసే ఇసుక తవ్వకాలకు అనుమతుల నివ్వడంతో గులాబీ పార్టీ నేతలు ఈ వ్యాపారంలో తలదూర్చారు. వివిధ జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అనుచరులే కాంట్రాక్టర్లుగా మారారు. డివిజన్ స్థాయి, మండలస్థాయి నేతలు కూడా ఇసుక రీచ్‌ల వద్ద పర్యవేక్షణ బాధ్యతలు స్వీకరించారు. పూర్వపు వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, నల్లగొండ జిల్లాలకు చెందిన టీఆర్ఎస్ నేతలు ఇసుక వ్యాపారంలో భాగస్వాములుగా ఉన్నట్టు ముఖ్యమంత్రికి ఇటీవల ఇంటెలిజెన్స్ నివేదిక కూడా అందింది. సీఎంకు తెలిసినా వారు భయపడటం లేదంటే వారి ఆదాయం ఏ స్థాయిలో ఉన్నదో తెలుస్తున్నది. ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టడానికి ఎవరైనా అధికారులు రంగంలోకి దిగినా వారిపై రాజకీయ ఒత్తిడులు రావడంతో మౌనం దాలుస్తున్నారు.

ఎమ్మెల్సీ అనుచరుల ఇసుక అక్రమ రవాణ

ముత్తారం రీచ్‌ని సీజ్ చేసిన అధికారులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా వెంకటాపురం మండలంలోని ముత్తారం ఇసుక రీచ్‌లో జరుగుతున్న అక్రమాలపై మలుగు సబ్ కలెక్టర్ కొరఢా ఝుళిపించారు. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అనుచరులు నడిపిస్తున్న ఈ ఇసుక రీచ్ నుంచి పర్మిట్‌లు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న లారీలను పసర గ్రామం వద్ద బుధవారం పట్టుకున్నారు. ఇవి ముత్తారం రీచ్ నుంచి వస్తున్నట్టు విచారణలో వెల్లడి కావడంతో మలుగు సబ్ కలెక్టర్ ఆదేశాలతో స్థానిక తహసిల్దార్ గురువారం సీజ్ చేశారు. ఈ రీచ్ నుంచి పర్మిట్లు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న లారీలను రెండ్రోజుల క్రితం భద్రాచలం ట్రాఫిక్ పోలీసులు కూడా పట్టుకున్నారు. ముత్తారం ఇసుక రీచ్‌లో ఈ సంవత్సరం కేవలం 25 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక తీయాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేయగా ఇప్పటికే 45 వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను తీశారు. అదనంగా తీసిన ఇసుకను ఒకే పర్మిట్‌పై రెండు మూడుసార్లు, కొన్ని సందర్భాల్లో ఎటువంటి పర్మిట్ లేకుండానూ రవాణా చేస్తున్నట్టు స్థానిక గిరిజనులు ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్సీ బంధువులు నిర్వహిస్తున్న మరికాల ఇసుక రీచ్‌లో కూడా నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళల్లో భారీ యంత్రాలతో లారీలో లోడ్ చేస్తున్నట్టు సమాచారం అందుకున్న ములుగు సబ్ కలెక్టర్ రెండు సార్లు ఆటోలో అక్కడికి వెళ్ళి ఆకస్మిక తనిఖీ చేశారు. సబ్ కలెక్టర్ రాకను గమనించిన రీచ్ నిర్వాహకులు అక్కడి నుంచి పరారయ్యారు.



రీచ్ సీజ్ చేయడంతో ఆగిపోయిన లారీలు

రక్ష నవతెలంగాణ

ఎసిడిటీకి విరుగుడు



ఎసిడిటీ ఏర్పడటానికి అనేక కారణాలుంటాయి. అధికంగా మసాలా తిండి, అతి ఆహారం వంటివి కొంత మేర ఎసిడిటీ తెస్తాయి. ఎసిడిటీ విరుగుడుగా ఎన్నోరకాల మందులు ఉన్నాయి. అయినా సహజ మార్గాలను ఎంచుకోవడమే మేలు.

- ఎసిడిటీ ఉంటే ఆహారంలో అరటిపండు తినండి. అది మంటను తగ్గించడంలో సహాయపడతుంది.
- మసాలాలు, వేపుడు కూరలు, ఊరగాయలు, చాక్లెట్లు వంటివాటికి దూరంగా ఉండండి.
- పచ్చి క్యాబేజి, పచ్చి ఉల్లి, రాడిష్, మిరియాలు వంటివి తినొద్దు. వాటి వల్ల ఎసిడిటీ మరింత పెరుగుతుంది.
- పండని పండ్లు తీసుకోవడం పూర్తిగా తగ్గించాలి. పూర్తిగా పండిన యాపిల్ అసలే వద్దు.
- ఆహారాన్ని బాగా నమిలి మింగడం అలవాటు చేసుకోవాలి తప్ప బలవంతంగా తినొద్దు.
- హడావుడిగా ఆహారం తినే పద్ధతి మార్చుకోవాలి.
- భోజనానికీ భోజనానికీ మధ్య సమయం మరీ అధికంగా లేకుండా చూసుకోవడం మంచిది.
- నీటిని అధికంగా తీసుకోవడం చాలా మంచిది.
- రాత్రిపూట ఆహారం తీసుకునే సమయానికి, నిద్రపోయే సమయానికి మధ్య కనీసం రెండు గంటల సమయం ఉండేలా చూసుకోవాలి.
- సిగరెట్, మత్తు పానీయాల అలవాటు బాగా తగ్గించాలి. లేదా పూర్తిగా మానేయాలి.

ఉక్కిరిబిక్కిరి

న్యూమోనియా వస్తే అవస్థే



ఊపిరితిత్తుల్లో వచ్చే ఇన్‌ఫెక్షనే న్యూమోనియా. ఇది ఒక అంటువ్యాధి. ఒకరి నుంచి మరొకరికి ఇది వ్యాపిస్తుంది. న్యూమోకోకస్, హెచ్ ఇన్‌ఫ్లూయెంజా అనే బ్యాక్టీరియా వల్ల వ్యాపిస్తుంది. వాతావరణంలో ఉండే రకరకాల సూక్ష్మక్రిములు శరీరంలోకి ప్రవేశించి శ్వాసకోశాల్లో ఇబ్బందులు కలుగజేస్తాయి. శ్వాసనాళాల్లో ఇన్‌ఫెక్షన్ కారణంగా కొన్ని రకాల ద్రవాలతో శ్వాసకోశాలు నిండిపోతాయి. ఈ ద్రవాల కారణంగా శ్వాసకోశాలు తమ విధులను సక్రమంగా నిర్వర్తించ లేవు. దీంతో శరీరానికి అందాల్సిన ఆక్సీజన్ సరిగ్గా అందదు. దీంతో కొన్ని సమస్యలు తలెత్తుతాయి. శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటుంది. ఊపిరితిత్తుల్లో నీరు లేక కళ్లె చేరడంతోపాటు శ్వాసగ్రంథులు మూసుకుపోతాయి. ఫలితంగా ఊపిరి తీసుకోవడం చాలా కష్టంగా ఉంటుంది. దీని వల్ల శ్వాస కండరాలు దెబ్బతినే అవకాశాలు ఉంటాయి. ఎటైపికల్ ఆర్గానిజమ్స్ వల్ల కూడా ఇది రావొచ్చు. సరైన పోషకాహారం అందకపోవడం వల్ల పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి అంతగా ఉండదు. దీంతో న్యూమోనియా వైరస్ వారిలోకి వేగంగా ప్రవేశిస్తుంది. మధుమేహం, మూత్రపిండాల సమస్యలు, గుండె జబ్బులు, లివర్ సిర్రోసిస్ ఉన్నవారిలో న్యూమోనియా త్వరగా వస్తుంది.

న్యూమోనియా బారిన పడ్డవారిలో ఆయాసం ఎక్కువగా కనిపిస్తుంది. చల్లగాలి తగిలినా, చల్లని పదార్థాలు తీసుకున్నా సమస్య తీవ్రరూపం దాల్చుతుంది. ఈ వ్యాధి సాధారణంగా వర్షాకాలం, శీతాకాలంలో ప్రబలుతుంది. కొంతమందికి ఆస్తమా తీవ్రరూపం దాల్చి న్యూమోనియాగా మారుతుంది. ఇది ఏ వయసు వారికైనా రావచ్చు. ఎక్కువగా పిల్లలు, వృద్ధులు దీని బారిన పడతారు.

రకాలు

న్యూమోనియాలో కమ్యూనిటీ ఎక్వైర్డ్ న్యూమోనియా, హాస్పిటల్ ఎక్వైర్డ్ న్యూమోనియా, హెల్త్‌కేర్ అసోసియేటెడ్, వెంటిలేటర్ అసోసియేటెడ్ అనే రకాలు ఉన్నాయి. సాధారణంగా వచ్చేది కమ్యూనిటీ ఎక్వైర్డ్ న్యూమోనియా. హాస్పిటల్‌లో ఉండగా న్యూమోనియా వస్తే దాన్ని హాస్పిటల్ ఎక్వైర్డ్ అని, దీర్ఘకాలిక వ్యాధులు ఉండి లేదా మరే ఇతర కారణాల వల్ల లేదా ఇంటి దగ్గర లేదా హాస్పిటల్‌లో లేదా నర్సింగ్‌కేర్ ఉన్నా న్యూమోనియా వస్తే దాన్ని హెల్త్‌కేర్ అసోసియేటెడ్ న్యూమోనియా అని అంటారు. ఇవన్నీ సీరియస్ న్యూమోనియాలే. వీటిలో డ్రగ్ రెసిస్టెన్స్ కూడా ఎక్కువగా ఉండొచ్చు.

లక్షణాలు

- ✓ ఆకలి బాగా తగ్గిపోతుంది.
- ✓ చలితో కూడిన జ్వరం వస్తుంది.
- ✓ బాగా నీరసంగా ఉంటారు.
- ✓ దగ్గు విపరీతంగా ఉంటుంది. దగ్గులో కళ్లే, ఒక్కోసారి రక్తం పడుతుంది.
- ✓ ఆయాసం, ఛాతీలో నొప్పిలాంటి లక్షణాలు కనిపిస్తాయి.
- ✓ కొందరిలో ఊపిరితిత్తుల చుట్టూ నీరు లేదా చీము చేరుతుంది.
- ✓ శ్వాసకోశాల్లో ద్రవాలు ఎక్కువగా చేరడంతో ఊపిరి తీసుకోవడం కష్టంగా మారుతుంది.

నిర్ధారణ-చికిత్స

రక్తపరీక్షలు, కళ్లె పరీక్షలు, ఛాతీ ఎక్స్‌రే తీసి న్యూమోనియా నిర్ధారిస్తారు. న్యూమోనియా అని నిర్ధారణ అయిన తర్వాత ఎంత తొందరగా యాంటీ బయోటిక్ మందులు వాడటం ప్రారంభిస్తే అంత త్వరగా కొలు కునే అవకాశం ఉం టుంది. మందులు అన్ని రకాల సూక్ష్మక్రిములను చంపే విధంగా ఉండాలి. చుట్టుపక్కల ప్రాంతాలలో క్రిములకి డ్రగ్ రెసిస్టెన్స్ ఎంత ఉందనే విషయం కూడా పరిగణనలోని తీసుకోవాలి. సరైన మోతాదులో మందులు వాడకపోతే.. జబ్బు ముదిరే ప్రమాదం ఉంది.

పిల్లలు జర జాగ్రత్త

- ✓ జనం గుంపులుగా ఉండే చోట్లకు పిల్లలను తీసుకెళ్లొద్దు.
- ✓ చల్ల గాలి తగలకుండా చూసుకోవాలి.
- ✓ ఉప్పు నీళ్లను తాగించాలి.
- ✓ చల్లగా ఉండే ఆహార పదార్థాలను పెట్టకూడదు.
- ✓ తుమ్ము, దగ్గు వచ్చినప్పుడు పిల్లలకు దూరంగా ఉండాలి.
- ✓ జ్యూస్‌ల వంటి చల్లని ద్రవాలను తాగించకూడదు.
- ✓ పొగ తాగే వాళ్లకు దూరంగా ఉంచాలి.
- ✓ ఆరేళ్ల వరకు పిల్లలకు తల్లి పాలు ఇవ్వడం ఉత్తమం.
- ✓ ఇంటి పరి సరాలు శుభ్రంగా ఉండేలా చూసుకో వాలి.
- ✓ పిల్లలను ఎత్తుకునే ముందు, వారికి ఆహారం తినిపించేటప్పుడు చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.

సరైన వైద్యం పొందాలి

వైద్య పరీక్షల్లో న్యూమోనియా అని నిర్ధారణ అయిన తర్వాత తగిన మోతాదులో యాంటీబయోటిక్స్ వాడాలి. వీటిని సరైన మోతాదులో వాడకపోతే వ్యాధి మరింత పెరిగే ప్రమాదం ఉంటుంది.



అరవై సంవత్సరాలపై బడిన వారిలో రెండు ఊపిరితిత్తులకు న్యూమోనియా వచ్చినా, బిపీ తక్కువగా ఉన్నా, మూత్రపిండాలు దెబ్బ తిన్నా సీరియస్ న్యూమోనియా అంటారు. ఇలాంటి వారిని ఐసీయూలో చేర్చి చికిత్స చేయాలి. కొందరిలో ఊపిరి తీసుకునే కండరాలు ఫెయిల్ అవుతాయి. లేదా ఏఆర్‌బీఎస్(ఎక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రస్ సిండ్రోమ్) అనే ప్రమాదకరమైన స్థాయికి చేరుకుంటుంది. అలాంటి వారిని వెంటిలేటర్ పై ఉంచి కోలుకునే వరకు కృత్రిమ శ్వాస అందించాల్సి ఉంటుంది. ఈ జబ్బు ముదిరితే చికిత్స కష్టం కావడంతో పాటు ఖర్చు కూడా పెరుగుతుంది. ఒక్కోసారి ప్రాణాలను ప్రమాదం సంభవించొచ్చు. చలిజర్వం, దగ్గు, ఛాతీలో నొప్పి తదితర లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే పల్మోనాలజిస్ట్‌ను సంప్రదించి మందులు వాడితే త్వరగా జబ్బు నయమవుతుంది.

- డాక్టర్ సునంద, పల్మోనాలోజిస్ట్

తెలుసుకుందాం

ప్రతి నొప్పి గుండెపోటు కాదు...



గుండె దడ అనేది చాలా మందిలో ఉండే రుగ్మత. ఛాతీ నొప్పిని కూడా చాలా మంది ఎదుర్కొంటారు. అంత మాత్రాన గుండె జబ్బు అనుకోవద్దు. దీనికి అనేక కారణాలు ఉంటాయి. అలాగని ఈ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం కూడా చేయొద్దు. ముందుగా వైద్యుడిని సంప్రదించి జబ్బు ఏమిటో నిర్ధారించుకోవాలి. గుండె సమస్య అయితే తగిన చికిత్స చేయించుకోవాలి.

ఎలాంటి వారికి గుండె జబ్బు వస్తుంది?

డయాబెటిస్, అధిక రక్తపోటు, హైకొలెస్ట్రాల్ ఉన్న వారిలో గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువ. ఈ జబ్బులతో బాధపడుతున్న వారు అనారోగ్యకరమైన జీవన విధానాన్ని పాటించాలి. ఇటీవల కాలంలో యువకుల్లో సైతం గుండె జబ్బులు కనిపిస్తున్నాయి. స్మోకింగ్, మానసిక ఒత్తిడి, ఆహారపు అలవాట్లు ఇందుకు ప్రధాన కారణమని చెప్పొచ్చు.

వ్యాధి లక్షణాలు

కొద్ది దూరం నడవగానే ఆయాసం, ఛాతీ ఒక్కోసారి పట్టేసినట్టుగా ఉండటం, చెమట ఎక్కువగా పడుతుండటం, శ్వాస తీసుకోవడం లో ఇబ్బంది పడుతుండటం లాంటి లక్షణాలను గుండె జబ్బుగా అనుమానించాల్సిందే. అయితే... ఈ లక్షణాలు ఉన్నంత మాత్రాన గుండె జబ్బు ఉందని అనుకోవద్దు. దీనిని నిర్ధారించుకోవడానికి తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలి.

క్రమంగా చెకప్ చేయించుకోవాలి..

నలభై ఏండ్లు దాటిన వారు రెగ్యులర్‌గా గుండెకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలి. దీని ద్వారా ముందస్తుగా జాగ్రత్త పడొచ్చు. ఈసీజీ, 2డీ ఎకో, కొలెస్టరాల్, టీఎంటీ పరీక్షల ద్వారా గుండె పనితీరు, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉందా అనే విషయాన్ని తెలుసుకోవచ్చు. ఈ పరీక్షల ద్వారా జబ్బులను ప్రాథమిక దశలో గుర్తించి, చికిత్స తీసుకోవడం ద్వారా సమస్య తీవ్రం కాకుండా చూసుకోవచ్చు.

గుండె జబ్బు అంటే...

పరీక్షల ద్వారా గుండె జబ్బు ఉందని తేలితే మరికొన్ని పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. సమస్య ఎక్కువగా ఉందా.. ఎన్ని చోట్ల రక్తనాళాల్లో అడ్డంకులు ఉన్నాయి? తదితర విషయాలు తెలుసుకోవడానికి యాంజియోగ్రామ్ పరీక్ష అవసరమవుతుంది. ఒకటి లేక రెండు బ్లాక్‌లు ఉన్నట్లయితే యాంజియోప్లాస్టి చికిత్స ద్వారా సమస్యను తొలగించుకోవచ్చు. మూడు లేక అంతకంటే ఎక్కువ బ్లాకులు ఉన్నా గుండెకు వెళ్లే ప్రధాన రక్తనాళం (ఎల్‌ఎంసీఏ)లో సమస్య ఉన్నట్లయితే బైపాస్ సర్జరీ అవసరమవుతుంది. ప్రస్తుతం ఔషధ పూరిత స్టెంట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఉపయోగించినట్లయితే స్టెంటుల్లో మళ్లీ బ్లాక్‌లు ఏర్పడకుండా ఉంటాయి. స్టెంట్లు వేసినా, బైపాస్ సర్జరీ జరిగినా మళ్లీ గుండె సమస్య తలెత్తకుండా ఉండటానికి తగిన మందులు వాడటం చాలా అవసరం. కొందరు ఆపరేషన్ జరిగింది కదా.. మందులు ఆపేస్తుంటారు. ఇది సరికాదు. రెగ్యులర్‌గా మందులు వాడుతూ డైట్ కంట్రోల్ చేస్తుండాలి. వ్యాయామం చేయడం మరువొద్దు.

ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

ఆరోగ్యానికి నడక చాలా మంచిది. రోజూ అరగంటపాటు నడక తప్పనిసరి చేసుకోవడం వల్ల గుండె జబ్బులకు దూరంగా ఉండొచ్చు. అలాగే కొలెస్టరాల్ తక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం, ఉప్పు వాడకాన్ని తగ్గించడం, వేపుళ్లకు దూరంగా ఉండటం అవసరం. పండ్లు ఎక్కువగా తీసుకోవాలి. ఈ జాగ్రత్తలు తీసుకున్నట్లయితే మీ గుండె పది కాలాలపాటు పదిలంగా ఉంటుంది.

అప్రమత్తత అవసరం

చిన్న వయసులోనే గుండెపోటుకు గురైన వారస్తత్వ చరిత్ర ఉన్న వారు ఎప్పటికప్పుడు కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకోవాలి. కొలెస్ట్రాల్‌ను నియంత్రించే చర్యలు చేపట్టాలి. కొలెస్ట్రాల్ పెరగడమంటే ఆ వ్యక్తి లావుగా ఉన్నాడా.. సన్నగా ఉన్నాడా అనేది ముఖ్యం కాదు. లావుగా ఉన్న వారిలో కొలెస్ట్రాల్ నార్మల్‌గానే ఉండొచ్చు. సన్నగా ఉన్న వారిలో చాలా ఎక్కువగానూ ఉండొచ్చు. అవన్నీ రక్త పరీక్షల్లో తేలవాల్సిందే తప్ప శరీరం బరువు ఆధారంగా మాత్రం కాదు.

అయితే... లావుగా ఉన్న వారిలో ఎక్కువ మందికి ఈ సమస్య ఉండొచ్చు. కుటుంబ చరిత్ర ఉన్న వారు చిన్న వయస్సు నుంచే కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకుంటూ ఉండటం చాలా ముఖ్యం. తీవ్రతను అనుసరించి ఆహార నియమాలు పాటించడం గానీ, కొన్ని మందులు వేసుకోవడం ద్వారా గానీ కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచొచ్చు. అలాగే గుండెపోటు రావడానికి మధుమేహం ఒ క ప్రధాన కారణం. అందుకే ఆ సమస్య ఉన్న వారు వ్యాధిని పూర్తి నియంత్రణలో ఉంచుకోవడం తప్పనిసరి. మందులు క్రమం తప్పకుండా వాడుతూ ఉండాలి. కనీసం ప్రతి మూడు నెలలకోసారి డాక్టర్‌ను సంప్రదిస్తూ ఉంటే ఈ సమస్య నుంచి సురక్షితంగా బయటపడొచ్చు.

నిజానికి పురుషులతో పోలిస్తే మహిళల్లో గుండె పోటు తక్కువ. అయితే... మద్య వయసు వచ్చాక పురుషులతో సమానంగానే వీరూ గుండె పోట్లకు గురవుతున్నారు. సహజంగా మహిళల్లో ఉండే ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్ల వల్ల రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ నిలిపోవడం అన్నది చాలా తక్కువ. కాకపోతే.. మెనోపాజ్ తర్వాత మాత్రం పరిస్థితి మారిపోతుంది. దీనికి తోడు గర్భాశయాన్నీ, అండాశయాన్ని కూడా తొలిగించే వారిలో పురుషులకు సమానం గానే గుండెపోటు వస్తుంది. అలా అని హార్మోన్ సప్లిమెంట్లు ఇవ్వడం ద్వారా ఈ స్థితిని అరికట్టలేం. గుండె రక్తనాళాల్లో కొలెస్ట్రాల్ పేరుకుపోవడం పెను ముప్పే. గుండె కండరానికి అవసరమైన రక్తం అందదు. ఈ పేరుకుపోవడం అన్నది నిదానంగా జరిగితే ఆ లక్షణాలు కూడా అంతే నిదానంగా కనిపిస్తాయి. అలా కాకుండా ఏ కారణంగానైనా ఒక్కోసారి ఈ కొలెస్ట్రాల్ చిట్లిపోవచ్చు. సరిగ్గా అదే సమయంలో రక్తం గడ్డకట్టి నాళం పూర్తిగా మూసుకుపోతుంది. అప్పటి దాకా ఏ 70 శాతమో ఉన్న ఆటంకం క్షణాల్లో నూరు శాతంగా మారిపోతుంది. ఆ వెంటనే గుండె పోటు వచ్చేస్తుంది. గుండె వేగం విపరీతంగా పెరిగిపోయి ఆ తర్వాత చాలా మందిలో గుండె కొట్టుకోవడం ఆగిపోతుంది. ఈ స్థితి ఏర్పడిన వారిలో సుమారు 50 శాతం మంది ప్రాణాలు కోల్పోవచ్చు. కొలెస్ట్రాల్ చితకడానికి కారణాలు పూర్తిగా తెలియకపోయినా శారీరక, మానసిక ఒత్తిళ్లు ప్రధాన కారణంగా ఉంటున్నాయి. అందుకే.. కొవ్వు పదార్థాలు ఉండే ఆహారాన్ని బాగా తగ్గించుకోవాలి. పొగతాగడం కానీ, పొగాకు సంబంధిత వస్తువులు వాడటం గానీ పూర్తిగా మానుకోవడం ముఖ్యం.

వయసు పెరుగుతుందనే ఆందోళన వద్దు



'అరవై దాటాయి.. వయసు మీద పడింది. ఇక కాళ్లూ చేతులు ఆడించే శక్తి మాలో ఎక్కడిది!' అని చాలామంది వృద్ధులు మానసిక స్థైర్యాన్ని కోల్పోతుంటారు. ఎక్కడికైనా వెళ్లాలన్నా, ఏదైనా పనిచేయాలన్నా చేతకావడం లేదని అనేస్తారు. ఇది సరికాదంటున్నారు పరిశో ధకులు. వయసు పెరుగుతోందనే విషయాన్ని పూర్తిగా మరచిపోతే ఆయుష్షు మరింత పెరుగుతుందని అంటున్నారు. వృద్ధాప్యంలో శక్తికి తగ్గట్టు పనులు చేసుకుంటూ పోతే గుండెకు బలం చేకూరుతుందని, తద్వారా మరికొన్నేళ్లు ఆరోగ్యంగా బతకగలుగుతారని యూనివర్సిటీ ఆఫ్ పీటర్స్‌బర్గ్ చేపట్టిన అధ్యయనంలో వెల్లడైంది. కొద్ది సేపు బయటికి వెళ్లి రావడం, చిన్న చిన్న ఇంటి పనులు చేయడం వల్ల తాము వృద్ధాప్యంలో ఉన్నారనే విషయాన్ని మరచిపోతారని చెబుతున్నారు. మెట్లెక్కి దిగడం, దుస్తులు ఉతకడం, డ్యాన్స్ చేయడం, నడవడం వంటివి గుండెపోటు నుంచి వృద్ధులను చాలామటుకు కాపాడుతాయని అంటున్నారు. తాము వృద్ధులైపోయామనే ఆందోళనను దరిచేరనివ్వొద్దని, దీంతో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని సూచిస్తున్నారు.

కీమో మందులతో క్యాన్సర్ వ్యాప్తి!



కీమోథెరపీ అంటే క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల్లో అసాధారణ కణాలను తొలిగించే చికిత్స. ఇది దుష్ప్రభావాలు చూపిస్తుందని, ఇతర ఆరోగ్య సమస్యలు తెచ్చిపెడుతుందని ఇది వరకే పలు అధ్యయాల్లో తేలింది. తాజాగా మారో విషయం వెలుగులోకి విచ్చింది. కీమోథెరపీ మందుల వల్ల క్యాన్సర్ తీవ్రత తగ్గడమేమో కానీ, ఇది మరింత పెరుగుతుందని వెల్లడైంది. కోలంబస్‌లోని ఓహియో స్టేట్ యూనివర్సిటీ చేపట్టిన అధ్యయనంలో ఈ విషయం తేలింది. కీమోథెరపీకి వాడే సాధారణ మందుల ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్ కణాలు మరింత ఉత్తేజమై ఊపిరితిత్తుల్లోకి చేరుతాయని పరిశోధకులు గుర్తించారు.

నిద్ర సరిగా లేకపోతే అనర్థమే!



ఆధునిక మానవ జీవితంలో విశ్రాంతికి ప్రధాన్యత తగ్గింది. కంటి నిండా నిద్ర పోయేందుకు కూడా చాలా మందికి సమయం ఉండటంలేదు. అయితే.. ఇది ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదంటున్నారు పరిశోధకులు. సరిగా నిద్ర లేకపోతే జీవక్రియ వ్యాధుల(మెటబాలిక్ డిసీజెస్)కు గురికావాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఇంగ్లండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ లీడ్స్ చేసిన అధ్యయనంలో వెల్లడైన పలు అంశాలు ఆందోళన కలిగి స్తున్నాయి. 1,615 మందిని పరిశోధించగా సరైన నిద్రలేని వారు బ్లడ్‌షుగర్, బ్లడ్‌ప్రెషర్, బ్లడ్ కొలెస్ట్రాల్, థైరాయిడ్ లాంటి రుగ్మతలతో అత్యధుకులు బాధపడుతున్నట్టు గుర్తించారు. వీరంతా ఆరు గంటలకు మించి నిద్రపోని వారే. వీరు స్థూలకాయ సమస్యను కూగా ఎదుర్కొంటున్నారని పరిశోధకులు గుర్తించారు.

చక్కెర ఎక్కువ తీసుకుంటే...



అదే పనిగా తీపి పదార్థాలు తింటున్నారా? జర జాగ్రత్త! ముఖ్యంగా పురుషులు చాలా అప్రమత్తంగా ఉండాలి. చక్కెర ఎక్కువ వాడితే బుద్ధి మాంధ్యం, మానసిక ఆందోళన లాంటి సమస్యలు ఎదుర్కొవాల్సి వస్తుంది. నమ్మలేకపోతున్నారా..? ఇది నిజం. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లండన్ చేసిన అధ్యయనంలో ఇది వెల్లడైంది. తీపి పదార్థాలు ఎక్కువగా తీసుకుంటే డయాబెటిస్‌తోపాటు అధిక కొలెస్ట్రాల్, ఒబెసిటి, గుండె సంబంధిత వ్యాధులకు గురవుతారని ఇది వరకే అనేక అధ్యయాలు చెప్పాయి. తాజాగా తేలిందేమిటంటే.. చక్కెర అధికంగా వాడితే బుద్ధిమాంధ్యం, మానసిక ఆందోళన సమస్యలు ఉత్పన్నం కావడానికి 23 శాతం అవకాశం ఉంది. 22 ఏండ్ల కన్నా ఎక్కువ వయసు ఉన్న 8 వేల మందిని పరిశీలించగా ఈ విషయం వెల్లడైంది.




భారత్ షట్లర్ల హవా

బిడబ్ల్యుఎఫ్ టాప్-100లో 12 మంది షట్లర్లు

న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ర్యాంకులో భారత షట్లర్లు తమ హవాను కొనసాగిస్తున్నారు. ఇటీవల కాలంలో పలు టోర్నీల్లో సత్తా చాటి అనూహ్యంగా ర్యాంకులను మెరుగుపర్చుకున్నారు. పురుషుల విభాగంలో కిడాంబి శ్రీకాంత్‌లో టాప్ టెన్‌లోను, హెచ్‌ఎస్ ప్రణయ్ టాప్ -20లో నిలబడ్డారు. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్ నుంచి 12 మంది షట్లర్లు టాప్-100లో చోటు దక్కించుకున్నారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా సూపర్ సిరిస్ విజయాలతో తెలుగు తేజం కిడాంబి శ్రీకాంత్ టాప్ టెన్‌లో చేరుకోవడం విశేషం. కిడాంబి శ్రీకాంత్(8వ ర్యాంకు), ప్రణయ్(15), అజయ్ జయరామ్ (19), సమీర్ వర్మ (29), సౌరభ్ వర్మ (32), పారుపల్లి కశ్యప్(46), సుభాంకర్ దేవ్ (73), అభిషేక్ యెల్గర్ (81), ఆనంద్ పవార్ (95), సిరిల్ వర్మ(97) ర్యాంకుల్లో నిలిచారు. మహిళల పరంగా ఒలింపిక్ రజత పతక విజేత పివి సింధు నాలుగో ర్యాంకులోను, కాంస్య పతక విజేత సైనా 12 ర్యాంకులోను కొనసాగుతున్నారు.



ఆస్ట్రేలియా ఫీల్డింగ్ కోచ్‌గా హాడిన్

సిడ్నీ: ఆస్ట్రేలియా జట్టుకు కొత్త ఫీల్డింగ్ కోచ్‌గా బ్రాడ్ హాడిన్ ఆ దేశ బోర్డు గురువారం నియమించింది. మాజీ వికెట్ కీపర్ హాడిన్ ఈ పదవిలో 2019 వరకు కొనసాగనున్నాడు. వెటరన్ హాడిన్ 66 టెస్ట్‌ల్లోను, 124 వన్డేలోను జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. గ్రెగ్ బ్లెవెట్ వైదొలగడంతో కొత్త కోచ్‌గా హాడిన్ నియా మకం ఖరారు చేశారు. బంగ్లాదేశ్ పర్యటనకు ఆస్ట్రేలియా హాడిన్‌తో వెళ్లనుంది. అక్కడ రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడిన తర్వాత ఇండియా టూర్‌కు వెళ్లనుంది. వన్డే, టి 20 సిరీస్‌ల్లో భారత్ తలపడ్డాక, ఇంగ్లాండ్‌తో యాపెస్ సిరీస్‌లో తలపడనుంది.

మహిళా క్రికెటర్లు...అదుర్స్

ఉమెన్ ప్రపంచకప్ ప్రసారాలు సూపర్ హిట్

షార్జా: ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్-2017 సూపర్ హిట్టయ్యింది. అమ్మాయిల ఆటకు వెబ్, టీవీ, ప్రింట్, సోషల్ మీడియాల్లో అభిమానులు బ్రహ్మరథం పట్టారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ టోర్నీని 18 కోట్ల మందికిపైగా వీక్షించారని ఐసీసీ గురువారం ప్రకటించింది. ఫైనల్లో ఇంగ్లాండ్ చేతిలో తొమ్మిది పరుగుల తేడాతో పోరాడి ఓడిన మిథాలీసేన రన్నరప్‌గా నిలిచిన విషయం విదితమే.

భారతీయుల ఆదరణ: గతంలో ఎప్పుడూ లేనివిధంగా భారత్‌లో 15.6 కోట్ల మంది మహిళల ప్రపంచకప్ ప్రసారాలు వీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎనిమిది కోట్ల మంది చూడగా ఒక్క ఫైనల్ పోరునే 12.6 కోట్ల మంది వీక్షించడం విశేషం. మిథాలీసేన అద్భుత ప్రదర్శనలు చేయడంతో భారత్‌లో వీక్షణ గంటలు కూడా 500 శాతం పెరిగాయి. 2013 టోర్నీతో పోలిస్తే ప్రపంచ వ్యాప్తంగా ఇది 300 శాతం పెరిగిందని ఐసీసీ వెల్లడించింది.

సోషల్ మీడియాలో దూకుడు: సామాజిక మాధ్యమాల్లో మహిళల ప్రపంచకప్ హవా కొనసాగించింది. ఐసీసీ డిజిటల్ వేదికల్లో 10 కోట్ల వీడియో వీక్షణలు నమోదయ్యాయి. సోషల్ మీడియా ఛానళ్లలో వంద కోట్ల ఇంప్రెషన్స్ రాగా ఫేస్‌బుక్ పోస్టుల్ని 6.7 కోట్ల యునిక్ యూజర్స్ చూశారు.

మిథాలీసేనకు మీడియా సపోర్టు..: ప్రపంచకప్ గురించి 100 దేశాల్లో వెబ్, ప్రింట్ మీడియాలో 50,000 కథనాలు వచ్చాయి. భారత్ 16,000 కథనాలతో అందరి కన్నా ముందు వరుసలో నిలిచింది. బ్రిటన్ 14,000, ఆస్ట్రేలియా 9,000తో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అమెరికాలో 4,700, దక్షిణాఫ్రికా లో 1368 కథనాలు ప్రచురితం కావటం గమనార్హం.





రేపట్నుంచి మూడో టెస్ట్

క్లీన్‌స్వీప్‌పై విరాట్ సేన గురి

● శ్రీలంకకు గాయాల బెడద ● బరిలో కొత్త పేసర్లు చమీరా, గామేజ్

కాండీ: స్వదేశంలో టెస్ట్ సిరీస్ కోల్పోయిన శ్రీలంక జట్టు మూడో టెస్ట్‌లోనైనా గెలిచి పరువు దక్కించుకోవాలని చూస్తోంది. తొలి టెస్ట్‌కు ముందే నుంచి శ్రీలంకను గాయాల బెడద తీవ్ర కలవరానికి గురి చేసింది. గాలె టెస్ట్‌కు కెప్టెన్ చండీమాల్ దూరం కాగా హెరాత్ సారథ్యం వహించాడు. రెండో టెస్ట్‌లో ధనుంజయ డిసిల్వాను తీసుకున్నారు. కాగా పల్లెకలెలో ఈ నెల 12 నుంచి జరిగే మూడో టెస్ట్‌కు గాయాల కారణంగా బౌలర్లు కంగనా హెరాత్, నువాన్ ప్రదీప్ , దనుష్క గుణతిలకేలు దూరం అయ్యారు. దీంతో వారి స్థానాల్లో ఫాస్ట్ బౌలర్లుగా దుష్మంత చమీరాతో పాటు ఇంత వరకు ఒక్క టెస్ట్ ఆడని లాహిరు గామేజ్ టెస్ట్‌ల్లో అరంగ్రేటం చేయనున్నాడు. ఈ ఇద్దరి ఫాస్ట్ బౌలర్లతో భారత్ భారీ స్కోర్‌కు చెక్ పెట్టాలని లంకేయలు యోచిస్తున్నారు. చివరి టెస్ట్‌లో భారత్ బ్యాట్స్‌మెన్ నిలువరించేందుకు చండీమాల్ బౌలర్లను ఏ విధంగా ఉపయోగిస్తాడన్నది ఆసక్తి కరంగా మారింది. ఇదిలా ఉండగా రెండు టెస్ట్‌ల్లోను 600ల పైచిలుకు పరుగుల సాధనతో పాటు, బౌలర్లు తడఖాతో విరాట్ సేన విజయాల మోత మోగించింది. దీంతో మూడో టెస్ట్‌లోను జయభేరి మోగించి సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాలని భావిస్తున్నాడు. ఓపెనర్లు, మిడిల్ ఆర్డర్‌లోను బ్యాటింగ్‌లో ఫుల్ జోరుమీద భారత బ్యాట్స్‌మెన్ ఉండటంతో బౌలింగ్ విభాగం రెట్టించిన ఉత్సాహంతో మూడో టెస్ట్‌కు సిద్ధమైంది. తొలి రెండు టెస్ట్‌లను భారత్ నాలుగో రోజే ముగించి తన హవాను చాటింది.

శ్రీలంక జట్టు సైన్యం ఇదే.. దినేష్ చండీమాల్ (కెప్టెన్), అంగోలా మ్యాథ్యూస్, ఉపుల్ తరంగ, డిముచ్ కరుణ రత్నే, నిరోషాన్ డిక్వెల్లా(కీపర్), కుశాల్ మెండీస్, ధనుంజయ డిసిల్వా, లాహిరు తిరుమాన్నే, లాహిరు కుమార, విష్వా ఫెర్నాండో, దుష్మంత చమీరా, లాహిరు గేమేజ్, దిల్రువాన్ ఫెరీరా, మలింద పుష్ప కుమార, లక్షణ్ సందకన్.

'భావ ప్రకటన' లేకుండా.. బంగారు తెలంగాణ ఎలా సాధ్యం..?

మీడియాపట్ల మీ వైఖరి సమాజానికి మంచిది కాదు



సీఎం కేసీఆర్‌కు జర్నలిస్టుల సంఘాల హితవు

- నవతెలంగాణపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి
- దాడులపై ఐక్య ప్రతిఘటన అవసరం: వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పత్రికలు, మీడియాపట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ అనుసరిస్తున్న వైఖరిని పలు జర్నలిస్టు సంఘాలు, సీనియర్ పాత్రికేయులు, మేధావులు, కార్మిక, మహిళా సంఘాల నేతలు తీవ్రంగా తప్పుబట్టారు. ఆయన తన వ్యాఖ్యల్ని తక్షణం ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. భావ ప్రకటన స్వేచ్ఛను, పత్రికా స్వాతంత్ర్యాన్ని హరించే విధంగా సీఎం వ్యాఖ్యానించటం తెలంగాణ సమాజానికి మంచిది కాదని హితవు పలికారు. భావప్రకటన స్వేచ్ఛ లేకుండా బంగారు తెలంగాణ సాధ్యం కాదని సూచించారు. ప్రజల గొంతుక నవతెలంగాణ పత్రికపై అక్కసుతో మాట్లాడిన సీఎం.. ఆ పత్రికలో రాసిన వార్తల్లో తప్పులేమున్నాయో చెప్పకుండా ఇష్టానుసారంగా తూలనాడటం సహేతుకం కాదని చెప్పారు. ముఖ్యమంత్రి స్థాయిలో మాట్లాడాల్సిన మాటలు కావని వారు నిలదీశారు. 'మీడియా, జర్నలిస్టులు - ప్రభుత్వ వైఖరి' అనే అంశంపై గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు పలు తీర్మానాలు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ 'నవతెలంగాణ' పత్రికను ఉద్దేశించి తూలనాడుతూ చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం క్యాంపు కార్యాలయం వద్ద కవరేజీ కోసం వెళ్లిన టీవీ5, వీ6, టెన్‌టీవీ రిపోర్టర్లు, కెమెరామెన్లపై దాడి చేసిన పంజాగుట్ట ఏసీపీ వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎలాంటి వివక్ష లేకుండా ప్రభుత్వ ప్రకటనలను అన్ని పత్రికలను విడుదల చేయాలని వారు తీర్మానించారు. ఈ సమావేశంలో పలువురు సీనియర్ జర్నలిస్టులతో పాటు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ రమ, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు మాణిక్‌ప్రభు, సలీమా, హెచ్‌యూజే ప్రధాన కార్యదర్శి పద్మరాజు, కార్యదర్శి గండ్ర నవీన్, విజయానంద్, యాదయ్య, నాగవాణి తదితరులు పాల్గొన్నారు.

డబ్బా మీడియాతో ప్రభుత్వాలు నిలబడవు: కే శ్రీనివాస్‌రెడ్డి, మనతెలంగాణ సంపాదకులు



లోపాలను ఎత్తిచూపకుండా డబ్బా కొట్టే మీడియాతో ఎంతకాలం ప్రభుత్వం మనగలుగుతుంది.? పత్రికల పట్ల సీఎం చేసిన వ్యాఖ్యలను అందరూ ఖండిస్తున్నారు. ఇలాంటి తెలంగాణను ఎవ్వరూ కోరుకోలేదు. మూడేండ్ల పాలనపూర్తయిన తర్వాత పాలకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరడం తప్పుకాదు. సమావేశాల్లోకి కూడా మీడియాను రానివ్వడం లేదు. పీఆర్‌ఓలు పంపిన వార్తలే రాయాల్సిన దుస్థితి ఏర్పడింది. సౌకర్యాలు ఇస్తున్నాం కాబట్టి జర్నలిస్టులు సర్కారుకు వ్యతిరేకంగా వార్తలు రాయొద్దని చెబితే, రాయరని భావించడం భ్రమే. ఇలాగే దాడులు కొనసాగితే ప్రజాస్వామ్య స్వేచ్ఛప్రియులు సర్కారుకు తగిన బుద్ధిచెబుతారు.

సీఎం స్థాయికి తగిన వ్యాఖ్యలు కావు: దేవులపల్లి అమర్, ఐజేయూ సెక్రటరీ జనరల్



'అదో పత్రిక, నేను చదవాలా..ఆ పత్రిక అవసరమా' అంటూ నవతెలంగాణ పత్రికపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు సీఎం స్థాయికి తగినవి కావు. జాతీయస్థాయిలోనూ మీడియాపై దాడి జరుగుతున్నది. ప్రస్తుతం కేంద్రంలోని పాలకపక్షానికి సీబీఐ, ఈడీ, ఐటీ మిత్రపక్షాలుగా మారాయి. గతంలో ముఖ్యమంత్రులు ప్రజలతో మమేకమయ్యేవారు. కానీ ప్రస్తుత సీఎం ఏనాడూ సచివాలయం వైపు చూడటం లేదు. మమ్మల్ని ఎవ్వరూ ఎదురించవద్దనే ధోరణిలో వామపక్షాలు, కాంగ్రెస్‌పై ఇటీవల సీఎం వ్యాఖ్యలు చేశారు. మీడియా యాజమాన్యాల్ని ప్రభుత్వాలు గుప్పిట్లో పెట్టుకున్నాయి. యాజమాన్యాలు, ప్రభుత్వాలు ఎలా ఉన్నా జర్నలిస్టులు ఐక్యంగా ఉండాలి. లారీలు తగలబెట్టారు కాబట్టి చితకబాదాం..అన్నట్టు సీఎం వ్యాఖ్యలు చేయడం సరికాదు.

దాడులకు సమైక్య ప్రతిఘటన అవసరం: ఎస్ వీరయ్య, నవతెలంగాణ సంపాదకులు



మీడియా తన బాధ్యతలు నిర్వహించకుండా, తన భజన చేయాలని సీఎం చెబుతున్నారు. ఇది చీము నెత్తురున్న ఏ జర్నలిస్టూ అంగీకరించరు. సీఎం నిజం చెబితే సహించేస్థితిలో లేరు. దీని ఫలితమే మీడియాపై దాడి. కొన్ని మీడియా సంస్థలను తన అదుపులో పెట్టుకున్నారు. ముఖ్య మంత్రికి మీడియాపై అసహనం ఇప్పటిది కాదు. గతంలో రెండు ఛానళ్లనూ నిషేధించారు. యాదగిరిగుట్టలో సీఎం పర్యటన సందర్భంగా జర్నలిస్టులను గదిలో వేసి నిర్బంధించారు. అప్పుడే మీడియా స్వేచ్ఛపై ప్రభుత్వానికి ఉన్న వైఖరి అర్థమైంది. పత్రికా ఆర్థికమూలాలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారు. తద్వారా మీడియాను నియం త్రించాలని భావిస్తున్నారు. పత్రికపేరు చెప్పి మరీ ముఖ్యమంత్రులు దూషించిన ఘటనలు ఏనాడూ లేదు. పోలీసుల్లో వచ్చిన మార్పువల్లే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో విజయం సాధించినట్టు సీఎం పలుమార్లు చెప్పారు. ప్రగతిభవన్ ముందు మీడియాపై జరిగిన దాడికి దీనికి ఓ సూచిక. మీడియాపై జరుగుతున్న దాడులను ఎదుర్కునేందుకు సమైక్య ప్రతిఘటన అవసరం.

ప్రజాఉద్యమాలపై దాడిలో భాగమే: వినయకుమార్, ట్ర7: శక్తి పూర్వ సంపాదకులు



ప్రజాఉద్యమాలపై దాడిలో భాగమే నవతెలంగాణపై సీఎం కేసీఆర్ వ్యాఖ్యలు. ఆ పత్రికను చదువం, చూడం అని సీఎం చెప్పారు. అసలు నవతెలంగాణ పత్రికే కాదు.. ఆయన ఏ పత్రిక కూడా చూడటం లేదని తేలిపోతున్నది. సమావేశాల్లో ప్రశ్నించిన జర్నలిస్టులపై ఎదురుదాడికి దిగుతున్నారు. మీడియా పట్ల అసహనం పెరుగుతోంది. సీఎంకు ఉండాల్సిన లక్షణం కాదిది. పెయిడ్ న్యూస్‌కు లొంగేవారే తనవారుగా సీఎం భావిస్తున్నారు. మీడియా స్వేచ్ఛకోసం ఐక్యంగా పోరాడాల్సిందే.

భావప్రకటన స్వేచ్ఛ లేకుండా బంగారు తెలంగాణా..?: తెలకపల్లి రవి, ప్రముఖ రాజకీయ) శేషకులు



రాష్ట్రంలో ఏకకాలంలో ప్రజాఉద్యమాలపై, మీడియాపై దాడి జరుగుతోంది. ఫాంహౌస్‌లో వేములఘాట్‌లో సీఎం రైతులతో మాట్లాడిన విషయం విషయాన్ని 'నవతెలంగాణ' మాత్రమే వెలుగులోకి తెచ్చింది. నాడు నిజాంనవాబులు ప్రజాశక్తితో పాటు మీడియాను నిషేధించారు.. ప్రస్తుతం అదే దారిలో కేసీఆర్ పయనిస్తున్నారు. సీఎం చేతుల మీదుగా ప్రారంభించిన పత్రికపై శాపనార్థాలు పెట్టడం సరికాదు. పత్రిక అవసరమా..? లేదా ? అనేది పాఠకులు తేల్చుకుంటారు. భావప్రకటనా స్వేచ్ఛ లేకుండా బంగారు తెలంగాణ తీసుకురావడం అసాధ్యం. కేసీఆర్ అధికారంలోకి రావడానికి జర్నలిస్టులు చాలా కృషి చేశారు. అలాంటి వారిపై అసహనంగా, అప్రజాస్వామికంగా వ్యవహరించడం సరికాదు.

మీడియాపైనే దాడి: రాంమూర్తి, టీఈజేఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



ఇటీవల ముఖ్యమంత్రి 'నవతెలంగాణ' పత్రిక చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. ఇవి బాధ్యతారాహిత్యమైనవి. ఇవి కేవలం ఒక పత్రికపైన చేసినవి కాదు.. మొత్తం మీడియాపైనే జరిగిన దాడి. వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడుకుంటూ, జర్నలిస్టులు పనిచేయాలి. ఈ పోరాటం ఇంతటితో ఆపకుండా కొనసాగించాలి. సీనియర్ జర్నలిస్టులు దీనిపై స్పందించాలి.

ముక్తకంఠంతో ఖండించాలి: వేణుగోపాల్, సీనియర్ జర్నలిస్టు



మీడియాపై, జర్నలిస్టులపై జరిగే దాడులను అందరూ ముక్తకంఠంతో ఖండించాలి. గతంలో వార్తలు తప్పుగా అనిపిస్తే ఆయా శాఖలు, మంత్రులు వివరణ ఇచ్చేవారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వం యాజమాన్యాలతో కుమ్ముక్కు కావడం కూడా జర్నలిస్టులపై నిర్బం ధం పెరగడానికి ఓ కారణం. గతంలో ఇన్ని దాడు లు లేవు. దాడులు జరిగితే వారిపై వెంటనే చర్యలుండేవి. ప్రభుత్వం ఈ మాత్రం సఖ్యంగా ఉందంటే అది పత్రికల ద్వారానే.

మీడియా జోలికి రావొద్దు: ఎం సోమయ్య, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు



చరిత్రలో ఇప్పటికీ ఏ ముఖ్యమంత్రి కూడా ఇంతఘోరంగా వ్యవహరించలేదు. జర్నలిస్టులపై ఇటీవల దాడులు పెరిగిపోయాయి. నవతెలంగాణతో పాటు గతంలో కొన్ని మీడియా సంస్థల్నీ నిర్బంధించారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజాస్వామ్యంలో ఇలాంటి తీరు సరికాదు. ప్రభుత్వాలు మీడియా జోలికి రావొద్దు.

ప్రపంచవ్యాప్తంగా మీడియాపై దాడులు: ఎం. కాడ్‌శుర్‌రావు, సీనియర్ జర్నలిస్టు



రాష్ట్రంలో, దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా మీడియాపై దాడులు జరుగుతున్నాయి. అమెరికా అధ్యక్షులు ట్రంప్ ఏకంగా జర్నలిస్టులను లేపేయండని చెప్పారు. ఢిల్లీ జేఎన్‌యూలోనూ దాడులు జరిగాయి. రాష్ట్రంలో తమ్మినేని యాత్రను అడ్డుకోమని చెప్పిన కేసీఆర్, భవిష్యత్‌లో మీడియాపై దాడి చేయించబోడు అనుకోవద్దు. యాజమాన్యాలు మద్దతిస్తాయా లేదా అనేది పక్కన పెట్టి, మన పోరాటం కొనసాగించాలి. జర్నలిస్టులు ఐక్యంగా ఉండాలి.

ఇది గడీల ప్రభుత్వం: పి. రాజారావు, సీఐటీయూ సీనియర్ నాయకులు



మీడియా, కార్మిక సంఘాలు, పార్టీలు సర్కార్‌కు భజనాపరులుగా ఉండాలని సీఎం కేసీఆర్ కోరుకుంటున్నారు. నిరసనలు తెలిపేందుకు ఉన్న ధర్నాచౌక్‌ను కూడా ప్రభుత్వం ఎత్తివేసింది. మీడియాతో పాటు రైతులు, కార్మికులు, ఉద్యోగులపైనా ఇదే నియంతృత్వాన్ని సీఎం కొనసాగిస్తున్నారు. ఇది పూర్తిగా గడీల ప్రభుత్వం, దొరల ప్రభుత్వం. ఉద్యోగులకు పెంచే జీతాలను బిచ్చం వేస్తున్నట్టు వ్యవహరిస్తున్నారు. ఇలాంటి నికృష్టపు పాలనను, ముఖ్యమంత్రిని ఉమ్మడి రాష్ట్రంలోనూ చూడలేదు. జర్నలిస్టులూ కార్మికసంఘాల్లో భాగమే. మీ పోరాటాల్లో మేమూ భాగస్వాములమవుతాం.

నిరంకుశ వైఖరికి నిదర్శనం: రత్నాకర్‌రావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



పత్రికలపై తీవ్రవ్యాఖ్యలు ఆయన నిరంకుశమైన వైఖరికి అద్దం పడుతున్నాయి. వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాలపైనా నిత్యం నిర్బంధం కొనసాగిస్తున్నారు. మీడియాపై సీఎం వైఖరిని కిందిస్థాయి వరకూ తీసుకుపోవాలి. సర్కారు తీరుకు ఎదురొడ్డి పోరాడాలి.

సీఎం పదవిని చీప్‌మ్యాన్‌గా మారుస్తున్నారు: హైమావతి, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



కేసీఆర్ తన వ్యాఖ్యలతో సీఎం (ముఖ్యమంత్రి) పదవిని చీప్‌మ్యాన్‌గా మారుస్తున్నారు. నవతెలంగాణ పత్రిక ప్రారంభసమయంలో ఆయన మాట్లాడిన మాటలను, ఇప్పుడు పత్రికపై చేసిన విమర్శలను పక్కపక్కన పెట్టి ఆయనకు చూపిస్తే కేసీఆర్‌కు కొంచెం జ్ఞానోదయం కలుగుతుంది. పోలీసులు ముఖ్యమంత్రికి గులాంగిరి చేయడం మానాలి. సీఎం నియంతగా, భూస్వామిగా వ్యవహరిస్తున్నారు. ప్రజలు భిక్షం అడగడం లేదు...హక్కులు అడుగుతున్నారనే విషయాన్ని గ్రహించాలి.

సీఎం వైఖరి సరికాదు: బి. బసవపున్నయ్య, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



తనకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారనే పేరుతో మీడియాపై సీఎం కేసీఆర్ దూషణలకు దిగడం సరికాదు. ఆయన మాట వింటే ఒకలాగా, వినకుంటే మరోలాగా వ్యవహరిస్తున్నారు. తన స్వంతమీడియాపై పోలీసులు దాడిచేస్తే గంటలో బాధ్యులపై చర్యలు తీసుకున్న సీఎం, ప్రగతిభవన్ ముందే దాడి జరిగితే కనీసం స్పందించలేదు. తెలంగాణ ఏర్పడ్డ సంవత్సరం వరకూ కొత్త అక్రిడిటేషన్స్ రాకుంటే ధర్నా చేశాం.

చంపడం కంటే పెద్దనేరం: పి ఆనందం, ఐఎఫ్‌డబ్ల్యూజే నాయకులు



నవతెలంగాణ పత్రికపై సీఎం చేసిన దాడి అమానుషం, ఇది చంపడం కంటే పెద్ద నేరం. సీఎం వ్యాఖ్యలను ఆధారం చేసుకొనే ప్రగతిభవన్ వద్ద మీడియా ప్రతినిధులపై ఐపీఎస్ అధికారి దాడి చేశారు. ఇది సీఎం ఖండించలేదంటే దీన్ని ప్రోత్సహించడమే అవుతుంది. వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని, వేజ్‌బోర్డు నిబంధనలను ప్రభుత్వం అమలు చేయాలి.

ఏసీపీపై ఎందుకు చర్యలు తీసుకోలేదు.?: రాధిక, జర్నలిస్టు



ప్రగతిభవన్ ముందు మీడియా ప్రతినిధులపై దాడిచేసిన ఏసీపీపై ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదో సీఎం చెప్పాలి. మహిళా జర్నలిస్టు అని కూడా చూడకుండా బూతులు తిడుతూ, దాడి చేసినా స్పందించలేదు. ఇది కేవలం ఒక మహిళా జర్నలిస్టుపై దాడి కాదు.. మొత్తం మీడియాపై జరిగిన దాడిగా చూడాలి. జర్నలిస్టుందరూ ఐక్యంగా ఉండాలి.

సీఎం అసహనం మంచిదికాదు: అ విరహత్‌ఖర్, హెచ్‌యూజే అధ్యక్షులు



నవతెలంగాణ పత్రికపై సీఎం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. సమాజంలో ఏ పత్రిక ఉండాలో లేదో అనేది ప్రజలు నిర్ణయించుకుంటారు. పత్రికల స్వేచ్ఛను నియంత్రించాలనుకోవడం సరికాదు. ఎన్నికల్లో 1.95కోట్ల ఓటర్లుంటే టీఆర్‌ఎస్‌కు కేవలం 64లక్షల ఓట్లే వచ్చాయనే విషయం మరిచిపోవద్దు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.